ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఖమ్మం
fb.com/vaartha Digital

ముజిబుర్ రహ్మాన్ జాతిపిత గుర్తింపు రద్దు
హమాస్ కొత్త అధినేతగా అల్‌హద్దాద్! 5

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
5-6-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 124 పేజీలు: 8+16 వెల: 6.50

## రెండు విడతలుగా జన, కుల గణన




### తొలుత కొన్ని రాష్ట్రాలలో 2026 అక్టోబర్ 1 నుంచి.. తర్వాత మార్చి 1 నుంచి రెండో విడత

### కేంద్ర కేబినెట్ నిర్ణయం

**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశవ్యాప్త జనగణనను 2027 సంవత్సరంలో నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ కీలక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి జనగణనతో పాటే తొలిసారిగా కులగణన కూడా నిర్వహిస్తామని తెలిపింది. బుధవారం విడుదల చేసిన అధికారిక నోటిఫికేషన్‌లోనూ ఈవిషయాన్ని ప్రస్తావించింది. నోటిఫికేషన్ ప్రకారం, జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తారు. సూచన తేదీగా 2027 మార్చి 1ని పరిగణించనున్నారు. అయితే లడఖ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి మంచుతో కప్పబడిన, వాతావరణ అననుకూల మంచుకురిసే ప్రాంతాల్లో ముందుగానే జనాభా గణనను నిర్వహిస్తారు. ఇలాంటి ప్రాంతాల్లో జనగణన నిర్వహణకు సూచన తేదీగా 2026 అక్టోబర్ 1ని నిర్ణయించారు. 2027లో కుల గణనతో పాటు జనగణన >>2

✦ విజయోత్సవంలో విషాదం..

## బెంగళూరు స్టేడియంలో తొక్కిసలాట

### 11 మంది మృతి, 50 మందికి గాయాలు




చిన్నస్వామి స్టేడియం ఆవరణలో తోపులాట దృశ్యం


తోపులాటలో గాయపడిన బిడ్డను ఆసుపత్రికి తరలిస్తున్న ఓ పోలీసు కానిస్టేబుల్

**కోహ్లీ బృందం అభినందన సమావేశానికి తరలివచ్చిన లక్షలాది అభిమానులు**

**చిన్నస్వామి స్టేడియం గేట్లు బద్దలుకొట్టి తోసుకువచ్చిన ఘటనలో పలువురికి తీవ్ర గాయాలు**

**పరిస్థితి అదుపు తప్పడంతో లాఠీఛార్జి.. న్యాయ విచారణకు ఆదేశించిన సిఎం సిద్ధరామయ్య**

**మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల పరిహారం.. ప్రధాని మోడీ, బిసిసిఐ దిగ్భ్రాంతి**

### అభిమానులకు క్షమాపణ చెప్పిన డికె

**బెంగళూరు, జూన్ 4 :** ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన అత్యంత విషాదకర ఘటనపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం >>2

**బెంగళూరు, జూన్ 4:** ఐపిఎల్ 18వ సీజన్‌లో ఛాంపియన్‌ట్రోఫీ గెలుచుకుని స్వరాష్ట్రానికి తిరిగివచ్చిన రాయల్‌ఛాలెంజర్స్ విజయోత్సవ వేడుకలు విషాదాన్ని నింపాయి. భారీ ఎత్తున తరలివచ్చిన కోహ్లీ, ఆర్సీబీ అభిమానులు తోసుకు రావడంతోపోలీసులకు సైతం కట్టడిచేయడం కష్టం అయింది. ఈ >>2


అభిమానులను అదుపు చేస్తున్న పోలీసులు

## రాజకీయ దురుద్దేశమే

### ఏం తప్పు చేశారని కెసిఆర్‌కు నోటీసులు?

**ఆయన్ని బద్నాం చేసేందుకే కాళేశ్వరం కమిషన్**

**చంద్రబాబు జలదోపిడి చేస్తున్నా స్పందించని బిజెపి**

**గోదావరి నీటిలో వెయ్యి టిఎంసిల హక్కు సాధించేదాకా పోరాడుతాం: తెలంగాణ జాగృతి మహాధర్నాలో ఎమ్మెల్సీ కవిత**

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 4, ప్రభాతవార్త:** రాజకీయ దురుద్దేశ్యంతోనే కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. కాళేశ్వరం కమీషన్ కేసీఆర్‌కు నోటీసులు జారీ చేయటాన్ని నిరసిస్తూ బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి కవిత మాట్లాడుతూ కేసీఆర్ ఏం తప్పు చేశారని నోటీసులు ఇచ్చారు, తెలంగాణ భూములకు నీళ్లు ఇవ్వటం కేసీఆర్ చేసినా తప్పా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే మొత్తం తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్లేనన్నారు. కళేశ్వరం కమీషన్ కాదు, అది కాంగ్రెస్ కమీషన్, రాజకీయ కమీషన్ అని విమర్శించారు. తెలంగాణను సస్యశ్యామలం కావాలని కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని, దాదాపు 40 లక్షల ఎకరాలకు నీళ్లు అందించే ప్రాజెక్కుపై కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, కేసీఆర్‌ను బద్నాం చేయటానికి మాత్రమే కాళేశ్వరం కమీషన్ వేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మూడు బ్యారేజీలే కాదని, ఆ ప్రాజెక్టులో 21 పంప్ హౌజ్‌లు, 15 రిజర్వాయర్లు, 200 కిలోమీటర్ల మేర టన్నెల్ ఉందని, 1500 కిలోమీటర్ల మేర కాలువలు ఉన్నాయని, ఎత్తిపోసిన మట్టితో దాదాపు 300 పిరమిడ్లు కట్టవచ్చని, కాళేశ్వరంకు వాడిన స్టీల్‌తో 100 ఐఫిల్ టవర్లు కట్టవచ్చని, కాళేశ్వరంలో పోసిన కాంక్రీట్‌తో 50 బూర్జు ఖలీఫాలు కట్టవచ్చని, అంత పెద్ద ప్రాజెక్టు పూర్తయితే 35శాతం తెలంగాణ భూభాగానికి నీళ్లు అందిస్తుందని తెలిపారు. కేసీఆర్‌ది గట్టి గుండె కాబట్టి అంత పెద్ద ప్రాజెక్టు నిర్మించారని, కాంగ్రెస్ పార్టీ నాయకులకు కలలో కూడా అంత పెద్ద ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన రాదని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ హయాంలో జలయజ్ఞం పేరుతో ధనయజ్ఞం చేస్తూ 90శాతం పనులను మెఘా కృష్ణారెడ్డి కంపెనీకి ఇచ్చారని, కాళేశ్వరం ప్రాజెక్టులో 15 పంప్‌హౌజ్ పనులు చేసిన మెఘాకృష్ణారెడ్డిని కమీషన్ ముందుకు పిలిచే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేకపోవటం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. >>2



బుధవారం ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

## ఉద్యోగుల డిమాండ్లపై నేడు కీలక నిర్ణయం?

### రిటైర్మెంట్ వయసు పెంపుపై స్పష్టత?

### కేబినెట్ సమావేశంలో కొత్తపోస్టుల మంజూరు, రాజీవ్ యువవికాసంపై ప్రకటన!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్4:** రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగే తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక అంశాలపై నిర్ణయం జరుగనుంది. ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ భేటీ కానుంది. ఉద్యోగులు 5 డిఏలు కోరగా ఒక డిఏ వెంటనే విడుదల చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని, రెండో డిఏ చెల్లింపు త్వరలోనే చెల్లించేందుకు సన్నద్ధత వ్యక్తం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన ఉన్నతాధికారుల కమిటీ తన నివేదికపై మంత్రివర్గ ఉప సంఘం చేసిన సిఫార్సులను కేబినెట్ భేటీలో చర్చించనున్నారు.

అలాగే రూ.11వేల కోట్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఓ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. విడతల వారీగా చెల్లింపులకు సన్నద్ధత వ్యక్తం చేసే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 61 నుంచి 62 ఏళ్లకు పెంచేందుకు ప్రభుత్వం కేబినెట్ సమావేశంలో ప్రధాన అంశంగా చర్చించవచ్చునని తెలుస్తోంది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కొత్త పోస్టుల మంజూరు కోసం జాబ్ కేలండర్‌పై చర్చించవచ్చునని తెలుస్తోంది. పూర్తి స్థాయి స్క్రీనింగ్ జరిగాక రాజీవ్ యువ వికాసం అమలు చేసే అంశానికి కేబినెట్‌లో క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. ఇందులో భాగంగా యువతకు శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్కిల్ డవలప్ మెంట్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి ఈ సమావేశంలో చర్చకు రానున్నట్టుగా తెలిసింది. ధాన్యం కొనుగోలు సమస్యలు, వానాకాలంలో పంటలు, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులపై, ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ప్రభుత్వ పబ్లిక్ స్కూల్స్‌పై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కాళేశ్వరం అవకతవకలకు సంబంధించి విజిలెన్స్ ఇచ్చిన రిపోర్టుపై ఈ భేటీలో చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. లోపాల పరిశీలన, బాధ్యుల నిర్ధారణ, తదుపరి చర్యలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకునే అవకాశముందని సమాచారం.

ఫాల్కన్ స్కాం:

## మరో ఇద్దరి అరెస్టు

### కోట్లాది రూపాయల గోల్‌మాల్ కేసు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా వేలాది మంది డిపాజిటర్ల నుంచి అధిక వడ్డీ పేరిట కోట్లాది రూపాయలు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఫాల్కన్ ఇన్వాయిస్ కంపెనీ గోల్‌మాల్ వ్యవహారంలో కంపెనీ ఆపరేషన్స్ హెడ్‌గా వున్న సందీప్ కుమార్‌తో పాటు అతనికి ఆశ్రయం ఇచ్చిన మరో నేరగాడిని సిఐడి అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన నిందితుల సంఖ్య తొమ్మిదికి చేరింది. పట్టుబడ్డ ఇద్దరు నిందితుల నుంచి నుంచి మూడు ఖరీదైన కార్లతో పాటు ఇంకొన్ని వస్తువులను జప్తు చేశారు. సిఐడి డిజి శిఖా గోయల్ దీనికి సంబంధించిన వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో మాదాపూర్ కేంద్రంగా పనిచేసి అమాయకులను ముంచిన ఫాల్కన్ ఇన్వాయిస్ కంపెనీ వ్యవహారం వెలుగు చూడడం తెలిసిందే. దీనిపై సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా అనంతరం ఈ కేసును సిఐడికి బదిలీ చేశారు. ఈ కంపెనీ దేశ వ్యాప్తంగా 7056 మంది డిపాజిటర్ల నుంచి 4215 కోట్ల రూపాయలను వసూలు చేసి బిచాణా ఎత్తేసింది. అయితే దీనిపై పోలీసుల వద్ద వున్న సమాచారం మేరకు 4065 మంది బాధితులు 792 కోట్ల రూపాయలు పోగొట్టుకున్నారు. ఈ కేసులో నిందితులపై మూడు కేసులు నమోదు కాగా >>2

## వృద్ధ రైతుపై పోలీసు జులుం

**మెడపట్టుకొని గెంటివేత**

**నిర్మల్ జిల్లాలో దారుణం**

**మంత్రి సీతక్క ఆగ్రహం**

**ఎస్ఐ రాంచందర్ సస్పెన్షన్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్4:** ఓ వృద్ధ రైతుపై ఏఎస్ఐ ప్రవర్తించిన తీరు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. భూ భారతి చట్టం ప్రజలకు చుట్టం అంటూ ప్రభుత్వం చెబుతుంటే.. రెవెన్యూ సదస్సులతో ప్రజల భూ సమస్యలు తీర్చేందుకు ప్రణాళికలు రచిస్తుంటే.. రెవెన్యూ సదస్సుల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసుల వ్యవహార శైలి మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. అందుకు సాక్ష్యంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామపంచాయతీలో జరిగిన ఘటన నిలుస్తోంది. విషయం రాష్ట్ర సర్కార్‌కు దృష్టికి రావడంతో వెంటనే చర్యలు తీసుకోవాలంటూ మంత్రి సీతక్క, జిల్లా ఎస్పీని ఆదేశించారు. భూభారతి రెవెన్యూ సదస్సులో భాగంగా దరఖాస్తు స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అందులో >>2



## 'నైరుతి'బలహీనం!

### మళ్లీ మండుతున్న ఎండలు

### తెలంగాణ, ఎపిలో భిన్న వాతావరణం

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో భిన్న వాతావరణం కనిపిస్తుంది. రోళ్లు పగిలే ఎండలు కాస్తాయని భయపడే రోహిణి కార్తెలో వరుణుడు విరుచుకుపడ్డాడు. ఈ యేడు ముందుగానే వచ్చిన నైరుతి రుతుపవనాల రాకతో ఇటు తెలంగాణ అటు ఆంధ్రా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా రోజుల తరబడి భారీ వర్షాలు కురవడంతో ఇక ఎండాకాలం అయిపోయినట్టే అని ప్రజలు భావించారు. కానీ, అప్పుడే పూర్తవలేదన్నట్టుగా గత నాలుగైదు రోజులుగా భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. రెండ్రోజులుగా తెలంగాణతో పాటుగా కోస్తాంధ్ర తీరంలో ఉన్న జిల్లాల్లో ఎండలు ఇరగకాస్తున్నాయి. ఉక్కపోత కూడా పెరగడంతో ప్రజలు అల్లాడుతున్నారు. నైరుతి మందగమనంతోనే ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణశాఖ అంచనా వేసింది. పశ్చిమ దిశ నుంచి వేడి పొడిగాలులు మొదలవ్వడంతో పాటు ఎండల తీవ్రత పెరిగిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక తెలంగాణలో ఇలాంటి వాతావరణ పరిస్థితులు మరో 5 రోజులపాటు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో పశ్చిమ, నైరుతి దిశల నుంచి కిందిస్థాయి గాలులు వీస్తుండటంతో రాబోయే ఐదురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని తెలిపింది. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో అక్కడక్కడ గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు రాగాల రెండు రోజులలో >>2



ముంబయి, చెన్నై, విశాఖ

## మునిగిపోతాయా?

### శరవేగంగా కరుగుతున్న హిమానీనదాలు

**మూడు నగరాలకు జల ప్రమాదం ఉందంటున్న నిపుణులు**

**శతాబ్దం చివరకు సగటు ఉష్ణోగ్రత $2.7^0$ పెరిగే సూచన**

**న్యూఢిల్లీ, జూన్ 4:** అభివృద్ధి పేరుతో మానవ జాతి సృష్టిస్తున్న విధ్వంసం కారణంగా ఈ శతాబ్దం చివరి నాటికి భూమి సగటు ఉష్ణోగ్రత 2.7 సెంటిగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని దీనివల్ల ప్రపంచంలోని పలు దేశాలు మునిగిపోయే ముప్పు ఎదుర్కొంటాయని ఒక సర్వే నివేదికసంచలనం సృష్టిస్తోంది. పైగా అందులో భారతదేశం కూడా ఉందంటూ ముంబై, విశాఖ, చెన్నై నగరాలు జల సమాధి అవుతాయని >>2




## అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇక ఎగ్ బిర్యానీ

### ప్లే స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్ జూన్ 4,ప్రభాతవార్త:** చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అంగన్వాడి కేంద్రాల్లో అందిస్తున్న విద్యను, ఆరోగ్య భద్రతను మెరుగుపరుచుకునే లక్ష్యంతో మనమంతా పనిచేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందిస్తున్న ఆహారపదార్థాలను మరింత రుచికరంగా మారుస్తామని, వారంలో ఒకటి రెండు సార్లు ఎగ్ బిర్యానీ వడ్డించేలా మెనూ మార్చబోతున్నట్లు చెప్పారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణ అభివృద్ధి సంస్థలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ మేధోమధన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీలు, బాలింతలు నేల మీద కూర్చోవడానికి ఇబ్బందులు పడుతున్నారని వారి ఇబ్బందులను తొలగించేందుకు అంగన్వాడి కేంద్రాలకు బెంచీలను సరఫరా చేస్తామన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఈ ఏడాది 25 శాతం అడ్మిషన్లు పెరిగేలా సిబ్బంది చిత్తశుద్ధితో పని చేయాలని మంత్రి సీతక్క అన్నారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఉదయం గంటను మోగించడంతో చిన్నారుల్లో ఉత్సాహం క్రమశిక్షణ పెరుగుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న విద్యను, ఆరోగ్య భద్రతను మెరుగుపరుచుకునే లక్ష్యంతో పనిచేయాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు దశాబ్ద కాలంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చామని, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను రెట్టింపు చేశామని, పంచాయతీరాజ్ శాఖలో 93 వేల మంది చిరు గ్రామీణ ఉద్యోగులకు గ్రీన్ ఛానల్ లో జీతాలు ఇస్తున్నామన్నారు.



అసోం మోరిగావ్ జిల్లాలో బుధవారం మోకాలి లోతు వరదనీటిలో నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ

## రాజకీయ దురుద్దేశమే

>> మేడిగడ్డకు చిన్న చిన్న మరమ్మత్తులు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పొలాలను ఎండబెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం కమీషన్ల కోసం, కాంట్రాక్టర్ల కోసం మాత్రమే పనిచేస్తోందని విమర్శించారు. తెలంగాణ నీళ్లను ఏపీకి తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం చేపడుతున్న బనకచర్ల ప్రాజెక్టును అటు బీజేపీ నాయకులు చంద్రబాబునాయుడు ఎన్డీఏలో ఉన్నందును ప్రశ్నించటం లేదు, ఇటు రేవంత్‌రెడ్డి కూడా వ్యతిరేకించటం లేదని ధ్వజమెత్తారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపే బాధ్యత ఈటెల రాజేందర్ తీసుకోవాలని, కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకువచ్చే బాధ్యత కూడా ఈటెల రాజేందర్ తీసుకోవాలని కోరారు. గోదావరి నీటిలో వెయ్యి టీఎంసీల హక్కును సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. వివిధ జిల్లాల నుండి ధర్నాకు వచ్చే జాగృతి కార్యకర్తలను అరెస్ట్ చేశారని, ప్రభుత్వం ఎందుకు ఇంత భయపడుతోందని ప్రశ్నించారు. ధర్నాను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని, హైదరాబాద్‌లో ధర్నా చేయనివ్వకపోతే జిల్లాల్లో, గల్లీల్లో ధర్నా చేస్తామనిహెచ్చరించారు. తెలంగాణపౌరుషాన్నిచూపించాల్సిన సమయం వచ్చిందని, ప్రజలందరూ సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో జాగృతి కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## రెండు విడతలుగా జన, కులగణన

>> నిర్వహించే వివరాలతో 2025 జూన్ 16న అధికారిక గెజిట్‌ను భారత ప్రభుత్వం ప్రచురిస్తుందని తెలుస్తోంది. 1948 జనాభా లెక్కల చట్టం, 1990 జనాభా లెక్కల నియమాల ప్రకారం ప్రతి పదేళ్లకోసారి జనగణన నిర్వహిస్తుంటారు. 2027లో జనగణనతో పాటే కులగణన నిర్వహిస్తారు. జాతీయ జనాభా లెక్కల ప్రక్రియలో కులాల గణనను భాగంగా చేయడం ఇదే తొలిసారి. కులగణన సమాచారం ఆధారంగా భారత ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలను తీసుకోవచ్చని రాజకీయ పార్టీలు, పలు రాష్ట్ర ప్రభుత్వాలు వాదించాయి. ఆ మేరకు ప్రభుత్వ విధానపరమైన ప్రణాళికలను, సంక్షేమ కార్యక్రమాలను రూపొందించొచ్చని సూచించాయి. ఈ నేపథ్యంలో జనగణనతో పాటే కులగణన నిర్వహణకు అంగీకారం తెలుపుతూ కేంద్ర సర్కారు నుంచి ప్రకటన వెలువడింది. మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. 2010లో రూపొందించిన ఇళ్ల జాబితా ప్రకారం 2011 తొలినాళ్లలో జనగణనను నిర్వహించారు. 2011లో జరిగిన జనగణన ప్రకారం మన దేశ జనాభా 121 కోట్లకుపైనే ఉంది. జనాభా 17.7 శాతం మేర పెరిగిందని అప్పట్లో గుర్తించారు. 2021లోనూ జనగణన నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. 2020 ఏప్రిల్ నుంచి సమాచార సేకరణ ప్రక్రియను ప్రారంభించాలని భావించారు. అయితే కరోనా మహమ్మారి వ్యాప్తి, లాక్‌డౌన్ల నేపథ్యంలో ఆ ప్రక్రియను వాయిదా వేశారు. 2027లో జనగణన ప్రక్రియ పూర్తయ్యాక ఆ సమాచారం ఆధారంగా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేసే అవకాశం ఉంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దులను కొత్త జనసంఖ్యకు అనుగుణంగా అప్‌డేట్ చేస్తారు. దీంతో వివిధ రాష్ట్రాల్లోని లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్యలోనూ మార్పు రానుంది. ప్రతి ఎంపీ లేదా ఎమ్మెల్యే దాదాపు ఒకే సంఖ్యలో ప్రజలకు ప్రాతినిధ్యం వహించేలా ఈ మార్పులు జరుగుతాయి.

1971 జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. నాటితో పోలిస్తే, మన దేశ జనాభా రెట్టింపు అయింది. ఆ మేరకు లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 848కి పెరగొచ్చని 2019లో నిర్వహించిన ఒక అధ్యయనంలో గుర్తించారు. 888 మంది ఎంపీలకు సీట్లతో కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించారు. ఆమేరకు భవిష్యత్తులో సీట్లు పెరుగుతాయని పరిశీలకులు భావిస్తున్నారు. లోక్‌సభ సీట్ల పెంపు అంత భారీ స్థాయిలో జరగాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే ప్రస్తుత లోక్‌సభ సీట్ల పరిమితి 550 మాత్రమే. జన,కులగణనలకోసం జనాభా విభాగం రిజిస్ట్రార్‌జనరల్ 30 ప్రశ్నలతోకూడిన ప్రశ్నావళిని రూపొందించింది. జనాభాసర్వేలో ఈప్రశ్నలను వేసి ప్రజలనుంచి జవాబులు తీసుకోవాలి. 2011 గణాంకాలనుచూస్తే భారత జనాభా 121 కోట్లుగా ఉంది. లింగనిష్పత్తి కూడా ప్రతి వెయ్యిమంది పురుషులకు 940 మంది మహిళలున్నారు. అక్షరాస్యత 74.04శాతంగా ఉంది. 2001 నుంచి 2011 వరకూ జనాభావృద్ధిరేటు 17.64శాతంగా ఉందని ఆనాడుప్రకటించారు. అయితే ఈసారి నియోజకవర్గాల పునర్విభజనలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లాంటి దక్షిణాది రాష్ట్రాలు 26 లోక్‌సభ సీట్లను కోల్పోతాయనే అంచనాలు వెలువడుతున్నాయి.

## మరో ఇద్దరి అరెస్టు

>> ఇప్పటి వరకు ఏడుగురు నిందితులు అరెస్టయ్యారు. దీనిపై సిఐడి అధి కారులు విచారిస్తున్న క్రమంలో కంపెనీ ఆపరేషన్ హెడ్‌గా వున్న ఛైర్మన్ అమర్‌దీప్ తమ్ముడు సం దీప్ కుమార్ (37) గురించి సమాచారం అందింది. ఈ స్కాం వెలుగు చూడగానే ఇతను దుబాయ్ పారిపోయాడు. అనంతరం నేపాల్‌కు వచ్చి అక్కడి నుంచి బి హార్‌లో అక్రమంగా వచ్చాడు. అనంతరం బిహార్‌లో తన బం ధువుల ఇంట్లో తలదాచుకున్నాడు. దీని తరువాత పలుచోట్ల మకాం మార్చి శివార్లలోని గండిపేట్ వద్ద కంపెనీ ఉద్యోగి అయిన రవి కుమార్ (26) ఇంట్లో తల దాచుకున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సిఐడి అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు నిందితుల నుంచి మెర్సిడెజ్ బెంజ్ కా రు, రేంజ్ రోవర్ కారు, ఇన్నోవా క్రిస్టి కారు (వీటి విలువ రెండున్నర కోట్ల రూపాయలు) 14 కో ట్ల రూపాయల విలువ చేసే పత్రాలు, మూడు సెల్‌ఫోన్లు. ఐ డి కార్డులు కొంత నగదు జప్తు చేశారు. ఈ కేసులో మిగతా నిందితుల కోసం గాలింపు జరుగుతోంది.

## రాష్ట్రంలో ఏడుగురు ఐపిఎస్‌లు బదలీ

**హైదరాబాద్, జూన్4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏడుగురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ, పదొన్నతులు కల్పిస్తూ హోంశాఖ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా అభిలాష బిస్త్ కాగా సీఐడీ చీఫ్‌గా చారుసిన్హా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్‌గా శిఖాగోయల్, మెదక్ ఎస్పీగా డీవీ శ్రీనివాస్‌రావు, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీగా చైతన్యకుమార్, కొమరభీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా పాటిల్ కాంతిలాల్, చార్మినార్ మల్టీజోన్-6 డీఐజీగా తఫ్సీర్ ఇక్బాల్‌లు ఉన్నారు.

## జూలై 21నుంచి వర్షాకాల పార్లమెంటు

### ఆగస్టు 12 దాకా సమావేశాలు

**న్యూఢిల్లీ, జూన్ 4:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జులై 21వ తేదీనుంచి ఆగస్టు 12వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి కిరెన్ రిజిజు తెలిపారు. ఆర్థికవ్యవహారాల కేబినెట్‌కమిటీ రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమయి తేదీలను సిఫారసుచేసిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సిఫారసులను రాష్ట్రపతికి పంపిస్తామని, సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ఆమోదం అవసరమని పార్లమెంటరీ వ్యవహారాలమంత్రి తెలిపారు. ఇప్పటికే దేశంలోని 16 ప్రతిపక్షాలు ఆపరేషన్ సింధూర్; పహల్గాంవ్ దాడిలపై చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేస్తున్నాయి. అలాగే ప్రధానిమోడీకిసైతం లేఖరాసాయి. ఈ డిమాండ్‌పై మంత్రి స్పందిస్తూ ప్రతి సమావేశం మాకు ప్రత్యేక సమావేశామేనని నిబంధనలను అనుసరించి అన్న ముఖ్యమైన అంశాలను చర్చిస్తామని ఆయన ధీమా వ్యక్తంచేసారు. ఉభయసభల బిజినెస్ అడ్వయిజరీ కమిటీలు ఈ సమావేశాలకు సంబంధించి అజెండా, చర్చలు కీలకఅంశాలను నిర్ణయించేందుకు సమావేశం అవుతుందని కిరెన్ రిజిజు చెప్పారు. ఆపరేషన్ సింధూర్, పహల్గాం ఉగ్రదాడిపై పార్లమెంట్‌ను ప్రత్యేకసమావేశపరచాలని 16 విపక్షాలు డిమాండ్ చేసాయి. నిబంధనలప్రకారమే చర్చిస్తామని ఎన్డీయే కూటమి బదులిచ్చింది. నిజానికి బడ్జెట్ సమావేశాల తర్వాత మళ్లీ వర్షాకాల సమావేశాలు జరుగుతున్నాయి. బడ్జెట్‌సమావేశాలు ఈ ఏడాది జనవరి 31న ప్రారంభం అయి ఏప్రిల్ నాలుగో తేదీ ముగిసిన సంగతి తెలిసిందే.

## 'నైరుతి' బలహీనం

>> ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయని చెప్పింది. నల్లగొండలో గరిష్టంగా 38.5 డిగ్రీలు, కనిష్టంగా మహబూబ్‌నగర్‌లో 32.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇదిలా ఉంటే, అటు ఆంధ్రాలో రుతుపవనాల మందగమనం కనిపిస్తుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా వేసవి పరిస్థితులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజులుగా తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అరేబియా సముద్రం, బంగాళాకాతంలో రుతుపవనాల కదలిక బలహీనంగా ఉండడంతో అనేక ప్రాంతాల్లో తిరిగి వేసవి పరిస్థితులు ఏర్పడ్డాయంటూ వాతావరణ శాఖ వెల్లడించింది.

## వారం - వర్జ్యం

తేది : 05-06-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
దశమి రా. 2.17
హస్త పూర్తి
వర్జ్యం మ. 1.02-2.50
దు. ఉ. 9.56-10.48, 2) మ. 3.10-సా. 4.02
శుభసమయం: ఉ. 7.45-8.15, 2) సా. 4.45-5.25
రాహుకాలం - మ. 1.30-3.00

## వార్తాఫలం

- **మేషం :** ఇతరుల విషయాలలో జోక్యంతగదు. ముఖ్యమైన విషయాలలో మాత్రం పరీక్షాకాలంగావుంటుంది.
- **వృషభం :** ఆర్థిక పరిస్థితి సంతృప్తి కరంగా వుంటుంది. రుణ వత్తిడులు తొలుగు తాయి. వస్తులాభం.
- **మిథునం:** ఆర్థిక పరిస్థితి కొంతవరకు మెరుగుపడుతుంది. సంతానం సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు.
- **కర్కాటకం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. అకారణంగా వివాదాలు ఏర్పడవచ్చు.
- **సింహం:** పనులు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.
- **కన్య :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.
- **తుల :** వృత్తి, వ్యాపారాలలో ఆటు పోట్లు ఎదురై చికాకులుపెడతాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.
- **వృశ్చికం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. శ్రమానంతరం పనులు పూర్తి కాగలవు.
- **ధనుస్సు:** అనుకోని అతిథుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.
- **మకరం:** సంఘంలో గౌరవం లభిస్తుంది. కొత్త విద్యలపై ఆసక్తి చూపుతారు. వాహన సౌఖ్యం.
- **కుంభం:** జీవితభాగస్వామి నుండి ఆస్తి లాభం పొందుతారు. వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు..
- **మీనం :** శ్రమకు తగిన ఫలితం దక్కదు. ఆరోగ్య, వాహనాల విషయాలలో నిర్లక్ష్యం తగదు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బెంగళూరు చిన్నస్వామి స్టేడియానికి భారీ ఎత్తున తరలివచ్చిన రాయల్‌ఛాలెంజర్స్ అభిమానులు

# స్టేడియంలో తొక్కిసలాట

>> తొక్కిసలాటలో 11 మంది చనిపోగా 50 మందికిపైగా తీవ్ర గాయాలపాలయ్యారు. 18 ఏళ్ల నిరీక్షణ తర్వాత ట్రోఫీని గెలుచుకని బెంగళూరుకు ప్రత్యేక విమానంలో వచ్చిన కోహ్లీ బృందానికి కర్ణాటక ప్రభుత్వం అభినందన సభ ఏర్పాటుచేసింది. నగరంలోనిచిన్నస్వామి స్టేడియంలో ఈకార్యక్రమం ఏర్పాటుచేసారు. కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసభ ఏర్పాటయింది. ఈ కార్యక్రమానికి ఉచిత పాస్‌లు అందించినట్లు కూడా తేలింది. పాస్‌లు లేని అభిమానులు ఒక్కసారిగా భారీ సంఖ్యలో వచ్చిపడ్డారు. భద్రతా బలగాలు ఉన్నప్పటికీ అభిమాన గుంపులు ఎక్కువ కావడంతోపరిస్థితి అదుపు తప్పింది. 18వ నెంబరు గేట్ వద్ద పెద్ద ఎత్తున తొక్కిసలాటజరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీఛార్జిచేసారు. అయినా కూడా అభిమానులు ఎక్కడా తగ్గలేదు. ఎయిర్‌పోర్టునుంచి చిన్నస్వామి స్టేడియం వరకూ ఆర్సీబీ జెండాలు చేతబూనిన అభిమానులు ఇంత భారీ సంఖ్యలో వస్తారని ఎవ్వరూ ఊహించలేదు. లక్షమందికిపైగా వచ్చినట్లు కెసిఎ అంచనావేసింది. దారిపొడవునా అభిమానులు గోడలు, చెట్లు ఎక్కి కోలాహలంగా కనిపించారు. ఒకదశలో రెండోనెంబరు గేటునుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు దూసుకువచ్చారు. లాఠీఛార్జిచేయడంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపుతప్పి ఒకరినొకరు తోసుకుంటూ పరుగులు తీసారు. ఈ క్రమంలోనే 11 మంది మృతిచెందారు. 50మందికిపైగా గాయపడ్డారు. వారిని సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. విషమంగా ఉన్న ముగ్గురిని బౌరింగ్ ఆసుపత్రికి తరలించారు. వీరు అక్కడ చనిపోయారని ప్రకటించారు. వైదేహి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో మరో నలుగురు చనిపోయారు. కబ్బన్ పార్క్‌వద్ద ఉన్న గేటునుంచి తోసుకురావడంవల్లనే తొక్కిసలాటజరిగి ఈ ఘోరానికి దారితీసిందని పోలీసులు అంచనావేసారు. గాయపడిన కొందరికి ఆర్సీబీ అభిమానులే సిపిఆర్‌చేసారు. స్టేడియం చుట్టూ కూడాట్రాఫిక్ సమస్య రావడంతో ఎక్కడికక్కడ జామ్ అయిపోయింది. దీనితో గాయపడిన వారిని తరలించడం కూడా పోలీసులకు కష్టమయింది. మృతుల కుటుంబీకులు బౌరింగ్‌ఆసుపత్రి ఆవరణలో రోదించడం కనిపించింది. విధాన సౌధ వద్ద కొందరు స్పృహతప్పిపడిపోగా మరికొందరు స్టేడియం గోడదూకి లోనికి వచ్చేందుకు ప్రయత్నించి తీవ్రగాయాలపాలయ్యారు. బాధితులందరినీ బౌరింగ్‌ఆసుపత్రి, వైదేహి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రు సమీపంలోని మరికొన్ని క్లినిక్‌లకు తరలించారు.

**తోసుకురావడంవల్లే దుర్ఘటన: సీఎం సిద్ధరామయ్య**

విజయోత్సవ వేడుకల్లో తమ ఐపిఎల్ టీమ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానులు చిన్నగేటునుంచి స్టేడియం లోపలికి తోసుకురావడంవల్లనే ఈ దుర్ఘటన జరిగిందని సీఎం సిద్ధరామయ్య పేర్కొన్నారు. చిన్నస్వామి స్టేడియంలో రెండునుంచి మూడు లక్షలమంది అభిమానులు వచ్చారని, ఇంతమంది వస్తారని ఎవ్వరూ ఊహించలేదన్నారు. ఈ స్టేడియం కెపాసిటీ కేవలం 35 వేలకు మించి లేదని ముఖ్యమంత్రి తెలిపారు. స్టేడియంకు చిన్నగేటే ఉందని, వారంతా గేటును బద్దలుకొట్టి లోపలికి రావడంతో తొక్కిసలాట జరిగి ఈ గోరం జరిగిపోయిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలచొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. మృతుల్లో ఎక్కువమంది యువకులే ఉండటం పట్ల విచారం వ్యక్తంచేసారు. ఈ ఘటనపై న్యాయవిచారణకు ఆదేశిస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు.

**ప్రధానిమోడీ సంతాపం**

ఐపిఎల్ విజయోత్సవాలు, అభినందన సభలో జరిగిన ఘోరంపై ప్రధాని నరేంద్రమోడీ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఆనందోత్సాహాలవేళ అనుకోని దుర్ఘటన ఎంతో బాధించిందని మృతుల కుటుంబాలకు మోడీ తన సానుభూతిని ప్రకటించారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు జరిగిన నష్టం ఎవ్వరూ పూడ్చలేనిదని, ఆభగవంతుడు ఆకుటుంబాలకు ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు మోడీ ప్రకటించారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి కూడా ఈ విషాదంపై దిగ్భ్రాంతి వ్యక్తంచేసి మృతుల కుటుంబాలకు ప్రగాఢసంతాపం ప్రకటించారు. క్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని పేర్కొంటూ కర్ణాటక ప్రభుత్వ అధికారులను ఈప్రమాదం వివరాలను ఆరాతీసారు.

**ఎయిర్‌పోర్టులో ఆర్సీబీ టీమ్‌కు ఘనస్వాగతం**

అంతకుముందు ప్రత్యేక విమానంలో ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్‌కు డిప్యూటి సీఎం డికెశివకుమార్ స్వయంగా వెళ్లి స్వాగతం పలికారు. కోహ్లీ, కృనాల్‌పాండ్యా, టిమ్‌డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు పుష్పగుచ్ఛం ఇచ్చి వెలకమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సుల్లో విధాన సౌధకు చేరుకుంది. అక్కడినుంచి చిన్నస్వామి స్టేడియంకు భారీ ఎత్తున బందోబస్తుతో చేరుకున్న టీమ్‌ను చూసేందుకు ఫ్యాన్స్ ఎగబడటంతో భారీ విషాదం చోటుచేసుకుంది. దీనితో అభినందన సభను కొంతసేపు నిలిపివేసారు.

**బిసిసిఐ రియాక్షన్**

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం విషాదంపై బిసిసిఐ స్పందించింది. ఆర్సీబి విజయోత్సవానికి మరింత మెరుగైన రీతిలో ఏర్పాట్లుచేయాలి ఉందని అభిప్రాయం వ్యక్తంచేసింది. క్రికెటర్లను చూసేందుకు అభిమానులు పోటీపడతారనే విషయం అందరికీ తెలుసునని విజయోత్సవం నిర్వాహకులు ముందుజాగ్రత్తచర్యలు అభిమానుల భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లుచేయాల్సింది అని బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు ఏర్పాట్లలో లోపాలున్నట్లుకనిపిస్తోందన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపిన బిసిసిఐక్షతగాత్రులు సత్వరమే కోలుకోవాలని ఆకాంక్షను వ్యక్తంచేసారు.

## అభిమానులకు క్షమాపణ చెప్పిన డికె

>> చేశారు. మృతులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ తొక్కిసలాట ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆర్సీబీ అభిమానులకు, నగర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఇంతటి ఘోరవిపత్తు జరుగుతుందని ఊహించలేదని, స్టేడియం సామర్థ్యంకంటే ఐదురెట్లు ఎక్కువమంది అభిమానులు రావడం, తమ అభిమాన క్రికెటర్లనుచూసేందుకు తోసుకురావడంతో పరిస్థితి అదుపు తప్పి ఈ దుర్ఘటన జరిగిందని అన్నారు. నగర పోలీస్ కమిషనర్‌తో తాను స్వయంగా మాట్లాడానన్నారు.

ఈ తొక్కిసలాటలో ఎంత మంది చనిపోయారో ఇప్పుడే చెప్పలేం. ప్రజలు కాస్త సంయమనంతో ఉండాలి. ఆర్సీబీ విజయోత్సవ కార్యక్రమాన్ని 10 నిమిషాల్లోనే ముగించాం. అయితే లక్షలాది మంది క్రికెట్ అభిమానులు వచ్చారు. పరిస్థితిని సాధారణ స్థితికి తెచ్చేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నట్లుచెప్పారు.




చండీగఢ్‌లో హర్యానా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పార్టీ నాయకులతో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, చిత్రంలో కెసి వేణుగోపాల్ తదితరులు

# ముంబయి, చెన్నై, విశాఖ మునిగిపోతాయా?

>> కూడా ఆనివేదికలోప్రస్తావించారు. ఉష్ణోగ్రత పెరుగుదల కారణంగా ఈ శతాబ్దం చివరి నాటికి భూమిపై ఉన్న మంచు పర్వతాలు, హిమనీనదాలు కేవలం పావు వంతు మాత్రమే మిగిలి ఉంటాయని.. మిగిలిన మూడు వంతులు కరిగిపోతాయని పేర్కొన్నారు. దీని కారణంగా ప్రపంచంలోని కొన్ని దేశాలతో పాటు.. భారతదేశంలో ముంబై, చెన్నై, విశాఖపట్నం వంటి తీరప్రాంత నగరాలు జలమయం అవుతాయని చెబుతున్నారు. దాదాపు రెండు అడుగుల మేర నీటిలో మునిగిపోతాయని ఈ సర్వేలో పేర్కొన్నారు అధ్యయనకారులు. ఇప్పటికే స్విట్జర్లాండ్‌లో ఎత్తైన పర్వతాల నుండి ఒక మంచు చరియలు విరిగిపడి దిగువ ప్రాంతాలలో విధ్వంసం సృష్టించింది. ఈ మంచు తుఫాను దిగువ లోయలోని బ్లాటెన్ అనే గ్రామాన్ని నామరూపాల్లేకుండా చేసింది. అక్కడి ప్రజలకు కనీసం దాని నుండి బయటపడే అవకాశం కూడా లేకుండాపోయింది. క్షణాల్లోనే ఆ ప్రాంతమంతా స్మశానంలా మారింది. బార్చ్ అని పిలువబడే ఈ హిమనీనది వల్ల గ్రామంలోని తొంభై శాతం ప్రాంతం పూర్తిగా నాశనమైంది. ఈ విలయం నుంచి 300 మంది తప్పించుకుని బయటపడ్డారు.

వీరంతా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు. ఉష్ణోగ్రత మరో తాజా అధ్యయనం ప్రకారం ప్రపంచంలోని హిమానీనదాలు గతంలో అంచనా వేసిన దానికంటే చాలా వేగంగా కరుగుతున్నాయి. ఈ శతాబ్దం చివరి నాటికి భూమి సగటు ఉష్ణోగ్రత మరో 2.7 సెంటిగ్రేడ్ డిగ్రీలు పెరిగితే.. ప్రపంచంలోని హిమానీనదాలలో కేవలం 24 శాతం మంచు మాత్రమే మిగిలి ఉంటుంది. అంటే హిమానీనదాల మంచులో 76శాతంకరిగిపోతుంది. పారిస్ ఒప్పందం ప్రకారం.. ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదల 1.5 సెల్సియస్ కంటే ఎక్కువ ఉండకూడదని నిర్ణయించారు. కానీ, ప్రపంచ సగటు ఉష్ణోగ్రత కేవలం 1.5డిగ్రీలు పెరిగినా 46 శాతం హిమానీనదులు ఇప్పటికే కరుగుతున్నట్లు అధ్యయనంలో తేలింది. ఇక 54 శాతం మాత్రమే మిగిలి ఉన్నాయంటున్నారు. ప్రస్తుత సగటు ఉష్ణోగ్రత హిమానీనదాల ఉనికికి తీవ్రమైన ముప్పును కలిగిస్తుందని నివేదిక స్పష్టంగా సూచిస్తుంది. సగటు ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు పెరిగితే స్కాండినేవియన్ దేశాలైన నార్వే, స్వీడన్, డెన్మార్క్‌లోని అన్ని హిమానీనదాలు పూర్తిగా కరిగిపోతాయి. ఉత్తర అమెరికాలోని రాకీ పర్వతాలు, యూరప్‌లోని ఆల్ప్స్, ఐస్‌లాండ్‌లోని దాదాపు 90 శాతం హిమానీనదాలు కనుమరుగవుతాయి.

సగటు ఉష్ణోగ్రతలో 2సెంటిగ్రేడ్ డిగ్రీలు పెరుగుదల దక్షిణాసియాలోని హిమాలయాలపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. 2020తో పోలిస్తే హిమాలయాలలో 25 శాతం మంచు మాత్రమే మిగిలి ఉంటుంది. 75 శాతం కరిగిపోతుంది. హిమాలయాల నుండి ఉద్భవించిన గంగా, సింధు, బ్రహ్మపుత్ర నదులు కోట్లాది మంది ప్రజలకు ఎంతో కీలకం. ఆహారం, సాగు నీరు, తాగు నీరు సహా అనేక రకాల అవసరాలకు ఉపయుక్తంగా ఉన్నాయి. ఉష్ణోగ్రత పెరుగుదల 1.5డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పరిమితం అయినప్పటికీ హిమాలయాలలోని హిమానీనదాల్లో 40 నుండి 45 శాతం మాత్రమే మిగిలి ఉంటుందని.. 55 నుండి 60 శాతం కరిగిపోతుందని అధ్యయనంలో పేర్కొన్నారు. ఉష్ణోగ్రత పెరుగుదల ఆగిపోయినా హిమానీనదాల కరగడం శతాబ్దాలుగా కొనసాగుతుందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

ఈ అధ్యయనం కోసం పది దేశాలకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు పని చేశారు. ప్రపంచవ్యాప్తంగా 2,00,000 కంటే ఎక్కువ హిమానీనదాల భవిష్యత్తును అర్థం చేసుకోవడానికి పలు హిమానీనదాల నమూనాలను పరిశీలించారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 275,000 హిమానీనదాలు ఉన్నాయని పరిశీలకులు చెబుతున్నారు.

## పోలీసు జులుం

>> భాగంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గ్రామ పంచాయతీలో బుధవారం రెవెన్యూ సదస్సును ఏర్పాటు చేసింది. ఉదయం నుంచి రైతుల నుంచి భూ సమస్యలపై అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అందులో భాగంగానే వృద్ధ రైతు అల్లెపు వెంకటి తన భూమి పట్టా కావడం లేదని తనకున్న మూడెకరాల భూమిలో రెండు ఎకరాల భూమిని కొందరు కబ్జా చేశారని.. అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా తనకు న్యాయం చేయాలేదంటూ రెవెన్యూ సదస్సులో అధికారులను వేడుకున్నాడు. ఈ సదస్సు జరుగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వెళ్లి తహసిల్దారును, రెవెన్యూ సిబ్బందిని తన పట్టా విషయంలో నిలదీశాడు. దీంతో అధికారులు సిబ్బంది ఆ రైతుకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఆ వృద్ధ రైతు ఎంతకు వినకపోవడంతో అక్కడే ఉన్న ఏఎస్ఐ రామచందర్, ఆ రైతుపై జులుం ప్రదర్శించాడు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నుండి ఆ వృద్ధ రైతు మెడ పట్టుకొని బయటకు ఈడ్చుకొచ్చాడు. ఈ ఘటనతో అక్కడున్న రైతులంతా షాక్‌కు గురయ్యారు. వెంటనే తేరుకున్న స్థానికులు రైతును, ఏఎస్ఐని ఆపడంతో పరిస్థితి సర్దుమణిగింది. అయితే ఆ ఘటనను అక్కడే ఉన్న మీడియా రికార్డ్ చేయడంతో వైరల్ అయ్యింది. ఆదిలాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి సీతక్క వివరాలు అడిగి తెలుసుకుని, ఆ వృద్ధ రైతుపై దురుసుగా ప్రవర్తించిన ఏఎస్ఐని వెంటనే విధులనుండి తొలగించాలని నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వెంటనే స్పందించిన ఎస్పీ జానకీ షర్మిల రైతు వెంకటిపై దాడి ఘటనకు ప్రయత్నించిన ఏఎస్ఐ రామచందర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. రైతులకు ప్రభుత్వం , పోలీసులు అండగా ఉంటారని.. ఈ ఘటన దురదృష్టకరమని.. మరోసారి ఇలాంటి ఘటనలు జిల్లాలో జరగకుండా చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ జానకీ షర్మిల పేర్కొన్నారు.

**రైతు లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి: హారీష్**

రైతు విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై మాజీమంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. సమస్య చెప్పుకునేందుకు వెళ్లిన వృద్ధ రైతు పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ఆక్షేపించారు. రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రజా పాలన ఇదేనా, సీఎం ఆదేశాలతో ఇంత అత్యుత్సాహం ప్రదర్శించడం పోలీసులకు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. రైతుపై చేయి వేసిన పోలీసుపై వెంటనే డీజీపీ చర్యలు తీసుకోవాలని, బేషరతుగా యావత్ తెలంగాణ రైతు లోకానికి కాంగ్రెస్ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## ప్రభాకర్‌రావు 9న భారత్‌కు రాక

### ఫోన్‌ట్యాపింగ్ కేసు

**హైదరాబాద్, జూన్4, ప్రభాతవార్త:** ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రదాన నిందితుడుగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఈనెల9న భారత్‌కు రానున్నారు. అమెరికాలో ఉన్న ఆయన పోలీసుల విచారణకై హైదరాబాద్‌కు వస్తున్నట్లు పోలీసులకు తెలిపారు. అయితే ఈనెల5న (నేడు)విచారణకు హాజరుకావాల్సి ఉండగా భారత్‌కు వచ్చేందుకు కావాల్సిన పత్రాల మంజూరు ఆలస్యం కావడంతో 9న వస్తున్నట్లు తెలంగాణ పోలీసులకు సమాచారం అందించారు.

## కేబుల్ ఆపరేటర్లుగా మహిళలకు అవకాశం

### తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం మహిళల సాధికారత దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి ప్రయోజనాలను అందిస్తున్న సర్కార్, ఇప్పుడు మరో కొత్త అవకాశాన్ని తెస్తోంది. ఇప్పటి వరకు మహిళలు ఆర్‌టీసీకి బస్సులు అద్దెకు ఇవ్వడం, ఇసుక రవాణా, క్యాంటీన్ల నిర్వహణ వంటి సేవల్లో భాగంగా ఉన్నారు. ఇప్పుడు కేబుల్ ఆపరేటర్లుగా కూడా మహిళలకు అవకాశం కల్పించనుంది. రాష్ట్రం వ్యాప్తంగా వేగవంతమైన ఇంటర్నెట్ సేవల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన టీ ఫైబర్ ప్రాజెక్టులో భాగంగా ఈ అవకాశం కల్పించనుంది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో మ్యాచ్‌ఫిక్సింగ్!

## తన వద్ద ఆధారాలు ఉన్నాయన్న నిందితుడు నందకుమార్

## భద్రత కల్పిస్తే పోలీసులకు ఇస్తానని వెల్లడి

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై మూడేళ్ల క్రితం బిఆర్ఎస్ హయాంలో 2022లో మొయినా బాద్ ఫాంహౌజ్ కేంద్రంగా వెలుగుచూసిన ఎంఎల్ఎల కొనుగోలు కేసులో నింది తుడుగా వున్న నందకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఫోన్ ట్యాపింగ్ కేసు మ్యాచ్ ఫిక్సింగ్ అయ్యిందని బుధవారం మీడియాతో మాట్లాడుతూ అతను వెల్లడించాడు. ఫోన్ ట్యాపింగ్ కేసులో తన వద్ద ఆధారాలు వున్నా యని, తనకు భద్రత కల్పిస్తే ఈ వివరాలన్నీ ప్రభుత్వానికి అప్పగిస్తానని అతను తెలిపాడు. బిఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులుగా వున్న వారికి సంబంధించి అనేక ఆధారాలు వున్నాయని అతను తెలిపాడు. అప్పట్లో తన ఫోన్ కూడా ట్యాపింగ్‌కు గురైందని, దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికా రంలో వచ్చాక నాటి డిజిపి రవి గుప్తాకు ఫిర్యాదు చేశానని, అయితే దీనిపై ఎలాంటి విచారణ జరగలేదని అతను తెలిపాడు. దీనిపై సిఎం రేవంత్‌రెడ్డిని కలిసి అన్ని వివరాలు వెల్లడిద్దామని అనుకున్నా ఆయన అపాయింట్‌మెంట్ లభించ లేదని నందకుమార్ తెలిపాడు. నాటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే తన ఫోన్ ట్యాపింగ్‌కు గురైందని ఈ కేసులో నిందితులుగా వున్న నిందితులు వాంగ్మూలం ఇచ్చారని అతను తెలిపాడు. ఎంఎల్ఎల కొనుగోలు కేసుకు సంబంధించి తన ఆడియో ఇలా ట్యాప్ అయ్యిందేనని, ఈ ఆడియో నాటి సిఎం కెసిఆర్‌కు చేరడం వెనుక ఎస్ఐబి నాటి చీఫ్ ప్రభాకర్ రావు హస్తం వుందని అతను ఆరోపించాడు. అప్పట్లో తాను రోహిత్ రెడ్డి మాట్లాడిన మాటలు కాల్ రికార్డింగ్ కావచ్చని, అయితే ఎంఎల్ఎల కొనుగోలు కేసులో నిందితుడుగా వున్న సింహయాజి స్వా మితో మాట్లాడిన కాల్స్ ఎలా రికార్డు అయ్యిందో అనుమానంగా ఉందని అతను తెలిపాడు. ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ప్రభాకర్‌రావు అమెరికా నుంచి వచ్చి పోలీసుల విచారణకు హాజరైనా ఎలాంటి ఉపయోగం ఉండదని అతను తెలిపాడు. ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుల నుంచి తనకు ప్రాణ హాని వుందని, తనకు వెంటనే రక్షణ కావాలని అతను కోరారు. పోలీసులు కోరితే ఈ కేసులో అన్ని వివరాలు చెబుతానని నందకుమార్ తెలిపాడు.

# రాహుల్‌గాంధీకి అలహాబాద్ హైకోర్టు చురకలు!

**అలహాబాద్, జూన్ 4:** భారత్ ఆర్మీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసారని ఎఐసిసి నాయ కుడు రాహుల్‌గాంధీపై దాఖలైన కేసులో అలహాబాద్ హైకోర్టు రాహుల్‌కు చురకలు వేసింది. రాజ్యాంగం మనకు కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛ ఇతరులకు భంగం కలిగించేవిధంగా ఉండకూడదని, ప్రత్యే ఔకించి భారత ఆర్మీ విభాగాన్ని కించపరిచే వ్యాఖ్యలు చేసేందుకు భావప్రకటనా స్వేచ్ఛ లేదని హైకోర్టు చురకలు వేసింది. లక్నో హైకోర్టు జారీచేసిన సమన్లను నిలిపివేయాలంటూ రాహుల్‌చేసిన అప్పీలు పిటిషన్‌ను విచారించిన హైకోర్టు రాహుల్ వ్యాఖ్యలపై మండిపడింది. రాజ్యాంగంలోని 19వ అధికరణం (19)(1)(ఎ) ప్రతి వ్యక్తికి భావప్రకటనా స్వేచ్ఛను ప్రసాదించిందని అయితే ఈ స్వేచ్ఛ కొన్ని పరిమితులకు లోబడి ఉంటుందని, ఈ స్వేచ్ఛ భారీ ఆర్మీని కించపరిచేందుకు అనుమతించదని కోర్టు వెల్లడించింది. చైనా సైనికులు భారత ఆర్మీపై దాడులుచేస్తున్నాయని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసారని రాహుల్‌గాంధీపై పరువునష్టంకేసు దాఖలయింది. 2022లో రాజస్థాన్‌లో భారత్‌జోడో యాత్రలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలుచేసారు.



అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైనికులు మన భారీ సైనికులు 20 మందిని చంపివేసారని, 2వేల చదరపు కిలోమీటర్ల చైనా మన భూభాగం ఆక్రమించిందని ఇవేమీ భారత మీడియాకు పట్టవా. వీటిపై ఎందుకు రాయరు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని ప్రజలకు తెలియదని భావించ వద్దంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేసారు. యూపిలోని దిగువకోర్టులో దాఖలయిన ఈ పిటిషన్‌పై కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే రాహుల్ యూపి హైకోర్టును ఆశ్రయించి సమన్లను కొట్టివేయాలని కోరారు. ఈ పిటిషన్ దాఖలుచేసింది బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్‌లో పనిచేసి పదవీవిరమణచేసిన డైరెక్టర్ స్థాయి వ్యక్తి అని కల్నల్ ర్యాంకు సమానమైన అధికారి దాఖలు చేసిన పిటిషన్ విచారించాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది.

# అప్పుల బాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు రైతులు అప్పులబాధతో బలవన్మరణానికి పాల్పడ్డారు. ఉమ్మడి ఆది లాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆది లాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం శంభుగూడకు చెందిన రైతు పులాజీరాం (45) వ్యవసాయ పెట్టుబడి కోసం 3 లక్షల రూపాయల వరకు అప్పుచేశారు. ఎలా తీర్చాలనే ఆందోళనతో చేను వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మ పూడికి చెందిన పరిమిశెట్టి వీరబాబు(55) పంటల పెట్టుబడి కోసం కొంత అప్పు చేశాడు. ఆశించిన దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకుగురై వీరబాబు పురుగులమందు తాగి బలన్మణానికి పాల్పడ్డారు.



# నవీముంబయిలో భగ్గుమన్న ఐదు బస్సులు

## బస్సు టెర్మినల్‌లో భారీ అగ్నిప్రమాదం

**నవీముంబయి, జూన్ 4:** బస్సు టెర్మినల్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో కనీసం ఐదు బస్సులు దగ్ధం అయ్యాయి. నవీముంబయిలోని ఘన్‌సోలి బస్ డిపోలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వాటిలో కొన్ని ఎలక్ట్రిక్, డీజిల్ బస్సులున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ బస్సులో రిపేర్ల సందర్భంగా జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌వల్లనే ఈప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే కార్మికులు సిబ్బందికి ఎలాంటి ప్రాణహాని లేదని అగ్నిమాపక సిబ్బంది తక్షణమే రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈప్రమాదానికి ముందే కొన్నిరోజుల క్రితమేబృహన్‌ముంబయి ఎలక్ట్రిక్ సప్లయి అండ్‌ట్రాన్స్‌పోర్టు(బెస్ట్)పరిధిలో 50 కొత్త విద్యుత్ బస్సులు పంపిణీచేయగా వాటిని బస్ డిపోల్లోనే పార్కుచేసి ఉంచారు. అయితే వీటిలో కొన్నింటికి భద్రతా ప్రమాణాలు క్షీణించినట్లు తేలింది. 12 మీటర్ల పొడవున్న బస్సులు ఈవే ట్రాన్స్‌ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఒలెక్ట్రాకు అను బంధ విబాగం సరఫరాచేసింది. ముంబయి ప్రజారవాణాను మరింత కట్టుదిట్టంచేసేందుకు ప్రభుత్వం 2100 బస్సులను కొనుగోలుచేస్తోంది. ఈ 50 బస్సుల్లో ఏ ఒక్కటి కూడా ఫైర్ డిటెక్షన్, సప్రెషన్ సిస్టమ్స్ పరిధిలో ప్రమాణాలకు అనుగుణంగా లేవని వాహన భద్రతకు తక్కువగా ఉన్నట్లు తేల్చారు.

# డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతో హీరో నాగార్జున భేటీ



బుధవారం తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టికి అందజేస్తున్న హీరో నాగార్జున

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4:** ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున బుధవారం తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిశారు. హైదరాబాద్‌లోని ఉప ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఈ సమావేశం జరిగింది. తన చిన్న కుమారుడు, యువ హీరో అక్కినేని అఖిల్ వివాహ మహోత్సవానికి హాజరు కావాల్సిందిగా భట్టి విక్రమార్కను నాగార్జున స్వయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగార్జున... అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను ఉప ముఖ్యమంత్రికి అందజేశారు. అనంతరం వారిద్దరూ కాసేపు ముచ్చటించుకున్నారు. అక్కినేని అఖిల్ నిశ్చితార్థం గత ఏడాది నవంబర్‌లో జరిగింది. అక్కినేని నాగార్జున తన కుమారుడి వివాహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులను ఆహ్వానించారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీపై పెద్దధన్వాడ రైతుల తిరుగుబాటు

## సర్వేకు వచ్చిన యాజమాన్యంపై మండిపాటు

## కంటైనరుకు నిప్ప పెట్టిన ఆందోళనకారులు

**గద్వాల, జూన్ 4, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో బుధవారం యుద్ధ వాతావరణం నెలకొన్నది. హై టెన్షన్ నెలకొంది. రాజోలి మండల పరిధిలో పెద్దధన్వాడ సమీపంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై సమీప గ్రామస్థులు ఆందోళనకు దిగారు. బుధవారం ఫ్యాక్టరీ సమీపంలోని మొత్తం 10 గ్రామాలకు చెందిన ప్రజలు రాజోలి మండలం పెద్ద ధన్వాడలో ఫ్యాక్టరీ నిర్మించ తలపెట్టిన ప్రాంతానికి చేరుకుని ధర్నా చేశారు. ముందస్తు సమాచారం తో భారీగా మోహరించిన పోలీసులు ఆందోళన కారులను అడ్డుకునేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, ఆందోళకారులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

సర్వే కోసం వచ్చిన ఇథనాల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి చెందిన కార్లతో పాటు సామగ్రిని ఆందోళకారులు ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. గతంలో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ వ్యతిరేకంగా పోరాటలు చేయగా కొన్ని రోజుల పాటు వివాదం సద్దుమణిగింది.

తాజాగా బుధవారం తెల్లవారు జామున ఫ్యాక్టరీ నిర్మాణం కోసం గాయత్రి కంపెనీ యాజమాన్యం కంటైనర్లతో పాటు జేసీబీలు, కార్మి కులను పెద్ద ఎత్తున పెద్ద ధన్వాడకు తీసుకెళ్లారు. దీంతో ఆగ్రహించిన 10 గ్రామాలకు చెందిన రైతులు, మహిళలు పెద్ద ఎత్తున్న ఆందోళన చేస్తూ పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాతానికి వెళ్లి వారు వేసు కున్న టెంట్లను పీకేసీ, సామాగ్రిని ధ్వంసం చేశారు. వాళ్లు తీసుకువచ్చిన కూలీలకు రాళ్లతో తరిమికొట్టారు. దీంతో పెద్ద ధన్వాడతో ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఆందోళనకారులను పోలీసులు అరెస్టుశారు. పోలీసులు పరిస్థితి అదు పులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఆందోళన లో చాలా మందికి గాయాలు అయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నదని, మరికొంత మంది చికిత్స పొందు దుతున్నారని ప్రజా, రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

# మాజీ ఎంపి మధుయాష్కీ ఇంట్లో కాంగ్రెస్ నేతల లంచ్ మీటింగ్!

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4:** రాష్ట్రంలోని సీనియర్ కాంగ్రెస్ నేతలు ఒక సమావేశం పెట్టుకున్నారు. మాజీ ఎంపీ మధయాష్కీ ఇంట్లో బుధవారం లంచ్ ఏర్పాటు చేశారు. ఈ విందుకు 2009 - 2014 మధ్య కాలంలో ఎంపీలుగా పనిచేసిన వారిని ఆహ్వానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొట్లాడిన కాంగ్రెస్ పార్టీలో ఉన్నవారిని పిలిచారు. మాజీ ఎంపీలు కేశవరావు (కేకే), గుత్తా సుఖేందర్ రెడ్డి, విజయశాంతి, పొన్నం ప్రభాకర్‌లతోపాటు ఆనాడు కీలకంగా వ్యవహరించిన మాజీ మంత్రి జానారెడ్డి తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఆనాడు ఉద్యమం సమయంలో ఎలా పోరాడారన్నదాన్ని నెమరువేసుకున్నారు. నాటి పోరాటాన్ని డాక్యుమెంటరీ చేయాలన్న ప్రతిపాదన వచ్చింది. నాటి పోరాటాన్ని అతి త్వరలోనే ఒక పుస్తకంగా తీసుకురావాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. మధుయాష్కీ గౌడ్ డాక్యుమెంటరీ, పుస్తక రచనకు చొరవ తీసుకోనున్నారు.

# 18 నుంచి టెట్-2025 పరీక్షలు

## 30 వరకు సిబిటి విధానంలో ఎగ్జామ్స్

## షెడ్యూల్ జారీ చేసిన పాఠశాల విద్యా శాఖ

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) -2025 పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలు ఈ నెల 18 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి బుధవారం విడుదల చేశారు. పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటీ) విధానంలో నిర్వహించనున్నారు. రోజూ రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహిస్తారు. మొదటి సెషన్‌ను ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్‌ను 2 గంటల నుంచి 4:30 గంటల వరకు నిర్వహిస్తారు. ఈ నెల 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యాశాఖ ప్రకటించింది. టెట్ పరీక్షలను ఈ నెల 15 నుంచి ప్రారంభిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ ఈ నెల 15 నుంచి కాకుండా 18వ తేదీ నుంచి నిర్వహించాలని నిర్ణయించి.. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేశారు. పరీక్షల నిర్వహణ తేదీలు, సెషన్లు, సబ్జెక్టులు, జిల్లాల వివరాలతో పూర్తి షెడ్యూల్‌ను పాఠశాల విద్య శాఖ విడుదల చేసింది. టెట్-2025కి సంబంధించిన దరఖాస్తులను ఏప్రిల్ 15 నుంచి 30వరకు స్వీకరించిన విషయం తెలిసిందే.


ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)
NIT No. 43/MAU61-ADMN0IS(APSW)/17/2025-IS, Dt.04.06.2025
E Procurement Tender Notice
Name of Work : APCRDA - "RFP for Selection of Solution Provider to Configure, Customize, Integrate, Implement and Maintain ICT Platform for Construction Management for APCRDA and ADCL"
The bid can be downloaded on AP e-procurement portal from 05.06.2025 to 20.06.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 20.06.2025 up to 15.00 Hrs, Technical bid opening 20.06.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Addl.Commissioner, APCRDA, Vijayawada.



తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ సేకరణ) శాఖ
ఫారం - 6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఎలోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద డీనీలో 10ఎ మినహాయింపు కలదు) (నిబంధన 6/12 చూడుము)
గెజిట్ నెం. 32/2025/ తేది: 30.05.2025
జిల్లా కలెక్టరు యాదాద్రి భువనగిరి ఫైలు నెం. G/2501/2025 తేది : 29.05.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (L.A) యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. A/13/2025 తేది: .05.2025
[illegible]
జిల్లా : యాదాద్రి భువనగిరి మండలం : బీబీనగర్ గ్రామం : పడమటిసోమారం

| సర్వే నెం/ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం.) | పట్టాదారు పేరు మరియు తండ్రి/భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | విస్తీర్ణము (ఎ.గుం.) | చెట్లు / కట్టడ ములు |
|---|---|---|---|---|
| 4 ఖుష్కి/పట్టా 0.09 | అల్వా నర్సింహారెడ్డి తండ్రి : సత్తయ్య [illegible] | అల్వా నర్సింహారెడ్డి తండ్రి : సత్తయ్య [illegible] | 0.09 | - |
| 19 0.01 | [illegible] | [illegible] | 0.01 | - |
| 70 0.18 | [illegible] | [illegible] | 0.18 | - |
| 77 0.33 | [illegible] | [illegible] | 0.33 | - |
| 78 0.10 | [illegible] | [illegible] | 0.10 | - |
| 83 0.01 | [illegible] | [illegible] | 0.01 | - |
| 84 0.34 | [illegible] | [illegible] | 00.34 | - |
| 120 0.10 | [illegible] | [illegible] | 0.10 | - |
| 121 0.05 | [illegible] | [illegible] | 0.05 | - |
| 122 1.01 | [illegible] | [illegible] | 1.01 | - |
| 123 0.17 | [illegible] | [illegible] | 0.17 | - |
| 131 0.00¼ | [illegible] | [illegible] | 00.00¼ | - |
| 134 0.05 | [illegible] | [illegible] | 0.05 | - |
| 135 1.23 | [illegible] | [illegible] | 1.23 | - |
| 136 0.02 | [illegible] | [illegible] | 0.02 | - |
| 137 0.02 | [illegible] | [illegible] | 0.02 | - |
| 154 0.05 | [illegible] | [illegible] | 0.05 | - |
| 156 0.09 | [illegible] | [illegible] | 0.09 | - |
| 157 0.03 | [illegible] | [illegible] | 0.03 | - |
| 158 0.07¼ | [illegible] | [illegible] | 0.07¼ | - |
| 159 0.14 | [illegible] | [illegible] | 0.14 | - |
| 160 0.15 | [illegible] | [illegible] | 0.15 | - |
| 161 0.13 | [illegible] | [illegible] | 0.13 | - |
| 163 0.00¼ | [illegible] | [illegible] | 0.00¼ | - |
| 165 0.03 | [illegible] | [illegible] | 0.03 | - |
| 169 0.11 | [illegible] | [illegible] | 0.11 | - |
| 178 0.06 | [illegible] | [illegible] | 0.06 | - |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | - |
| 182 0.03 | [illegible] | [illegible] | 0.03 | - |
| 180 0.05 | [illegible] | [illegible] | 0.05 | - |
| 184 0.05 | [illegible] | [illegible] | 0.05 | - |
| 186 0.14 | [illegible] | [illegible] | 0.14 | - |
| 187 0.20 | [illegible] | [illegible] | 0.20 | - |
| | | మొత్తం | 09.25¼ | |

[illegible]
DIPR RO.NO: 181/LA/PP/Advt/Pub/2025-26

వార్త

కిందపడిన ప్రతిసారీ సర్దుకుని మళ్లీ లేచినప్పుడే అది మన అతి ఉత్తమమయిన గొప్పతనాన్ని చాటుతుంది.

-గోల్డ్‌స్మిత్

# బ్రహ్మోస్త్ర పాటవం!

అణ్వాయుధాలు ఉండడమే కాదు యుద్ధ నీతి, యుద్ధ రీతి కూడా తెలిసి ఉంటేనే యుద్ధంలో విజయం సాధించడం సాధ్యమౌతుంది. లేకుంటే శత్రువు చేతికి చిక్కి అవమానాలు పాలవడమే మిగులుతుంది. ఇప్పుడు పాకిస్థాన్‌కు అదొక్కటే మిగిలింది. మూడుసార్లు చావుదెబ్బతిన్నా నైజం మార్చుకోకుండా దాయాది దేశం భారత్‌ను సాధించాలనుకోవడమనేది అవివేకం. ఈ విషయాన్ని పాకిస్థాన్ గుర్తించేసరికి పుణ్యకాలం పూర్తయిపోతుంది. అణ్వాయుధాలున్నాయంటూ భయపెట్టడ మొక్కటే ఆ దేశ డొల్లతనానికి నిదర్శనం. ఆ దేశం, ఈ దేశం మద్దతు ఉన్నా నిన్నమొన్నటి ఇండో పాక్ యుద్ధంలో కనీసస్థాయిలో భయపెట్టలేక పోయింది. కేవలం భారత్ అస్త్రాలను మట్టుపెట్టామని చెప్పుకోవడమే ఆ దేశ యుద్ధరీతిగా బయటపడింది. ఆ వ్యూహానికి చైనా టర్కీ వంటి దేశాలు ఎంతగా తాళం వేసినా కుట్రలు, కుతంత్రాలు భారత్ యుద్ధతంత్రం ముందు వెలవెలపోయాయి. భారత్ నేవీ బలగాన్ని, పలు అస్త్రాలను మాత్రమే నమ్ముకుని యుద్ధానికి దిగింది. అణ్వాయుధాల ఊసే ఎత్త లేదు. ఒక్క బ్రహ్మాస్త్రంతో పాక్ సైన్యాన్ని మట్టి కరిపించింది. ఈ సందర్భంగా బ్రహ్మాస్త్రమే భారత్ పరువు నిలబెట్టిందని చెప్పాలి. భారత్ అమ్ములపొదిలో ఓ బాణమే బ్రహ్మాస్త్రం. ఒక విజయం వెయ్యేనుగుల బలాన్నిస్తుంది. ఇందులో ఒక్క అక్షరం కూడా పాలు పోలేదు. బ్రహ్మోస్ ఘన కీర్తి వెలుగులోకి వచ్చాక మరిన్ని బ్రహ్మోస్‌ల తయారీకి, రాఫెల్స్ తయా రీకి దారి తీసింది. 2030 సంవత్సరం నాటికి 26 రఫేల్ మెరైన్ ఫైటర్ విమానాలతో భారత నౌకాదళ ఆయుధ సంపత్తి మరింత పటిష్ఠం కానుంది. ఈ రఫేల్‌మెరైన్ ఫైటర్ విమానాలను పూర్తిగా సముద్ర జలాల్లో మాత్రమే వినియోగించే అవకాశం ఉంటుంది. ఈ విమానాల కొనుగోలు కోసం రూ.63 వేల కోట్ల ఫ్రాన్స్, భారత్ అంతర్ ప్రభుత్వ ఒప్పందం జరిగింది. పాక్ మీద ఎప్పుడూ మనమే పైచేయిగా ఉన్నాం. ఈ విమానాల్లో అధిక భాగాన్ని భారత్‌లోనే తయారుచేస్తారు. శిక్షణ, సిమ్యులేషన్, పరికరాలు, ఆయుధాలు, పనితీరు ఆధారిత రక్షణ సరఫరాలు అన్నింటికీ ఈ ఒప్పందం వర్తిస్తుంది. దీంతో భారత దేశానికి 62 రఫేల్ ఫైటర్ విమానాలు అందుబాటులోకి వస్తాయి. ఈ రఫేల్‌మెరైన్ జెట్ విమానాలు జోడు కావడంతో ఫ్రాన్స్ తర్వాత రఫేల్ రెండు తరాల విమానాలు గల తొలిదేశంగా భారత్ మారుతుంది. ఫలితంగా భారత వాయు, నౌకాదళాల బలం మరింతగా పెరుగుతుంది. గగనతలం, సాగరజలాల్లో భారత దేశానికి ఆధిపత్యం లభిస్తుంది. బ్రహ్మోస్ క్షిపణి ఒక్కటే ఇంతటి ఘనకార్యం సాధిస్తే ముందస్తు వ్యూహంతో సిద్ధం జేసిన నేవీ దళాలనుకూడా రంగంలోకి పంపితే పాక్ భస్మీ పటలమేనని కేంద్ర రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ చెప్పిన విషయాలు వింటే ఎంతో పకడ్బందీగా మన రక్షణ సంపత్తిని పెంపు చేసుకునే కార్యక్రమంలో వ్యూహాత్మక ప్రణాళికను జాతి నేతలకు ప్రణామాలు అర్పించాల్సిందే! పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లను లక్ష్యంగా చేసుకుని జరిగిన క్షిపణి దాడులు పాకిస్థాన్ వైమానిక లాజిస్టిక్స్, సైనిక సమన్వయాన్ని గణనీయంగా దెబ్బతీశాయి. ఇప్పట్లో కోలుకోవడం కష్టమే. బ్రహ్మోస్ దాడులు భారతదేశ సైనిక సామర్థ్యాలకు నిదర్శనంగా, పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై దాడితో గణనీయమైన నష్టం కలిగించాయి. కనుక మన దేశ సైనిక ఔన్నత్యాన్ని గుర్తుచేసుకుంటూ నిశ్చింతగా నిద్రపోవచ్చు. ఈ ఆపరేషన్ సిందూర ప్రభావమే భారత్ పాకిస్థాన్‌ల మధ్య కాల్పుల విరమణ కుదిర్చింది. ఐనా మాట నిలకడలేక, ఎన్నోసార్లు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘించిన ప్రబుద్ధ దేశం కనుక నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాంతో ఆయుధ సంపత్తిని పెంచుకోవాల్సినఅగత్యమే ఏర్పడింది. నిజమైన 'బ్రహ్మాస్త్రం'ఎలా వుంటుందో పురాణ ప్రవచనాల్లో చెప్పగా విన్నాం. మళ్ళీ ఇప్పుడు పాక్ అధ్యక్షుని నోట. పాక్ దుశ్చర్యలను, ఉగ్రవాద దురాగతాలను ప్రపంచ దేశాలకు తెలియచెప్పిఎండకట్టేందుకు అఖిల పక్ష నేతలు, పార్లమెంట్ సభ్యుల బృందాలు మన దేశం తరపున విదేశాల్లో తిరుగుతూ ఉంటే పాకిస్థాన్ మాత్రం పాక్ గడ్డమీద నుంచే మన బ్రహ్మోస్‌ను కీర్తిస్తోంది. బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు మిగిల్చాయని ప్రధాని నరేంద్రమోడీ కాన్పూర్ సభలో చెప్పడానికి ఇదే కారణమై ఉంటుంది. వివరించారు. ఆప రేషన్ సిందూర్ ప్రతాపాన్ని, సైనిక శక్తిని యావత్ ప్రపంచం చూసిందని, మన బలం, బలగాల విషయమై ప్రపంచానికి ప్రధాని గర్వంగా చాటి చెప్పారు. 290 కి.మీ కంటే ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలది. బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి. లక్ష్యాల ఛేదనలో అత్యంత ఖచ్చితమైన ఫలితాలనిస్తుందని ప్రతీతి. ఆపరేషన్ సిందూర్, ఇతర సైనిక కార్యకలాపాలలో బ్రహ్మోస్ క్షిపణి పనితీరు భారత సైన్యానికి ఎనలేని ఆస్తిగా మారింది. భారత్ తనసొంత తెలివి తేటలతో రూపొందించుకున్న అతిశక్తి బ్రహ్మోస్ ఉంది. దానిపేరు వింటేనే పాక్‌హడలిపోతోంది. ఆవిషయం ఆ దేశ అధ్యక్షుడే సహబాజ్ షరీఫ్ స్వయం గా చెప్పారు. బ్రహ్మాస్ శక్తిని గుర్తించి ఎదుర్కొందామని చూసేసరికే తమ మీద దాడి చేసిందని చెప్పారు. స్వదేశీ ఆయుధ సామర్థ్యం, మేక్‌ఇన్ ఇండియా శక్తిని ప్రపంచం గమనించే స్థాయిలో తమ ప్రతిభ పాటవాలను చూపగలిగాయి. పాకిస్థాన్‌లోని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న పాక్ భూభాగంలోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిందంటేనే భారత్ సంపూర్ణ విజయం సాధించినట్లే లెక్క!

ఒక వ్యక్తి పేదరికాన్ని సంపదను నిర్ణయించేది ఆ వ్యక్తి సంపాదనగాని, ఆదాయంకాని కాదు. అతడి ఆదాయానికి, ఖర్చుకీ మధ్య ఉన్న వ్యత్యాసం అంతే.



డేనియల్

గులాబీ బోధ చేయదు. పరిమళాన్ని గుబాళిస్తుంది. అలాగే అధ్యాపకుడు తన జీవిత పరిమళంతో బోధించాలి.



మహాత్మాగాంధీ

# ప్రజావాక్కు



## చిన్నారులపై లైంగిక దాడులను అరికట్టాలి

సమాజంలో చిన్నారులు భవిష్యత్తు పౌరులు మాత్రమే కాదు, నేటి బాధ్యతగా కూడా భావించాలి. కానీ ఇటీవల చిన్నారులపై లైంగిక దాడులసంఖ్య ప్రమాదకరంగా పెరుగుతోంది. యునిసెఫ్ నివేదికప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 53శాతం బాలికలు లైంగిక వేధింపులకు గురవుతుండగా, వాటిలో 90శాతందాడులు కుటుంబసభ్యులు లేదా పరిచయస్తులచే జరుగుతుండటం మన మానవత్వాన్ని కలవరపెడుతోంది. ఇలాంటి దాడులు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని బాగా దెబ్బతీస్తున్నాయి. బాధితులు భయంతో మౌనంగా ఉంటూ జీవితాంతం ఆ గాయాలతోనే బతకాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. అంతేకాదు, మత్తు పదార్థాలు, అసభ్యవీడియోలు, సోషల్ మీడియా వల్లనూ బాలబాలికలు ప్రమాదంలో పడుతున్నారు. పోక్సో చట్టం వంటి చట్టాలున్నా అమలు లోపం వల్ల నేరగాళ్లకు శిక్షలు పడటం అరుదు .న్యాయవ్యవస్థ వేగంగా స్పందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## గురుకుల అడ్మిషన్లు

ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, బాలుర,బాలికల గురుకులాలలో అడ్మిషన్లు5వ తరగతి, ఇంటర్మీడియట్,డిగ్రీ కోర్సులలో అడ్మిషన్లను రాష్ట్రంలోని33జిల్లా కేంద్రాలలో విద్యార్థులకు వచ్చిన మార్కులు మెరిట్ ఆధారంగా అన్ని గురుకులాలకుఒక చోటకౌన్సిలింగ్ నిర్వహించాలి. ప్రభుత్వం నిర్ణయించిన సీట్లు ప్రతి కళాశాలలో భర్తీ అయ్యే విధంగా చూడాలి గురుకుల ఇంటర్ కళాశాలలో తప్పని సరిగాసైన్స్ మ్యాథ్స్ సబ్జెక్టులతోపాటుగా సామాజిక శాస్త్రాలు అయిన ఎకనామిక్స్,హిస్టరీ, సివిక్స్,కామర్స్, వంటి కోర్సులనునూతన విద్యాసంవత్సరంలో ప్రారంభించాలి.

- రాపాక రవీందర్, జనగాం

## ఆదాయ మార్గాలను సృష్టించాలి

ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు విపరీతంగా ఖర్చుచేస్తున్నాయి. ఇది దీర్ఘ కాలంలో ఆర్థిక అస్థిరతకు దారితీస్తుంది. వీలైనంత త్వరగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు కోత విధించి ఆదాయ మార్గాలను సృష్టించాలి. ఉచిత పథకాలను ఎత్తివేసి ఆదాయ మార్గాలను సృష్టించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

- టి.ముత్యంరెడ్డి, సిద్దిపేట జిల్లా

## ఓర్వలేకనే విమర్శలు

రేవంత్‌రెడ్డి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. వారి కోసంచాలా కష్టపడుతున్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వారి కోసం ఎన్నోపథకాలను రూపొందిస్తూ అమలు పరుస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం, పెన్షన్లు ఇస్తూ పేద ప్రజలను ఆదుకుంటున్నారు. పెట్టుబడుల కోసం విదేశీ పర్యటనలు చేస్తున్నారు. ఐ.టి, పరిశ్రమలనుస్థాపించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తాపత్రయపడుతున్నారు. మహిళా క్యాంటీన్లు, స్కిల్ యూనివర్సిటీ ఇలా ఎన్నో కార్యక్రమాలు, పథకాలకు కార్యరూపం ఇస్తున్నారు. తెలంగాణలో అన్నిరంగాలను అభి వృద్ధిచేసి రాష్ట్రాన్ని దేశంలో ముందువరసలో నిలబట్టేలా పనిచేస్తున్నారు. గత ముఖ్యమంత్రిలాగా అధికారులను, మంత్రులను, ప్రజలను ఎవరినీ కలవకుండా నిద్రపోవడం లేదు.

-మిథునం, హైదరాబాద్

## పాక్‌ను నమ్మేదెలా?

గాంధీ, బుద్ధుడువంటి అహింసావాదులు, వివేకానంద, పరమహంస లాంటి మహాపురుషులు, రామదాసు, త్యాగయ్య, అన్నమయ లాంటి గొప్ప భక్తులు జన్మించిన పవిత్ర దేశాన్ని ఏలిన ప్రభువులు పొరుగు దేశాలతో యుద్ధాలు చేయాలని వారిపై ఆధిపత్యం చెలాయించాలని ఎప్పుడూ కోరుకోలేదు. యుద్ధాలు చేసే పరిస్థితులు రాకూడదని ప్రజలు సుఖశాంతులతో జీవించాలని విదేశీ ప్రతినిధులతో చర్చలు, సంప్రదింపులు జరిపేవారు. శాంతి ఒప్పందాలు కుదుర్చుకునేవారు. అయితే దేశంలో శాంతి వాక్యులు లేకుండాపోయాయి. పొరుగుదేశం వారు అల్లర్లు, అలజడులు సృష్టిస్తు అమాయక జనాల్ని చంపుతున్నారు. యుద్ధానికి కాలుదువ్వుతున్నారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

## ఘనతను చాటిన పోటీలు

జూన్ ఒకటవ తారీఖున ముగిసిన ప్రపంచ సుందరి ఎన్నిక పోటీలు ఘనంగా ముగిసాయి. తెలంగాణా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అనేక విమర్శల మధ్య కొన్ని రోజులుగా ఇతర దేశాల నుంచి వచ్చిన వారందరికి సకల సదుపాయాలు సమకూర్చి పోటీ నిర్వహణ నిర్విఘ్నంగా పూర్తిచేసి తన ఘనతను ప్రపంచానికి చాటిచెప్పింది. ఇందులో ప్రథమ ద్వితీయ శ్రేణి పొందిన సుందరిలకు హృదయ పూర్వక అభినందనలు. కవులు వర్ణించినట్టు అందాన్ని కొలవడానికి పనిముట్లు లేవు.

-డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పెను ప్రమాదంలో ప్రకృతి శోకం

*పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జరిగే పరిణామాలను తెలియచేయడానికి భూగ్రహం విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రతిఏటా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుగుతున్నది. జన జీవితాల్లోకి ఇబ్బడి ముబ్బడిగా వచ్చిచేరుతున్న ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమనే అంశాన్ని2025 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశంగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయం. ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సంబంధిత సమస్యలకు మూలం శిలాజఇంధనాల వాడకం విపరీతంగా పెరగడమే. సౌరశక్తి వాడకంపై దృష్టిసారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికంచేయాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండవాదం పర్యా వరణానికి పెద్దదెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ' పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తు న్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు.*



సుంకవల్లి సత్తిరాజు

ప్రకృతి భూమికి గొడుగు వంటిది. మానవ మనుగడకు రక్షణకవచం లాంటి ప్రకృతిని విధ్వంసం చేయడం మనల్ని మనం ప్రమాదంలో పడేసుకోవడమే. మన చుట్టూ ఆవరించిఉన్న ప్రకృతిని నిర్లక్ష్యం చేసి, పర్యావరణానికి ముప్పు కలగచేయడం క్షమార్హం కాదు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ, ఎన్నో అవగాహనా సదస్సులు, ఎన్నో అంతర్జాతీయసమావేశాలు జరుగుతున్నా పర్యావరణ విధ్వంసం యథేచ్ఛగా కొనసాగుతూనే ఉంది. పర్యావరణ విధ్వంసంతో మానవ ప్రపంచం విలపిస్తున్నది. ప్రపంచాన్ని పచ్చదనంతో నింపితేనే భూగ్రహాన్ని కాపాడగలం. స్వీడన్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఐస్‌లాండ్, డెన్మార్క్, యు.కె, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వంటి దేశాలు హరిత దేశాలుగా పేర్కొనబడుతున్నాయి. సహజ వనరులను పరిరక్షించి, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా డెన్మార్క్ గ్రీనెస్ట్ కంట్రీ దిశగా పయనిస్తున్నది. ఖతార్, నైజర్, గ్రీన్‌లాండ్ వంటి దేశాల్లో పచ్చదనం తక్కువగా ఉంది. ధరిత్రిని కలుషిత వ్యర్థాల నుండి కాపాడడం, ప్లాస్టిక్‌ను నెమ్మదిగా తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరుల వైపు ప్రపంచాన్ని మళ్ళించడం, జీవవైవిధ్యాన్ని కాపాడడం, అడవులను సంరక్షించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి చర్యలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. ప్రస్తుత కలుషితభరితమైన ప్రపంచంలో ప్రతీ చోట వినిపించే మాట 'పర్యావరణం'. పర్యావరణం అనే పదానికి నిర్వచనం చాలా మందికి తెలియక పోవచ్చు. పచ్చదనమే పర్యావరణ పరిరక్షణకునిజమైన పరిష్కారమన్న అవగాహన మాత్రం సామాన్య ప్రజల్లో కూడా ఏర్పడింది. కాని ఆచరణలో పర్యావరణ పరిరక్షణ అంశం విఫలమవుతూనే ఉంది. పర్యావరణం శరవేగంగా విధ్వంస మౌతూనే ఉంది. మానవ ప్రపంచాన్ని పెను ప్రమాదం వెంటాడుతూనే ఉంది. మన చుట్టూ పంచభూతాలతో ఆవరించి ఉన్న సహజసిద్ధమైన ఏర్పాటును 'పర్యావరణం'గా పేర్కొనవచ్చు. అలాంటి పర్యావరణం మానవ స్వార్థంతో, తప్పిదాలతో విధ్వంసం కావడం పెను ప్రమాదానికి సంకేతం మానవ మనుగడకు శరాఘాతం. సకల జీవరాశుల మనుగడకు ఏకైక ఆధారం భూగ్రహం. మిగిలిన గ్రహాల్లో జీవించడానికి అనువైన పరిస్థితులు లేవు. ఇతర గ్రహాలపై పరిశోధనలు జరుగుతున్నా ఇప్పటివరకు జీవరాశుల జాడ కనిపించలేదు. వేలాది కోట్లధనం ఇతర గ్రహాలపై పరిశోధనలకు ఖర్చుపెడుతున్నా ఫలితాలు నిరాశాజనకంగానే ఉన్నాయి. ఇతర గ్రహాలపై తిష్ఠ వేయాలనే మానవ జిజ్ఞాస కేవలం అత్యాశగానే మిగిలిపోతుందేమో అనే సంశయం కలగడం సహజం. సువిశాలమైన భూగ్రహాన్ని నాశనం చేసి, ఇతర గ్రహాలపై నివాసానికి కలలు కనడం హాస్యాస్పదం. ప్రకృతి హొయలతో అలరాడే అందమైన భూగ్రహాన్ని కాలుష్యంతో కురూపిగా మార్చి, ఇతర గ్రహాలపై పరిశోధనలు చేయడం కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా మారింది. భూగ్రహం కూడా ఈ సమస్త విశ్వంలో ఒక భాగమే. భూగ్రహంపై మూడొంతుల నీరు, ఒక వంతు భూమి కలదు. వృక్షాలతో, నదీనదాలతో, కొండలు, లోయలు, సముద్రాలతో పలు జీవరాశులతో, విభిన్నమైన భౌగోళిక నైసర్గిక స్వరూపాలతో, పచ్చని ప్రకృతి మధ్య జీవించే మహద్భాగ్యాన్ని మానవుడే చెరిపేస్తున్నాడు. స్వార్థ ప్రయోజనాల కోసం విచక్షణ కోల్పోయి ప్రకృతిని చెరబట్టి, వికృతంగా మారుస్తున్నాడు. అడవులను నరికి నివాసాలను ఏర్పాటుచేసుకోవడం, పంటభూములను మానవావసరాలకు వినియోగించడం, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఏర్పాటు చేయడం, శిలాజ ఇంధనాలను ఇబ్బడి ముబ్బడిగా వినియోగించడం వలన ధరిత్రిపై కాలుష్యపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి.




శిలాజ ఇంధనాల వాడకం వలన, అడవులను ధ్వంసం చేయడం వలన, పారిశ్రామిక విప్లవం వలన వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయువుల శాతం పెరిగి, భూఉపరితల ఉష్ణోగ్రత పెరుగుతున్నది. ఇదేపరిస్థితి కొనసాగితే 'గ్లోబల్ వార్మింగ్' సమస్య పెరిగి భూమిపైమనుగడ సాగిస్తున్న పలుజీవరాశుల భవిష్యత్తు ప్రశ్నార్థకమౌతుంది. భూఉష్ణోగ్రతలు పెరగడానికి మానవ తప్పిదాలే కారణం. ప్రకృతిలో లభ్యమయ్యే వనరులను అవసరాలకు మించి వినియోగించడం, ధనాశతో, దురాశతో దూరదృష్టి కోల్పోయి, పర్యావరణానికి చేటుతేవడం మానవ మనుగడకు పెను ముప్పు. పచ్చదనమే ప్రపంచ మానవాళికి నిజమైన ధనం. మానవాళి మనుగడకు మూలాధారమైన ధరిత్రి పదిలంగా ఉండాలంటే పచ్చని ప్రకృతిని పరిరక్షించుకోవాలి. అవాంఛనీయమైన వాతావరణ మార్పులను అరికట్టి, కాలుష్యాన్ని కొంతవరకైనా నిరోధించగలిగితేనే ధరిత్రిపై జీవరాశుల అస్థిత్వం కొనసాగుతుంది. ఆధునికత, సాంకేతికత ప్రభావంతో రేడియేషన్ పెరిగి మనచుట్టూ ఉన్న పలురకాల పక్షి జాతులు అంతరించిపోవడం చూస్తున్నాం. ప్రకృతి సమతుల్యం లోపించడంతో జీవవైవిధ్యం దెబ్బతింటున్నది. పచ్చదనం నశించడం వలన ఏర్పడుతున్న విపత్కర పరిణామాల వలన ధరిత్రిపై భవిష్యత్తులోమానవ జాతి మనుగడ దుర్లభంగా మారబోతున్నది. మానవ నివాసయోగ్యం కాని ప్రదేశంగా భూగ్రహం పరివర్తన చెందబోతున్నది. అరణ్యాలు స్థానభ్రంశం చెంది కాంక్రీటు కట్టడాలతో ఆధునిక అరణ్యాలుగా రూపాంతరం చెందుతున్నాయి. పర్యావరణ వ్యవస్థను పచ్చదనంతో పునః ప్రతిష్ఠించడానికి ప్రపంచ దేశాలన్నీ చిత్తశుద్ధితో ప్రణాళికలను రూపొందించి అమలు చేయాలి. పర్యావరణాన్ని పరిరక్షించకపోతే జరిగే పరిణామాలను తెలియచేయడానికి భూగ్రహం విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి ప్రతీ ఏటా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుగుతున్నది. జన జీవితాల్లోకి ఇబ్బడి ముబ్బడిగా వచ్చి చేరుతున్న ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడమనే అంశాన్ని 2025 సంవత్సరపు ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశంగా ఎంపిక చేయడం హర్షించదగ్గ విషయం. ప్రపంచం ఎదుర్కొంటున్న కాలుష్య సంబంధిత సమస్యలకు మూలం శిలాజ ఇంధనాల వాడకం విపరీతంగా పెరగడమే. సౌరశక్తి వాడకంపై దృష్టి సారించకుండా శిలాజ ఇంధనాల వినియోగం అధికం చేయాలనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వితండవాదం పర్యావరణానికి పెద్ద దెబ్బ. ఇప్పుడిప్పుడే 'క్లీన్ ఎనర్జీ' పై దృష్టి సారిస్తున్న ప్రపంచానికి ట్రంప్ నిర్ణయం ఆందోళన కలిగిస్తున్నది. ట్రంప్ బాధ్యతారాహిత్యానికి ప్రపంచం మూల్యం చెల్లించుకోక తప్పదు. పెరుగుతున్న భూ ఉష్ణోగ్రతలను రెండు డిగ్రీల సెల్సియస్ దిగువ స్థాయికి తగ్గించడం, సగటు ఉష్ణోగ్రతల్లో పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కి పరిమితి చేయాలన్న ఆలోచనతో గతంలో పారిస్ ఒప్పందం కుదిరింది. ఐక్యరాజ్య సమితిలోని మెజారిటీ సభ్యదేశాలు వాతావరణ మార్పులపై ఆందోళన చెంది, గ్రీన్‌హౌస్‌వాయు వులను తగ్గించి, ఉష్ణోగ్రతలను నియంత్రించడానికి ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఆమోదించిన ఒప్పందం 2016వ సంవత్సరం నుండి అమల్లోకి వచ్చింది. గతంలో డోనాల్డ్‌ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అధికారంలో ఉన్నప్పుడు పారిస్ ఒప్పందం నుండి వైదలగడం జరిగింది. జోబైడెన్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్నకాలంలో అమెరికా తిరిగి పారిస్ ఒప్పందంలో చేరింది. ట్రంప్ ఈ సంవత్సరం అధికారంలోకి వచ్చాక తిరిగి పాతపాటే పాడుతూ పారిస్ ఒప్పందం నుండి తప్పుకున్నారు. తమదేశ అవసరాలకు ఖనిజ ఇంధనాన్ని వాడుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచానికి దశాదిశా నిర్దేశం చేయవలసిన అమెరికా తన తొందరపాటు నిర్ణయాలతో ప్రపంచాన్ని సాంప్రదాయేతర ఇంధనాల వన రుల వాడకం నుంచి శిలాజ ఇంధనాల వాడకంపై తిరిగి దృష్టిసారించేలా నిర్ణయాలు తీసుకోవడంలో ఎలాంటి ఔచిత్యం లేదు. ప్రపంచంలో ప్రకృతి ప్రేమికులకు కొదవలేదు. అయినా ఆశించినంత ప్రయోజనం ఆచరణలో కనిపించడంలేదు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరగకుండా, ప్రజల అవసరాలు తీర్చే ప్రణాళికలు చేపట్టకుండా పర్యావరణ విధ్వంసాన్ని ఆపలేం. 2025వ సంవత్సరం జూన్ 5వ తేదీన దక్షిణ కొరియా ఆతిథ్యంలో నిర్వహిస్తున్న ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఒక దశ, దిశ నిర్దేశించాలి. ప్రపంచస్థాయిసంస్థలు, ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు పర్యావరణ పునరుద్ధరణకు నడుం బిగించి, మానవాళిని పెనుసంక్షోభం నుండి బయటకు తీసుకురావడానికి వడివడి అడుగులువేయాలి. సహజసిద్ధ మైన, కలుషిత రహితమైన వాతావరణాన్ని పునర్జీవింపచేయాలి. ●

# యుద్ధాలతో జనజీవనం అతలాకుతలం

కనుమ ఎల్లారెడ్డి

ఇద్దరు దేశాధినేతలు యుద్ధం వైపే మక్కువ చూపుతున్నట్లు ఉన్నారు. ఒకరి అంగీకారం మరొకరికి సమ్మతం కావడం లేదు. ఒకరు నెలరోజులు కాల్పుల విరమణ అంటే, మరొకరు కేవలం రెండు, మూడు రోజులే అంటుంది. ఇలా పరస్పర భేషాజాలు పోతే ఎవరికైనా విసుగు వస్తుంది. అందుకేనేమో ఉక్రెయిన్ మునుపెన్నడూ లేని దాడులు చేసింది. ఆ దాడిలో రష్యా నష్టపోయినా సరైన వివరణ ఇవ్వడంలేదు. రష్యాను కోలుకోలేని దెబ్బతీశామని జెలెన్‌స్కీ వ్యాఖ్యానించాడు. ఈ దిశలో ఆ దేశ సెక్యూరిటీ సర్వీస్ చీఫ్ మాలిక్‌ను అభినందించాడు. రష్యాపై అతి పెద్దదాడి చేసిన ఉక్రెయిన్ ఇది తమ అతిపెద్ద విజయమని పేర్కొంది. ఇలా ఒకరి భూభాగాల నుంచి మరొకరు దాడి చేసుకుంటున్న తరుణంలో ఇస్తాంబుల్‌లో శాంతి చర్చలు ఫలితాలు ఇవ్వలేదు. ఉక్రెయిన్ ముప్పై రోజులు కాల్పుల విరమణ అంటే రష్యా ససేమిరా అంటోంది. అయితే ఒక అంగీకారం కుదరకపోవడం యుద్ధం ఆగిపోతుందనే ఆశ మిణుకు, మిణుకు మంటోంది. అదేమంటే యుద్ధ ఖైదీల మార్పిడి, యుద్ధంలో మరణించిన వారి మృత శరీరాలను అప్పగింతలో ఒక్కటే అంగీకారం కుదిరింది. ఈ విషయం ఉక్రెయిన్ రక్షణ మంత్రి ఉమెరోవ్ చెప్పడం ముదావహం. కాని ఆదివారం ( జూన్ 1) నాటి దాడులలో ఆపరేషన్ స్పైడర్ వెబ్‌కు ప్రతిగా రష్యా భీకర దాడులు చేస్తోంది. అందుకు ఉక్రెయిన్ మేము ఆదివారం చేసిన దాడులలో దాదాపు ఒక వెయ్యిమందికి పైగా రష్యా సైనికులు మరణించారని చెప్పటం గమనార్హం. దీనిపై రష్యా పెదవి విప్పకపోవటం అనుమానాలకు తావిస్తోంది. ఇలా కాల్పులు, ప్రతి కాల్పులతో ఇక శాంతి చర్చలకు అవకాశం ఎక్కడ ఉంటుంది? రెండు దేశాల మధ్య యుద్ధం ఆగిపోతుంది అనేది ఇప్పట్లో జరిగేది కాదు. ఏదైనా అద్భుతం జరిగితే తప్పా. అటు ఉక్రెయిన్‌కు ఇటు రష్యాకు ఎవరు శాంతిచర్చలు జరిపినా ఫలితం శూన్యం. ఒకవేళ భారత్ మాత్రం నడుం బిగిస్తే యుద్ధం ఆగిపోయే అవకాశం ఉండొచ్చు. కాని భారత్,పాక్ మధ్య పోరపొచ్చలు రావడంతో భారత్ మిన్నకుండి పోయింది. పహల్గం దాడిలో పాక్‌కు చెందిన లష్కరే హస్తం ఉండటంతో, దాన్ని పక్కదారి పాటించాలన్న పాక్ కుటిల శక్తులు పారలేదు. ఐక్యరాజ్య సమితిలోని భద్రతా మండలిలో పాక్, పహల్గం ఉగ్రదాడి భారత్ స్వయంకృతం అని చెప్పబోయి చతికిల పడింది. భద్రతా మండలిలో పాక్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తిఖర్ అహ్మద్‌కు తగిన గుణపాఠం భద్రతా మండలి చెప్పింది. పాక్‌కు ఏఒక్క దేశం మద్దతు పలుకలేదు. పాక్ మిత్ర దేశమైనా చైనా కూడా పాక్‌కు మద్దతు చెప్పలేదు. పైగా భారత్ మాపై దాడిచేస్తే విశ్వంలో ఎవరూ మిగలరు అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలు దుమారం లేపాయి. ఆది భారత్‌పై మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. భద్రతా మండలిలోని సభ్యులు పాక్‌ను ఉక్కిరి, బిక్కిరి చేసి మీవి తప్పులు పెట్టుకుని మళ్ళీ భారత్‌పై చాడీలు చెబుతారా అంటూ ఏకిపారేసింది. చైనా మద్దతు ఏలాగూ భారత్‌కు ఉండటంతో భారత ప్రధాని మోదీ భద్రతా మండలిలోని శాశ్వత సభ్య దేశాలైన అమెరికా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ దేశాలతో పాక్ వైఖరిని, ఉగ్రదాడిని వివరించారు. భద్రతా మండలిలో పాక్ ఏకాకి అయిపోయింది. ఇది భారత్ సాధించిన విజయం. భారత్‌తో పోరాడితే మనకే నష్టం అని పాక్‌లోని ఓ మత గురువు చెప్పడం, అక్కడి మసీదులో ఉన్న వాళ్లు కూడా ఎవరూ పాక్‌కు అనుకూలంగా మాట్లాడ లేదు. తప్పు మాదే అనే మిషతో ఉన్నారు. పాక్ ప్రజలు కూడా పాక్‌నే తిట్టిపోస్తుఉంటే ప్రభుత్వం తలలుపట్టుకుంది. భారత్‌ను శరణువేడటమే తరువాయి. అప్పుడే భారత్ శాంతిస్తుంది. లేకపోతే పాక్ నామరూపాలు లేకుండా పోతుంది. ●

# యువత ఉపాధిపై కృత్రిమ మేధ ప్రభావం

తరిగోపుల నారాయణస్వామి

ఇప్పటి యాంత్రిక యుగంలో కృత్రిమ మేధసు ప్రభావం వేగంగా విస్తరిస్తోంది. ఇది ఉద్యోగ రంగాన్ని కుదించే దిశగా ముందుకెళ్తోంది. ప్రపంచవ్యాప్తంగా చూస్తేనే కాదు, మన దేశంలోనూ ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఏఐ సాంకేతికతతో ఎన్నో ఉద్యోగాలు యంత్రాల చేతుల్లోకి వెళ్లిపోయాయి. బ్యాంకులు, ఐటీరంగం, ఫ్యాక్టరీలు, కన్సల్టెన్సీలు, టెలికాలింగ్ కేంద్రాలు ఇలా ఏ రంగానైనా తీసుకున్నా మానవ శక్తికి బదులుగా యంత్రాలు పని చేస్తున్నాయి. ఇది ఆర్థికపరంగా సంస్థలకు లాభదాయకం కావచ్చు. కానీ సమాజానికి మాత్రం ఇది భవిష్యత్ సంక్షోభానికి నాంది. ఇప్పటికే మన దేశంలో యువత పెరుగుతున్న నిరుద్యోగం వల్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అటు ప్రభుత్వ రంగం నుండి కొత్త ఉద్యోగ ప్రకటనలు తక్కువగా రావడం, ఇటు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కోల్పోవడం, ఈ రెండు కలసి ఒక కుంభమేళం లాగా నిరుద్యోగాన్ని పెంచిపెడుతున్నాయి. ప్రభుత్వ నియామక ప్రక్రియలు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయి. గ్రూప్ పరీక్షల ప్రకటనలు సంవత్సరాల తరబడి ఆలస్యం అవుతుండగా, నియామకాల్లో తారతమ్యాలు, కోర్టుల స్టేలు, రాజకీయ ప్రతిస్పందనలు మరింత కల్లోలం సృష్టిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో యువత తమ జీవిత భద్రతపై ఆశను కోల్పోతున్నారు. అందుకే చాలామంది యువకులు పెళ్లిళ్లను వాయిదా వేస్తున్నారు లేదా పూర్తిగా వివాహం వైపు వెళ్లకుండా జీవితాన్ని ఒంటరిగా గడిపే దిశగా అడుగులు వేస్తున్నారు. ఒక కుటుంబం నెరవేర్చే సామర్థ్యం లేకపోతే, ఒకరికొకరు భరోసా ఇచ్చే పరిస్థితి లేకపోతే పెళ్లి ఎలా సాధ్యం అవుతుంది?ఈ ఫలితంగా మన దేశ జనాభా పెరుగుదల మందగిస్తోంది. ఇది కొంతవరకూ మంచి విషయంగా కనిపించొచ్చు, కానీ దీర్ఘకాలంలో ఇది శ్రమిక శక్తి లోపానికి దారితీస్తుంది. అనేక రంగాల్లో పనిచేసే చేతులు లేకపోవడం వలన ఉత్పత్తితీరు తగ్గుతుంది. పెన్షన్, హెల్త్‌కేర్ లాంటి రంగాల్లో వృద్ధ జనాభా కోసం పనిచేసే యంగ్ జనరేషన్ లేకుండా పోవచ్చు. ఇది వృద్ధుల భద్రతకు ప్రమాదాన్ని తీసుకువస్తుంది. ఇక్కడ ప్రశ్నించాల్సింది ఏమిటంటే – పాలకులు ఈ పరిస్థితిని అర్థం చేసుకుంటున్నారా? వారు ఒక వైపు జనాభా తగ్గితే అభివృద్ధి తగ్గుతుందని చెబుతున్నారు. మరొకవైపు ఉద్యోగ అవకాశాలు సృష్టించకుండా నిరుద్యోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇది అంతర్గత విరోధం. పాలకుల వైఖరిచూస్తే, వారు సమాజ భవిష్యత్తుగురించి కాక, తాత్కాలిక లాభాలు, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నట్టు స్పష్టమవుతోంది.




ఇలాంటి పరిస్థితే కొనసాగితే, రాబోయే 10-20ఏళ్లలో మనం తీవ్ర జనాభా సంక్షోభాన్ని, సామాజిక అసమతుల్యతను ఎదుర్కోవల్సి వస్తుంది. దీనికి పరిష్కార మార్గాలు ఉన్నప్పటికీ, వాటిని అమలు చేయాలన్న చొరవ పాలకుల నుండీ, ప్రైవేట్ రంగం నుండీ గోచరించటం లేదు. ఈ సమస్యకు సరైన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యవసరం. కొన్ని కీలక పరిష్కారాలను ఇక్కడ సూచించవచ్చు. ప్రతిరంగంలో ఉద్యోగ సృష్టికి ఏఐ తో సహజీవనం, ఏఐని పూర్తిగా నిషేధించాల్సిన అవసరం లేదు. కానీ అది తీసుకొచ్చే ప్రమాదాలను గుర్తించి, కొత్త రకాల ఉద్యోగ అవకాశాలను రూపొందించాలి. డేటా మేనేజ్మెంట్, ఎథికల్ ఏఐ, మానవ అనుసంధానం వంటి రంగాల్లో శిక్షణలు ఇవ్వాలి. ప్రభుత్వ రంగాన్ని పునర్వ్యవస్థీకరించాలి. ఉద్యోగ నియామక ప్రక్రియలు వేగవంతం చేయాలి. ఖాళీలను నిబంధనలతో నింపాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే. నిరుద్యోగ యువతకు నిరంతరం ధైర్యం ఇచ్చేవిధంగా ప్రభుత్వ రంగం ముందుకు రావాలి. ప్రైవేట్ రంగానికి నిబంధనలు విధించాలి. ఉద్యోగులు తొలగింపుల విషయంలో కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. కర్మాగారాలు, సంస్థలు తమ సామాజిక బాధ్యతను గుర్తించాలి. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఆర్థిక మద్దతు లేదా స్వయం ఉపాధి యోజనల ద్వారా భరోసా కల్పించాలి. నవతరానికి సామాజిక భద్రత, పెన్షన్, ఆరోగ్యబీమా, విద్యా సహాయం వంటి రంగాల్లో యువతకు మద్దతు ఇవ్వడం ద్వారా వారి భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచాలి. ఈ మార్గాల్లో చర్యలు తీసుకోకపోతే రేపటి సమాజం ఘోరసంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. యువత మన దేశ భవిష్యత్తు, వారి భద్రత, అభివృద్ధిపై పెట్టే పెట్టుబడే నిజమైన జాతీయ పెట్టుబడి. కృత్రిమ మేధస్సుతో సమతుల్యంగా మానవమేధస్సును అభివృద్ధి చేయాలంటే, ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, సమాజం – మూడూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పాలకులు ప్రైవేటు ఉద్యోగాలు సృష్టించి ఇస్తామని చెప్పడమే కాకుండా ప్రభుత్వ రంగంలో కూడా ఉద్యోగాలు కల్పించవలసిన అవసరం ఉన్నది ఒక మాటలో చెప్పాలి అంటే పాలకులు పిసినారితనమును వదులుకోవలసిన అవసరము ఉన్నది. అదే సమయంలో ప్రైవేట్ రంగంలో కూడా నియంత్రణలో ఉంచుకొని నిరుద్యోగ సమస్యలేకుండా ఉద్యోగ కల్పన చూపించే బాధ్యత పాలకులపైఉన్నది. అది ఇప్పుడు స్పందించకుండా ఉంటే మన మనుగడకే ముప్పుగా మారుతుంది. కనుక పాలకులు జనాభా పెంచండి అని చెప్పడమే కాకుండా పెరిగిన జనాభాకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ప్రవేటు రంగంతో పాటు ప్రభుత్వ రంగంలో ఇవ్వవలసిన బాధ్యత ఉన్నది. అప్పుడే పాలకులు చెప్పే మాటలు యువత ఆచరణలో చూపే అవకాశం ఉంటుంది. పాలకులు అలా చేయకుండా ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చిన యువత పాటించదు. దీనిని గమనంలోకి తీసుకోవలసిన ఆవశ్యకత పాలకులపై ఉన్నది. ఆ విధంగా పాలకులు చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం. ●



# దాడుల్లో 9పాక్ యుద్ధ విమానాలు ధ్వంసం

## 'ఆపరేషన్ సిందూర్'పై అధికార వర్గాల వివరణ

**న్యూఢిల్లీ, జూన్ 4:** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో దాయాది పాకిస్థాన్‌కు భారీ నష్టం వాటిల్లింది. భారత్ ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణి వంటి కచ్చితత్వంతో కూడిన ఆయుధాలు పాక్‌లోని అనేక ప్రాంతాల్లో భారీ విధ్వంసం సృష్టించాయి. ఈ దాడుల్లో పాక్ సైనిక, వైమానిక స్థావరాలు పెద్దమెత్తంలో దెబ్బతిన్నాయి. భారత బలగాలు చేసిన దాడుల్లో పాక్‌కు చెందిన సాయుధ డ్రోన్లతో సహా తొమ్మిది యుద్ధ విమానాలు ధ్వంసమైనట్లు. సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడిలో పాక్ చెందిన ఆరు పాక్ యుద్ధ విమానాలు, రెండు నిఘా విమానాలు ఒకటి సీ 130 హెర్క్యులస్ రవాణా విమానం ధ్వంసమైనట్లు అధికారికవర్గాలు పేర్కొన్నాయి. అంతేకాదు, పదికి పైగా సాయుధడ్రోన్లు, పలు క్రూయిజ్ మిసైల్స్‌ను భారత బలగాలు నేలకూల్చినట్లు వెల్లడించాయి. పాక్‌లోని పంజాబ్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రాంతాల్లో భారత్ చేపట్టిన వైమానిక దాడుల్లో వీటిని కూల్చివేసినట్లు చెప్పాయి. భారత రాడార్ వ్యవస్థ సంగ్రహించిన ట్రాకింగ్, థర్మల్ సిగ్నేచర్‌ల ద్వారా వీటి కూల్చివేతను నిర్ధారించినట్లు సైనిక వర్గాలు తెలిపాయి. నాలుగు రోజులుపాటు జరిగిన ఈ ఘర్షణల్లో పాక్ నిఘావ్యవస్థకు భారీ నష్టం చేసినట్లు రక్షణ శాఖ వర్గాలు చెప్పాయి. నిఘా విమానాలను. భారత్ బలగాలు కూల్చివేసినట్లు పేర్కొన్నాయి. భారత సుదర్శన చక్రఎస్400తో 300 కిలో మీటర్ల దూరం నుంచే ఈ రెండు విమానాలను కూల్చివేసినట్లు వెల్లడించాయి. స్వీడన్ పరిజ్ఞానంతో రూపొందించిన ఏఈడబ్ల్యూ అండ్ సీ నిఘా విమానాన్ని భోలారి ఎయిర్ బేస్‌లో పాక్ ఉంచింది. ఈ ఎయిర్ బేస్‌పై చేసిన దాడిలో ఆ నిఘా విమానం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తోంది. పాక్‌లోని పంజాబ్‌పై చేసిన మరోకదాడిలో సీ130 హెర్క్యులస్ రవాణా విమానం ధ్వంసమైంది. ఆపరేషన్ సిం దూర్‌లో పాక్ డ్రోన్లను అత్యంత కచ్చితత్వంతో భారత బలగాలు నేలమట్టం చేశాయి. ఈ ఆపరేషన్‌లో చైనాకు చెందిన వింగ్ లూంగ్ సిరీస్‌కు చెందిన మీడియం, లాంగ్ ఎండ్యూరెన్స్ డ్రోన్లను కూల్చివేశాయి. పదుల సంఖ్యలోడ్రోన్లను ఒకే ఒక్క దాడితో భారత ధ్వంసం చేసింది. అంతేకాదు జమ్మూ కశ్మీర్, రాజస్థాన్ భూభాగాలపై పాక్ ప్రయోగించిన డ్రోన్లను భారత బలగాలు సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణ శాఖ వర్గాలు చెప్పాయి. భారత్ దాడుల్లో పాకిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో విధ్వంసం జరిగినట్లు ఆ దేశం తాజాగా విడుదల చేసిన పత్రాలు వెల్లడించాయి. ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోని పెషావర్, సింధ్ రాష్ట్రంలోని అట్టాక్, బహావల్‌నగర్, హైదరాబాద్, పంజాబ్‌లోని గుజ్రాత్, ఝంగ్ ప్రాంతాలపై భారత్ దాడి చేసినట్లు అవి పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిగా పాకిస్థాన్ చేపట్టిన 'ఆపరేషన్ బున్యన్ ఉమ్ మర్సూస్'పై విడుదల చేసిన పత్రాల్లో ఈ వివరాలు బహిర్గతమయ్యాయి.



# ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు..

## ఈ ఆర్థిక సంవత్సరంలో ఇవ్వనున్న బ్రిటన్

**లండన్, జూన్ 4:** ఇటీవల రష్యాలోని వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ భారీగా డ్రోన్ దాడులకు పాల్పడడంతో మాస్కోకు చెందిన 41 యుద్ధ విమానాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కీవ్‌కు భారీ సంఖ్యలో డ్రోన్‌లను సరఫరా చేయడానికి బ్రిటన్ ముందుకువచ్చింది. 2026 ఏప్రిల్ నాటికి ఉక్రెయిన్‌కు లక్ష డ్రోన్లు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఆ దేశానికి ఇచే 4.5 బిలియన్ పౌండ్ల మిలిటరీ మద్దతులో ఈ 350 మిలియన్ పౌండ్ల డ్రోన్ ప్యాకేజీ భాగమని పేర్కొంది. స్వతంత్రంగా ఉత్పత్తి చేసిన స్ట్రాటజిక్ డిఫెన్స్ రివ్యూను బ్రిటన్ ప్రభుత్వం ఆమోదించింది. రష్యన్ దురాక్రమణతో సహా ఉద్భవించిన మరిన్ని ముప్పులను ఎదుర్కోవడానికి కీవ్‌కు మిలిటరీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపింది. బ్రస్సెల్స్‌లో నిర్వహించనున్న 50 దేశాల ఉక్రెయిన్ డిఫెన్స్ కాంటాక్ట్ గ్రూప్ సమావేశంలో బ్రిటన్ రక్షణ కార్యదర్శి జాన్ హీలీ ఈ ప్రకటన చేయనున్నారు. రష్యా వద్ద అపారమైన క్షిపణి సంపద ఉంది. ఆ దేశంతో పోలిస్తే ఉక్రెయిన్ దగ్గర భారీ ఆయుధాలు లేకపోవడంతో కీవ్‌ను ఆయుధాల కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో కీవ్‌ను ఆయుధాల కొరత వెంటాడుతోంది. ముఖ్యంగా గగనతల రక్షణ వ్యవస్థ లేకపోవడంతో రష్యా చేసే క్షిపణులు, డ్రోన్ల దాడులను తట్టుకోలేకపోతోంది. దీంతో రిమోట్ సాయంతో సుదీర్ఘంగా ప్రయాణించగలిగే డ్రోన్ల వ్యవస్థను అభివృద్ధి చేసుకుంది. వీటితో తాజాగా రష్యాలోని అనేక ప్రాంతాల్లో భారీ దాడులకు పాల్పడింది. గతంలోనూ రష్యా సైనిక స్థావరాలు, చమురు బావులపై దాడులు చేసేందుకు ఉక్రెయిన్ వీటిని ప్రయోగించింది. భవిష్యత్తులో రష్యా ఆక్రమణల ను ఎదుర్కోవడానికి మరిన్ని డ్రోన్లు సరఫరా చేయాలని మిత్ర దేశాలను కోరింది. మాస్కో కీవ్‌పై భీకర దాడులకు పాల్పడుతుండడంతో రష్యా దాడుల నుంచి తమ దేశాన్ని రక్షించుకోవడానికి పలు పశ్చిమ దేశాలు, బ్రిటన్, అమెరికా ఉక్రెయిన్‌కు ఆయుధాలను పంపిణీ చేస్తున్నాయి. ఇటీవల రష్యాపై దీర్ఘశ్రేణి ఆయుధాలు ప్రయోగించకుండా ఉక్రెయిన్‌పై ఉన్న ఆంక్షలను పశ్చిమదేశాలు తొలగించడంతో కీవ్‌కు దీర్ఘశ్రేణి ఆయుధాలు ప్రయోగించే అవకాశం లభించింది.

# రేపే జమ్ముకాశ్మీర్‌లో ప్రధాని మోడీ పర్యటన

### చీనాబ్ వంతెన, రైల్వేలైన్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లు ప్రారంభం

### ఆపరేషన్ సిందూర్ తర్వాత కాశ్మీర్‌లో మోడీ తొలిపర్యటన

**శ్రీనగర్, జూన్ 4:** ఆపరేషన్ సింధూర్ తర్వాత జమ్ముకాశ్మీర్‌లో మొదటిసారి ప్రధానిమోడీ పర్యటిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన వంతెనచీనాబ్ వంతెనను ప్రారంభించడంతోపాటు శ్రీనగర్‌ను కొత్త రైల్వేలైన్‌తో దేశంలోని ఇతర రైల్వే నెట్‌వర్క్‌తో కలిపే ప్రాజెక్టును జాతికి అంకితంచేస్తారు. అలాగే ఎప్పటినుంచో కాశ్మీర్ వాసులు కలలు కంటున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను కూడా ప్రధానిమోడీ ఈనెల ఆరవ తేదీ ప్రారంభించనున్నారు. చీనాబ్ వంతెన ద్వారా భారత రైల్వే నెట్‌వర్క్‌తో జమ్ముకాశ్మీర్ అనుసంధానంఅవుతుంది. మరి కొన్ని రోజుల్లో కాట్రా శ్రీనగర్ వందేభా రత్‌రైలు నడుస్తుంది. జమ్ముఉద్ధంపూర్ రైల్వే లింక్‌ప్రాజెక్టు, శ్రీనగర్ బారాముల్లా మధ్య తుది




రైలు లింక్‌ప్రాజెక్టులు కూడా ఇపుడు అమలుకు రానున్నాయి. అమర్‌నాథ్ యాత్రీకులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే వందేభారత్‌రైలును కూడా ఈనెల ఆరోతేదీనే ప్రారంభిస్తున్నారు. కాట్రా బారాముల్లామధ్య తొలిదశలో రైళ్ల నడిచేందుకు వీలుగా రైల్వేస్టేషన్ విస్తరణపనులు కూడా పూర్తిచేసారు. జమ్ముతావి రైల్వేస్టేషన్ విస్తరణ పనులు పూర్తి కావస్తున్నందున రైలు సర్వీసులు జమ్ముకు కూడా నడుపుతారు. కాట్రాలో దిగి మరోరైలు ఎక్కాల్సి ఉంది. ఇపుడు కాట్రా శ్రీనగర్ వందేభారత్‌వల్ల ఏటా అమర్‌నాథ్ యాత్రసీజన్‌లో యాత్రీకులకు ఎంతో అనువుగా ఉంటుందని అంచనా. ఉధంపూర్ శ్రీనగర్ బారా ముల్లా రైల్వేలైన్‌పరిధిలో 36 సొరంగాలు న్నాయి. 119 కిలోమీటర్ల దూరం ఇవి కవర్ చేస్తున్నాయి. ఇక చీనాబ్ వంతెన పరంగా చూస్తే నీటిమట్టానికి 359 మీటర్ల ఎత్తులో నిర్మించారు. జమ్ముకాష్మీర్‌లోనిరియాసి జిల్లాలో ఉన్న బక్కల్ కౌరి గ్రామాలను కలుపుతున్నది. రైల్వేలింక్ ప్రాజెక్టులో భాగమే చీనాబ్ వంతెన నిర్మాణం. ఈ వంతెన నిర్మాణంకోసం కేంద్రం 1486 కోట్లు ఖర్చుచేసింది. ఈనెల ఆరోతేదీ ప్రధాని పర్యటన కోసం మోడీ భద్రతా టీమ్ రంగంలోకి దిగింది. కాట్రా రైల్వేస్టేషన్, స్పోర్ట్స్ స్టేడియంలలో మోడీకి ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లుచేస్తున్నారు. మోడీ ర్యాలీ వేదిక, రైల్వేస్టేషన్, వంతెన ప్రాంతాలను ఇప్పటికే తమ అధీనంలోకి ఎస్‌పిజి తీసుకుంది. సమగ్ర తని ఖీలు చేపట్టింది.



# పోలీసుల అదుపులో మరో దేశద్రోహి!

**ఛండీఘర్, జూన్ 4:** గూఢచర్యం ఆరోపణలపై మరోపంజాబీ యూట్యూబర్‌ను మొహాలిలోని రాష్ట్ర స్పెషల్ ఆపరేషన్స్ సెల్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. జస్బీర్ అనే ఈ యువకుడు రూప్‌నగర్ జిల్లా మహ్లన్ గ్రామానికి చెందినవాడు. జాన్‌మహల్ అనే యూట్యూబ్‌ఛానల్ నిర్వహిస్తున్నాడు. ఐఎస్ఐకి కీలక సమాచారం చేరవేస్తునన‌ట్లు ఆధారాలు లభించడంతో ఆతడిని ఎస్ఎస్ఓసి అదుపులోకి తీసుకుంది. ఇప్పటివరకూ మొహాలిలో ఉన్న ఈసెల్ 12మందికిపైగా అదుపులోకి తీసుకుంది. వారిలో ఇద్దరు యూట్యూబర్లుకూడా ఉన్నారు. పాకిస్థానీ ఉగ్రవాద నెట్‌వర్క్‌కు గతనెలలో కీలక రహస్యాలను చేరవేస్తున్నట్లు తేలింది. జ్యోతి మల్హోత్రాతోపాటు ఈ పంజాబీ యూట్యూబర్ కూడా అదే విద్రోహ చర్యలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ మాట్లాడుతూ స్పష్టమైన ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఈ కీలక విద్రోహచర్యల నెట్‌వర్క్‌ను మా ఎస్ఎస్ఓసి ఛేదించిందని జస్బీర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. జస్బీర్‌సింగ్ పర్సన్ ఆఫ్ ఇండియన్‌ఆరిజన్ షకీర్‌కు అత్యంత సన్నిహితంగా ఉన్నాడని ఉగ్ర సంబంధిత విద్రోహ కార్యకలాపాల విభాగానికి జట్ రణ్‌ధావా పేరుతో అత్యంత కీలకంగా వ్యవహరించాడు. ఇషాన్ ఉర్ రహమాన్ అలియాస్ డ్యానిష్‌తో కూడా అత్యంతసన్నిహితంగా ఉననన‌ట్లు తేలింది. ఢిల్లీలోజరిగిన పాక్ నేషనల్ డే వేడుకల్లో పాల్గొన్నాడు. డానిష్ ఆహ్వానంతో వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అక్కడే పాకిస్తాన్ ఆర్మీ అధికారులు, వ్లాగర్లను కలుసుకున్నాడు. మూడు ప్రత్యేక సందర్భాల్లో జస్బీర్ పాకిస్తాన్‌లోపర్యటించాడు. సింగ్‌నుంచి స్వాధీనం చేసుకున్న ఎలక్ట్రానిక్ పరికరాలనుంచి మొత్తం డేటాను సమీకరించారు. పాక్ ఆధారిత నంబర్లు అధికంగా ఉన్నాయి. వీటన్నింటిని సమగ్ర పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. జ్యోతి అరెస్టుతో జస్బీర్ తన కమ్యూనికేషన్ హిస్టరీ మొత్తం డిలిట్‌చేయాలని చూసాడు. పిఐఒలతో సంప్రదింపులన్నింటిని చెరిపివేసి అరెస్టును తప్పించుకో వాలని చూసినట్లు అధికారులు చెపుతున్నారు. మొహాలి ఎస్ఎస్ఒసి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసామని, దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.




# పాక్‌కు ఎడిబి 500 మిలియన్ డాలర్ల సాయం

**ఇస్లామాబాద్, జూన్ 4:** భారత్‌నుంచి ఆర్థిక ఆంక్షలు ప్రకటించాలని, రుణపరపతులపై అంతర్జాతీయ ద్రవ్యసంస్థలకు పదేపదే అభ్యంతరాలు చెపుతున్నా పాకిస్తాన్‌కు అటు ఐఎంఎఫ్, ఇటు ఆసియా అభివృద్ధి బ్యాంకులు రుణపరపతిని అందించాయి. అమెరికా ఐఎంఎఫ్ సుమారు 8500 కోట్ల రుణపరపతిని అందిస్తే తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంకు 300 మిలియన్ డాలర్ల పాలసీ ఆధారిత రుణాన్ని మంజూరు చేసింది. అలాగే 500 మిలియన్ డాలర్ల పథక ఆధారిత గ్యారంటీని కూడా ఇచ్చింది. ఐఎంఎఫ్‌నుంచి 8500 కోట్లు రుణపరపతిని సాధించిన వెంటనే ఈ కొత్తరుణం పాకిస్థాన్ సాధించుకోగలిగింది. ఆర్థికమంత్రి సలహాదారు ఖుర్రమ్ షెహజాద్ ఈ ఎడిబి ప్యాకేజిని ధృవీకరించారు. పాకిస్థాన్ ఆస్థిక సుస్థిరతను మరింతగా పెంచుకునేందుకు ఈ ప్యాకేజి ఉపయోగపడుతుందని ఎడిబి వెల్లడించింది. పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌కు కూడా సంస్కరణలతో అమలుచేసేందుకు వీలుకలుగుతుంది. ఎడిబి కంట్రీ డైరెక్టర్ ఎమ్మా ఫాన్ మాట్లాడుతూ పాకిస్థాన్ స్థూల ఆర్థికవ్యవస్థ మెరుగుపడేందుకు అవసరమైన ప్రగతిని సాధించిందని చెప్పారు. ఈ ఆర్థికసాయంతో ఆర్థికరంగపరంగా పాక్‌ప్రభుత్వం సంస్థాగత సంస్కరణలుమరిన్ని చేపట్టి ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థను పటిష్టంచేసుకుంటూ సుస్థిర వృద్ధిని నమోదుచేస్తుందని ఎడిబి వ్యాఖ్యానించింది. పన్ను వ్యవస్థను మరింతగా సంస్కరిస్తుందని ప్రభుత్వ వ్యయం, నగదు పర్యవేక్షణలను నియంత్రిస్తుందని చెపుతున్నారు. డిజిటలైజేషన్, పెట్టుబడుల సౌకర్యం, ప్రైవేటు రంగ అభివృద్ధిని మరింతపెంచుకోవాలని ఎడిబి సూచించింది. ఈ చర్యల వల్ల పాకిస్థాన్ ఆర్థిక లోటును, ప్రభుత్వ రుణాన్ని మరింతగా తగ్గించుకోగలవని, సామాజిక అభివృద్ధి, సంక్షేమం పరంగా కూడా మరింతగా వ్యయం చేసేందుకు వీలవుతుందని నిపుణులు చెపుతు న్నారు. దేశీయంగా వనరుల సమీకరణ చేసుకుంటూ ఆర్థికవ్యవస్థను పటిష్టంచేసుకునేందుకు ఆర్థిక రంగ సంస్కరణలు అమలుచేసే వీలుటుందని చెప్పారు.

ఈ ఆర్థికసాయంతో పాక్ పన్నుల వ్యవ స్థ మెరుగుపడుతుందని, రాబడులు పెంచి ఆర్థిక క్రమశిక్షణ మెరుగుపడుతుందని దేశీయ నిపుణులు చెపుతున్నారు. ఎడిబి, ఐఎంఎఫ్‌ల సాయంతో దేశరాబడుల బేస్‌ను పెంచుతుందని, ఆర్థికంగా స్వయం సమృద్ధికి చేరుకునే వీలువుతుందని భావిస్తోంది. అయితే ఎడిబి అందించిన సాయాన్ని పాకిస్థాన్ దుర్వినియోగం చేస్తుందని, పన్ను నుంచి జిడిపి నిష్పత్తిలో వ్యయంచేయకుండా అంతర్జాతీయసాయాలను ఉగ్రవాదులకు సాయంగాఉపయోగించగలదని ఆందోళన వ్యక్తంచేసింది. రక్షణరంగవ్యయం అంచనాలకు మించి పెంచుకోవడంవల్ల ఆర్థిక సుస్థిరత ఏం బాగుపడుతుందని ప్రశ్నించింది.

# ఉత్తరకొరియాతో చర్చలు పునరుద్ధరిస్తా

### దక్షిణకొరియా కొత్త అధ్యక్షుడు లీజె మ్యూంగ్



**సియోల్, జూన్ 4:** ఉత్తర కొరియాతో చర్చలను పునఃప్రారంభిస్తానని, అమెరికా మరియు జపాన్‌లతో త్రైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తానని దక్షిణ కొరియా కొత్త అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ బుధవారం హామీ ఇచ్చారు, తన ఐదు సంవత్సరాల పదవీకాలానికి కీలక విధాన లక్ష్యాలను ఆయన నిర్దేశించారు. అసమానత మరియు అవినీతిపై పోరాడతానని ప్రతిజ్ఞ చేస్తూ దక్షిణ కొరియాలో ప్రముఖ లిబరల్ రాజకీయ నాయకుడిగా బాల్యం నుండి ఎదిగిన లీ, బుధవారం తన పాలనను అధికారికంగా ప్రారంభించారు, గత సంవత్సరం చివర్లో అప్పటి అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ విధించిన మార్షల్ లా కారణంగా తొలగించడం ద్వారా ఏప్రిల్‌లో జరిగిన ఆకస్మిక ఎన్నికల్లో గెలిచిజాతీయ అసెంబ్లీలో తన ప్రారంభోపన్యాసంలో, లీ తన ప్రభుత్వం దక్షిణ కొరియాయుఎస్ సైనిక కూటమి ఆధారంగా "బలమైన నిరోధకత"తో ఉత్తర కొరియా దురాక్రమణలను ఎదుర్కొంటుందని చెప్పారు. కానీ అతను "ఉత్తర కొరియాతో కమ్యూనికేషన్ ఛానెల్‌ను తెరిచి, చర్చలు మరియు సహకారం ద్వారా కొరియా ద్వీపకల్పంలో శాంతిని నెలకొల్పుతానని" అన్నారు. పొరుగు దేశాలతో ఆచరణాత్మక దౌత్యాన్ని కొనసాగిస్తానని మరియు బలమైన దక్షిణ కొరియాయుఎస్ కూటమి ఆధారంగా సియోల్‌వాషింగ్టన్‌టోక్యో త్రైపాక్షిక సహకారాన్ని పెంచుతానని ఆయన అన్నారు. "జాతీయ ప్రయోజనాల ఆధారంగా ఆచరణాత్మక దౌత్యం ద్వారా, ప్రపంచ ఆర్థిక మరియు భద్రతా దృశ్యాలలో ప్రధాన మార్పు వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని మన జాతీయ ప్రయోజనాలను పెంచుకునే అవకాశంగా మారుస్తానని లీ అన్నారు. లీ ఎన్నిక దక్షిణ కొరియా విదేశాంగ విధానంలో ఏదైనా పెద్ద, తక్షణ మార్పుకు కారణమవుతుందా అనేది అస్పష్టంగా ఉంది. గతంలో చైనా మరియు ఉత్తర కొరియా వైపు మొగ్గు చూపుతున్నారని మరియు అమెరికా, జపాన్ నుండి దూరంగా ఉన్నారని విమర్శకులు ఆరోపించిన లీ, ఇటీవల దక్షిణ కొరియా తన విదేశాంగ విధానానికి పునాదిగా అమెరికాతో పొత్తును పదే పదే నొక్కి చెప్పారు. లీ కోసం ఎదురుచూస్తున్న అత్యంత కఠినమైన బాహ్య సవాళ్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యొక్క సుంకాల విధానం మరియు ఉత్తర కొరియా ముందుకు సాగిస్తున్న అణు కార్యక్రమం. కానీ అధ్యక్షుడు ఎవరు అయినా ఆ అంశాలపై దక్షిణ కొరియాకు అనుకూలంగా పెద్ద పురోగతి సాధించడానికి పెద్దగా చేయలేరని నిపుణులు గతంలో అన్నారు. తన పదవీ స్వీకార ప్రసంగంలో, లీ అమెరికాతో వాణిజ్య సమస్యలను నేరుగా ప్రస్తావించలేదు. నెమ్మదిస్తున్న దేశీయ ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపజేయడం తన ప్రధాన ప్రాధాన్యత అని మరియు మాంద్యం ముప్పులకు వ్యతిరేకంగా "ముఖ్యమైన పోరాటం" నిర్వహించడానికి తన ప్రభుత్వం వెంటనే అత్యవసర టాస్క్ ఫోర్స్‌ను ప్రారంభిస్తుందని లీ అన్నారు. ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించడానికి మరింత దూకుడుగా ప్రభుత్వ ఖర్చును కూడా ఆయన హామీ ఇచ్చారు. దక్షిణ కొరియా కేంద్ర బ్యాంకు తన కీలక వడ్డీ రేటును తగ్గించి, 2025 సంవత్సరానికి దాని వృద్ధి అంచనాను 0.8శాతానికి తగ్గించింది. జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్ కిమ్ మ్యూంగ్‌సూతో టెలిఫోన్ కాల్‌లో, స్థానిక టీవీ ఫుటేజ్ ప్రకారం, ఉత్తర కొరియా కదలికలను నిశితంగా పర్యవేక్షించాలని మరియు దక్షిణ కొరియాయుఎస్ సైనిక కూటమి ఆధారంగా దృఢమైన సంసిద్ధతను కొనసాగించాలని లీ సైన్యాన్ని కోరారు. తరువాత లీ సియోల్‌లోని జాతీయ శ్మశానవాటికను సందర్శించి, అక్కడ ఖననం చేయబడిన కొరియా నాయకులు, దేశభక్తులు మరియు యుద్ధంలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.

# పాకిస్థాన్‌కు ఎప్పుడూ ఎదురుదెబ్బలే

### తమ పరాభవాలు బయటపెట్టిన బిలావల్ భుట్టో

**ఇస్లామాబాద్, జూన్ 4:** అంతర్జాతీయ వేదికలపై తమ దేశానికి తగిలిన ఎదురుదెబ్బల గురించి స్వయంగా పాక్ నేత బిలావల్ భుట్టో వెల్లడించారు. కాశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితిలో లేవనెత్తేందుకు చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కలేదని వాపోయారు. ఆపరేషన్ సిందూర్‌పై ఏర్పాటైన భారత అఖిలపక్షం తరహాలో పాక్ కూడా తన విదేశాంగ శాఖ మాజీ మంత్రి బిలావల్ భుట్టో ఆధ్వర్యంలో ఓ ఎంపిల బృందాన్ని ఏర్పాటు చేసింది. వీరిని అమెరికా పంపగా, ఆ పర్యటనలో భాగంగా న్యూయార్క్‌లోని ఐరాస కేంద్ర కార్యాలయంలో భుట్టో మాట్లాడారు.

'కాశ్మీర్ అంశానికి సంబంధించినంత వరకు మనం ఎదుర్కొంటున్న అడ్డంకులు ఇప్పటికే ఉన్నాయి. దీంతోపాటు ఇతర వేదికలపై ఎదురుదెబ్బలు తగిలాయి' అని వ్యాఖ్యానించారు. 'రెండు అణ్వస్త్ర దేశాల మధ్య వివాదాల పరిష్కార వ్యవస్థను తీసుకురావడం అసాధ్యం. మా రెండు దేశాలకు చెందిన నిఘా సంస్థలు ఐఎస్ఐ, రా..కలిసి కూర్చొని, ఈ ఉగ్రవాద శక్తులపై పోరాటం కోసం కలిపి పనిచేస్తే, ఉగ్రవాద కార్యకలాపాలు తగ్గిపోతాయని నేను భావిస్తున్నాను' అని మాట్లాడారు. రెండు దేశాల మధ్య నిరంతర ఘర్షణ విద్రోహశక్తులను బలోపేతం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేయడం గమనార్హం. నిత్యం ఉగ్రవాదాన్ని ఎగదోసే ఆ దేశం నీతులు చెప్పడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. గతంలోనూ తన దేశం గురించి ఆయన వాస్తవాలు బయటపెట్టారు. ఉగ్రవాద సంస్థలతో పాకిస్థాన్‌కు సంబంధాలు నిజమేనంటూ ఇటీవల వెల్లడించారు. 'పాకిస్థాన్‌కు గతం ఉందనేది రహస్యం కాదని నేను భావి



స్తున్నా. ఫలితంగా మనం బాధపడ్డాం. పాకిస్థాన్ నష్టపోయింది. ఆ పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఈ సమస్య పరిష్కారానికి అంతర్గత సంస్కరణలు చేపట్టాం. పాకిస్థాన్ తీవ్రవాద చరిత్ర తిరస్కరించలేనిది. అయితే, అది ముగిసిన అధ్యాయం. అది మన చరిత్రలో ఒక దురదృష్ట భాగం' అని స్థానిక మీడియాతో భుట్టో వెల్లడించారు.



# జాతిపితిగా ముజిబుర్ రహ్మాన్ పేరు తొలగింపు..

## చట్టంలో మార్పు చేసిన యూనస్ ప్రభుత్వం

**ఢాకా, జూన్ 4:** బంగబంధు ముజిబుర్ రహ్మాన్, మాజీ ప్రధాని షేక్ హాసీనా కుటుంబాన్ని చరిత్ర నుంచి కనుమరుగు చేసేలా బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం తన ప్రయత్నాలు కొనసాగిస్తోంది. దానిలో భాగంగా బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు ఉన్న 'ఫాదర్ ఆఫ్ నేషన్' బిరుదును తొలగించింది. అలాగే స్వాతంత్ర్య సమరయోధులు అనే పదానికి కొత్త అర్థాన్ని ఇచ్చింది. ఈ మేరకు నేషనల్ ఫ్రీడమ్ ఫైటర్స్ కౌన్సిల్‌యాక్ట్‌ను సవరించిందని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. దీనికి సంబంధించి మంగళవారం రాత్రి న్యాయశాఖ ఆర్డినెన్స్ జారీ చేసిందని తెలిపాయి. 'యూనస్ ప్రభుత్వం జాతిపిత బంగబంధు షేక్ ముజిబుర్ రహ్మాన్ పదాలు, చట్టంలో ఆయన పేరు ఉన్న భాగాలను తొలగించింది' అని ఓ మీడియా కథనం పేర్కొంది. ఇటీవల ముజిబుర్ చిత్రం ఉన్న కరెన్సీ నోట్ల స్థానంలో కొత్త డిజైన్‌తో కూడిన నోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దాని స్థానంలో హిందూ, బౌద్ధ ఆలయాల ఫొటోలను కరెన్సీ నోట్లపై ముద్రిస్తోంది. జూన్ 1వ తేదీ నుంచి కొత్తనోట్ల జారీ మొదలైంది. 'కొత్త డిజైన్, సిరీస్‌ప్రకారం.. కరెన్సీ నోట్లపై మానవ చిత్రాలు ఉండవు. వీటికి బదులుగా ప్రకృతి, ప్రాచుర్యం పొందిన ప్రదేశాలు ఉంటాయి' అని బంగ్లాదేశ్ బ్యాంక్ అధికార ప్రతినిధి వెల్లడించారు. తూర్పు పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌గా పేరు మార్చుకున్న తర్వాత 1972లో కరెన్సీ నోట్లపై ఓ మ్యాప్‌ను ముద్రించారు. అనంతరం షేక్ హాసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ చిత్రంతో కూడిన నోట్లను విడుదల చేశారు.

# అమెరికా అణుఒప్పంద ప్రతిపాదనలపై ఖొమైనీ ఆగ్రహం

**టెహ్రాన్, జూన్ 4:** ఇరాన్‌తో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఒమన్ రాజధాని మస్కట్‌లో జరిగిన పరోక్ష సమావేశంలో చర్చలు కొనసాగించాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నాయి. దాంతో ఈ విషయంలో తొలి అడుగు పడింది. అయితే అణుఒప్పందానికి సంబంధించి అమెరికా నుంచి వచ్చిన తొలి ప్రతిపాదనపై ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ విమర్శలు చేశారు. యూఎస్ ప్రతిపాదన తమ చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఉందని వ్యాఖ్యానించారు. దేశంలో 100 న్యూక్లియర్ పవర్‌ప్లాంట్లు ఉన్నా దేశం సుసంపన్నం కాకుంటే అవి ఉపయోగపడవని, మళ్లీ నిధుల కోసం అమెరికా ముందు చేయి చాచాల్సి వస్తుందని అన్నారు. అయితే అమెరికాతో అణు ఒప్పందాన్ని పూర్తిగా తిరస్కరిస్తున్నట్లు మాత్రం ఖమేనీ పేర్కొనలేదు. అణు ఒప్పందంపై చర్చలు జరుగుతున్నప్పటికీ యూఎస్ ప్రతిపాదన గురించి మాత్రం ఎలాంటి సమాచారం బయటకు రాలేదు. అయితే ఆక్సియోస్ అనే వార్తా వెబ్‌సైట్ వివరాల ప్రకారం ఇరాన్ తన చుట్టు పక్కల దేశాలతో కలిసి యురేనియం శుద్ధి కోసం ఒక కన్సార్టియంను ఏర్పాటు చేయాలని అమెరికా ప్రతిపాదించింది. కానీ దీనివల్ల టెహ్రాన్‌కు ఎంత నష్టం వాటిల్లుతుందనే విషయం తెలియాల్సి ఉంది. అయితే ఇరుదేశాల మధ్య ఒప్పందం విఫలమైతే ఇప్పటికే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఇరాన్ ఆర్థికవ్యవస్థ మరింత పతనమయ్యే అవకాశం ఉంది. మరో వైపు మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశంఉంది. ఇరాన్ అణ్వాయు ధా లను అభివృద్ధి చేసుకోకుండా నిలువరించేందుకు కొద్దికాలంగా అమెరికా ప్రయత్నాలు చేస్తోంది.

# హమాస్ కొత్త అధినేతగా అల్‌హద్దాద్!

**జెరూసెలేం, జూన్ 4:** గాజాలో హమాస్ సైనిక విభాగం అధిపతి మహమ్మద్ సిన్వార్ ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో మరణించడంతో, ఆ సంస్థ తదుపరి నాయకుడిగా ఇజ్ అల్‌దిన్ అల్‌హద్దాద్ బాధ్యతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. గాజాలో ప్రస్తుతం జీవించి ఉన్న అత్యంత సీనియర్ కమాండర్ అల్‌హద్దాదే కావడంతో, కార్యాచరణ నియంత్రణ ఆయన చేతుల్లోకి వెళ్తుందని జెరూసలేం పోస్ట్ నివేదించింది. ఖాన్ యూనస్‌లోని యూరోపియన్ ఆసుపత్రి ప్రాంగణంలో ఇజ్రాయెల్ ఐడీఎఫ్ జరిపిన దాడిలో మహమ్మద్ సిన్వార్ మరణించారు. 2024లో యహ్యా సిన్వార్, మహమ్మద్ దెయిఫ్‌ల హత్యల అనంతరం మహమ్మద్ సిన్వార్ హమాస్‌కు నాయకత్వం వహిస్తున్నారు. ఈ దాడిలో రఫా బ్రిగేడ్ కమాండర్ మహమ్మద్ షబానా, దక్షిణ ఖాన్‌యూనస్ బెటాలియన్ చీఫ్ మెహదీ క్వారా కూడా మరణించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది. కేవలం 30 సెకన్ల పాటు సాగిన ఈ దాడిలో 50కి పైగా ప్రెసిషన్‌గైడెడ్ ఆయుధాలను ఉపయోగించినట్లు తెలిసింది. ఆసుపత్రి భవనానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా, దాని కింద ఉన్న హమాస్ కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి జరిగినట్లు సమాచారం. ఇజ్ అల్‌దిన్ అల్‌హద్దాద్ చాలాకాలంగా హమాస్ మిలిటరీ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్నారు. 2021 నుంచి గాజా నగరంలోని ఇజ్ అల్‌దిన్ అల్ ఖస్సామ్ బ్రిగేడ్స్‌కు నాయకత్వం వహిస్తున్నారు. నవంబర్ 2023 లో, ఆయనను



హమాస్ ఉత్తర గాజా బ్రిగేడ్ అధిపతిగా నియమించారు. గాజాలోని హమాస్ ఐదుగురు అసలు బ్రిగేడ్ కమాండర్లలో ప్రస్తుతం జీవించి ఉన్నది అల్‌హద్దాద్ మాత్రమేనని జెరూసలేం పోస్ట్ పేర్కొంది. అత్యంత రహస్యంగా వ్యవహరించే అల్‌హద్దాద్, ఆరుసార్లు ఇజ్రాయెల్ హత్యాప్రయత్నాల నుంచి తప్పించుకున్నట్లు భావిస్తున్నారు. ఆయన తలపై ఇజ్రాయెల్ ప్రభుత్వం 6.22 కోట్ల రూపాయల రివార్డు ప్రకటించింది. అక్టోబర్ 7, 2023న ఇజ్రాయెల్‌పై జరిగిన దాడులకు కీలక ప్రణాళిక రచయితలలో అల్‌హద్దాద్ ఒకరని, ప్రస్తుతం ఇజ్రాయెల్ బందీలను నిర్బంధంలో ఉంచిన బృందాన్ని కూడా ఆయనే నియంత్రిస్తున్నారని వార్తలు వస్తున్నాయి. హమాస్‌లోని అత్యధిక సీనియర్ నాయకులు మరణించిన నేపథ్యంలో, అల్‌హద్దాద్ ఇప్పుడు సైనిక వ్యూహర చనతో పాటు బందీలపై చర్చలను కూడా నిర్దేశించే అవకా శం ఉంది. ఈ పరిణామాలపై స్పందించిన ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్, తదుపరి వరుసలో నువ్వే ఉన్నావని అల్‌హద్దాద్‌ను నేరుగా హెచ్చరించారు. ఈ పరిణా మం గాజాలో ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.

# అయోధ్యను సందర్శించిన ఎలాన్‌మస్క్ తండ్రి ఎరోల్‌మస్క్

**అయోధ్య, జూన్ 4:** ప్రపంచ కుబేరుడు, టెస్లా బాస్ ఎలాన్ మస్క్ తండ్రి ఎరోల్ మస్క్ భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరానికి వెళ్లారు. అక్కడ నూతనంగా నిర్మించిన అయోధ్య రామ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడారు. భారతదేశం ఓ అద్భుతమైన ప్రదేశం అని పేర్కొన్నారు. ఇక్కడ ప్రజలు ప్రేమ, దయ కలిగిన వ్యక్తులు అని అన్నారు. కాగా, దక్షిణాఫ్రికాకు చెందిన ఎరోల్ మస్క్ తన స్కూల్ ఫ్రెండ్ అయిన మాయే మస్క్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు పిల్లలు పుట్టారు. ఆ తర్వాత కొన్నేళ్లకే వీరు విడాకులు తీసుకున్నారు. మాయే మస్క్ తన ముగ్గురు పిల్లల్ని ఒంటరిగానే పెంచింది. సింగిల్ మదర్‌గా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. ఇక ఎలాన్ మస్క్‌కు తన తండ్రి ఎరోల్ మస్క్‌తో విభేదాలు ఉన్న విషయం తెలిసిందే. తండ్రంటే మస్క్‌కు అస్సలు ఇష్టం ఉండదు.



'మా నాన్న దుర్మార్గానికి ప్రతిరూపం. ఒక మనిషి ఎంత దారుణానికి ఒడిగట్టగలడో, అంతా తను చేయగలడు' అని ఓ సందర్భంలో స్వయంగా మస్క్ భారంగా వెల్లడించాడు.

### భారత్ దౌత్య బృందాల సమావేశాన్ని పాకిస్థాన్ అడ్డుకునే ప్రయత్నం..

# పట్టించుకోని మలేసియా ప్రభుత్వం!

**న్యూఢిల్లీ, జూన్ 4:** ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాలకు వివరించడానికి పార్లమెంటు సభ్యులతో కూడిన ప్రతినిధి బృందాలు ఆయా దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. జనతా దళ్‌కు చెందిన పార్లమెంట్ సభ్యుడు సంజయ్ ఝా నేతృత్వంలోని అఖిలపక్ష దౌత్య ప్రతినిధి బృందం మలేసియాలో నిర్వహించాలనుకున్న కార్యక్రమాలన్నింటిని రద్దు చేయాలంటూ పాక్ ఎంబసీ మలే సియా ప్రభుత్వాన్ని కోరింది. ఈ సమయంలో మతం అంశాన్ని ముందుపెట్టింది. 'మనవి ముస్లిందేశాలు భారత ప్రతినిధుల మాటలు వినకండి.

ఆ దేశ బృందం కార్యక్రమాలను రద్దు చేయండి' అని అభ్యర్థించింది. దీంతోపాటు కశ్మీర్ అంశం ఐక్యరాజ్యసమితి పరిశీలనలో ఉం దని కొన్ని దేశాలను భారత్‌కు దూరం చేసే ప్రయత్నాలు చేసింది. కానీ మలేసియా మాత్రం ఇవేవీ పట్టించుకోలేదు.

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూసేకరణ) శాఖ

ఫారం-6
(ప్రాథమిక ప్రకటన)
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని చాప్టర్ III ఎ లోని 10 ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఏ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. ఎ/40/2025 తేది: 04.06.2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి ఫైల్ నెం. ఖ/2602/2025 తేది: 04.06.2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఎ) యాదాద్రి భువనగిరి
ఫైల్ నెం. ఎ/11/2025 తేది: 03.06.2025

తెలంగాణ ప్రభుత్వము/ జిల్లా కలెక్టర్, యాదాద్రి-భువనగిరి గారి ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం, ముగుద్ధుంపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 29.13 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని భావించినందున సదరు భూసేకరణ ప్రకటన జారీచేయనైనది.
ప్రభుత్వము ఉత్తర్వుల నెం. 108 I & CAD (LA.R&R/A2) Department Dt: 31.10.2017 ద్వారా బునాదిగాని కాలువ కొరకు భూసేకరణ నష్టపరిహారం మరియు పునరుపాధి కల్పన (పారదర్శకత మరియు న్యాయబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు) చట్టం-2013 లోని చాప్టర్-II (సామాజిక ప్రభావ లెక్కింపు అధ్యయనం) మరియు చాప్టర్-III (ఆహార భద్రత పరిరక్షణ) వర్తింపు నుండి మినహాయింపు ఇవ్వనైనది.
ఇట్టి ప్రాజెక్టు పునరావాసం మరియు పునరుపాధి కల్పనకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) యాదాద్రి భువనగిరి గారిని కార్యనిర్వాహకునిగా (అడ్మినిస్ట్రేటర్) గా నియమించనైనది.
కావున, పైన తెలిపిన బునాదిగాని కాలువ నిర్మాణ నిమిత్తం యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, ముగుద్ధుంపల్లి గ్రామములో విస్తీర్ణం ఎ. 29.13 గుంటల భూమి యొక్క వివరములు ఈ దిగువ చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

జిల్లా: యాదాద్రి భువనగిరి మండలము: బీబీనగర్ గ్రామం: ముగుద్ధుంపల్లి

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారుని పేరు మరియు తండ్రి/ భర్త పేరు | అనుభవదారుని పేరు మరియు తండ్రి/ భర్త పేరు | సేకరించు విస్తీర్ణం (ఎ.గుం) | ఇతర వివరములు |
|---|---|---|---|---|
| 203 ఖుష్కీ/పట్టా 1.29 | గుండెబోయిన భారతమ్మ తండ్రి సత్తయ్య | గుండెబోయిన భారతమ్మ తండ్రి సత్తయ్య | 1.29 | |
| | బాత్క లింగయ్య తండ్రి మైసయ్య | బాత్క లింగయ్య తండ్రి మైసయ్య | | |
| | బాత్క నవీన్ కుమార్ తండ్రి బాత్క మల్లయ్య | బాత్క నవీన్ కుమార్ తండ్రి బాత్క మల్లయ్య | | |
| | గుండెబోయిన యాదయ్య తండ్రి రామస్వామి | గుండెబోయిన యాదయ్య తండ్రి రామస్వామి | | |
| | గుండెబోయిన స్వామి తండ్రి రామస్వామి | గుండెబోయిన స్వామి తండ్రి రామస్వామి | | |
| | గుండెబోయిన అగయ్య తండ్రి అయిలయ్య | గుండెబోయిన అగయ్య తండ్రి అయిలయ్య | | |
| | గుండెబోయిన మల్లయ్య తండ్రి రాజుకొండ మల్లయ్య | గుండెబోయిన మల్లయ్య తండ్రి రాజుకొండ మల్లయ్య | | |
| | గుండెబోయిన వెంకటేశం తండ్రి మైసయ్య | గుండెబోయిన వెంకటేశం తండ్రి మైసయ్య | | |
| | గుండెబోయిన బాల్ నర్సింహ్మా తండ్రి ఇస్తారి | గుండెబోయిన బాల్ నర్సింహ్మా తండ్రి ఇస్తారి | | |
| | గుండెబోయిన నరహరి తండ్రి ఇస్తారి | గుండెబోయిన నరహరి తండ్రి ఇస్తారి | | |
| 204 ఖుష్కీ/పట్టా 0.23 1/2 | గుండెబోయిన నరహరి తండ్రి ఇస్తారి | గుండెబోయిన నరహరి తండ్రి ఇస్తారి | 0.23 1/2 | |
| | బాత్క దానమ్మ తండ్రి స్వామి | బాత్క దానమ్మ తండ్రి స్వామి | | |
| | బాత్క మల్లయ్య తండ్రి స్వామి | బాత్క మల్లయ్య తండ్రి స్వామి | | |
| | బాత్క నవీన్ కుమార్ తండ్రి బాత్క మల్లయ్య | బాత్క నవీన్ కుమార్ తండ్రి బాత్క మల్లయ్య | | |
| | అలసాడి వెంకటేష్ తండ్రి అలసాడి లక్ష్మయ్య | అలసాడి వెంకటేష్ తండ్రి అలసాడి లక్ష్మయ్య | | |
| | గుండెబోయిన యాదయ్య తండ్రి రామస్వామి | గుండెబోయిన యాదయ్య తండ్రి రామస్వామి | | |
| | గుండెబోయిన స్వామి తండ్రి రామస్వామి | గుండెబోయిన స్వామి తండ్రి రామస్వామి | | |
| | గుండెబోయిన సత్యానందం తండ్రి వెంకట నర్సయ్య | గుండెబోయిన సత్యానందం తండ్రి వెంకట నర్సయ్య | | |
| | గుండెబోయిన ఐలయ్య తండ్రి నర్సయ్య | గుండెబోయిన ఐలయ్య తండ్రి నర్సయ్య | | |
| | గుండెబోయిన వెంకటేశం తండ్రి మైసయ్య | గుండెబోయిన వెంకటేశం తండ్రి మైసయ్య | | |
| | బింగి ప్రవీణ్ తండ్రి మల్లేశ్ | బింగి ప్రవీణ్ తండ్రి మల్లేశ్ | | |
| | గుండెబోయిన నర్సమ్మ భర్త బాలనర్సింహ్మా | గుండెబోయిన నర్సమ్మ భర్త బాలనర్సింహ్మా | | |
| 205 ఖుష్కీ/పట్టా 0.04 1/2 | నాపబోయిన నరేశ్ తండ్రి నాపబోయిన నర్సింహా | నాపబోయిన నరేశ్ తండ్రి నాపబోయిన నర్సింహా | 0.04 1/2 | |
| | నాచబోయిన రాజయ్య తండ్రి రాజయ్య | నాచబోయిన రాజయ్య తండ్రి రాజయ్య | | |
| | నాచబోయిన శ్రీను తండ్రి రాజయ్య | నాచబోయిన శ్రీను తండ్రి రాజయ్య | | |
| | గుండెబోయిన క్రిష్ణ తండ్రి నరహరి | గుండెబోయిన క్రిష్ణ తండ్రి నరహరి | | |
| 206 ఖుష్కీ/పట్టా 0.10 | నాపబోయిన నరేశ్ తండ్రి నాపబోయిన నర్సింహా | నాపబోయిన నరేశ్ తండ్రి నాపబోయిన నర్సింహా | 0.10 | |
| | నాచబోయిన రాజయ్య తండ్రి రాజయ్య | నాచబోయిన రాజయ్య తండ్రి రాజయ్య | | |
| | గుండబోయిన చందు యాదవ్ తండ్రి గుండెబోయిన నరహరి | గుండబోయిన చందు యాదవ్ తండ్రి గుండెబోయిన నరహరి | | |
| | గుండెబోయిన క్రిష్ణ తండ్రి గుండెబోయిన నరహరి | గుండెబోయిన క్రిష్ణ తండ్రి గుండెబోయిన నరహరి | | |
| 207 ఖుష్కీ/పట్టా 0.02 | నాపబోయిన నరేశ్ తండ్రి నాపబోయిన నర్సింహా | నాపబోయిన నరేశ్ తండ్రి నాపబోయిన నర్సింహా | 0.02 | |
| | నాచబోయిన రాజయ్య తండ్రి రాజయ్య | నాచబోయిన రాజయ్య తండ్రి రాజయ్య | | |
| | గుండబోయిన చందు యాదవ్ తండ్రి నరహరి | గుండబోయిన చందు యాదవ్ తండ్రి నరహరి | | |
| 208 ఖుష్కీ/పట్టా 0.15 1/2 | గుండెబోయిన శ్రీనివాస్ తండ్రి ఐలయ్య | గుండెబోయిన శ్రీనివాస్ తండ్రి ఐలయ్య | 0.15 1/2 | |
| | బాత్క దనమ్మ తండ్రి శ్రీశైలం | బాత్క దనమ్మ తండ్రి శ్రీశైలం | | |
| | గుండెబోయిన యాదయ్య తండ్రి రామస్వామి | గుండెబోయిన యాదయ్య తండ్రి రామస్వామి | | |
| | గుండెబోయిన స్వామి తండ్రి రామస్వామి | గుండెబోయిన స్వామి తండ్రి రామస్వామి | | |
| | గుండెబోయిన సత్యానందం తండ్రి వెంకట నర్సయ్య | గుండెబోయిన సత్యానందం తండ్రి వెంకట నర్సయ్య | | |
| | కొమ్ము హరిత తండ్రి కొమ్ము రమేశ్ | కొమ్ము హరిత తండ్రి కొమ్ము రమేశ్ | | |
| | మనోజ్ కుమార్ ఇదుల్ల తండ్రి దరత్ కుమార్ ఇదుల్ల | మనోజ్ కుమార్ ఇదుల్ల తండ్రి దరత్ కుమార్ ఇదుల్ల | | |
| | గుండెబోయిన బాల్ నర్సింహ్మా తండ్రి ఇస్తారి | గుండెబోయిన బాల్ నర్సింహ్మా తండ్రి ఇస్తారి | | |
| | గుండెబోయిన వెంకటేశం తండ్రి మైసయ్య | గుండెబోయిన వెంకటేశం తండ్రి మైసయ్య | | |
| | బింగి ప్రవీణ్ తండ్రి మల్లేశ్ | బింగి ప్రవీణ్ తండ్రి మల్లేశ్ | | |
| | గుండెబోయిన నరహరి తండ్రి ఇస్తారి | గుండెబోయిన నరహరి తండ్రి ఇస్తారి | | |
| 258 ఖుష్కీ/పట్టా 0.07 | కుచ్చుల శ్రీశైలం తండ్రి మల్లయ్య | కుచ్చుల శ్రీశైలం తండ్రి మల్లయ్య | 0.07 | |
| | పెద్దింటి కలమ్మ భర్త బాల్ రెడ్డి | పెద్దింటి కలమ్మ భర్త బాల్ రెడ్డి | | |
| | డి. సంధ్య భర్త వెంకట్ రెడ్డి | డి. సంధ్య భర్త వెంకట్ రెడ్డి | | |
| | కమ్మర కరుణ భర్త దేవేందర్ రెడ్డి | కమ్మర కరుణ భర్త దేవేందర్ రెడ్డి | | |
| | కుచ్చుల జంగమ్మ భర్త నర్సింహా | కుచ్చుల జంగమ్మ భర్త నర్సింహా | | |
| | పెద్దింటి బాల్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి | పెద్దింటి బాల్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి | | |
| | పెద్దింటి మంగ భర్త కిషన్ రెడ్డి | పెద్దింటి మంగ భర్త కిషన్ రెడ్డి | | |
| | పెద్దింటి వెంకట్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి | పెద్దింటి వెంకట్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి | | |
| | ఎస్‌టి గాబ్రియల్ ఎడ్యుకేషన్ సొసైటీ | ఎస్‌టి గాబ్రియల్ ఎడ్యుకేషన్ సొసైటీ | | |
| 262 ఖుష్కీ/పట్టా | కుచ్చుల శ్రీశైలం తండ్రి మల్లయ్య | కుచ్చుల శ్రీశైలం తండ్రి మల్లయ్య | 0.05 | |
| [illegible] | [illegible] | [illegible] | [illegible] | |
| 0.05 | కేడియా సల్వెంట్ ఆయిల్ | కేడియా సల్వెంట్ ఆయిల్ | | |
| | బార్ల నర్సింహులు తండ్రి రాములు | బార్ల నర్సింహులు తండ్రి రాములు | | |
| | బుక్యా లకుపతి తండ్రి సొంలా | బుక్యా లకుపతి తండ్రి సొంలా | | |
| | బనోత్ బాలు తండ్రి బాష | బనోత్ బాలు తండ్రి బాష | | |
| | బనోత్ సుధాకర్ తండ్రి బాష | బనోత్ సుధాకర్ తండ్రి బాష | | |
| | బనోత్ రాజ్ కుమార్ తండ్రి బాష | బనోత్ రాజ్ కుమార్ తండ్రి బాష | | |
| | కద్గెకర్ వినయ్ కుమార్ తండ్రి జగదీశ్వర్ | కద్గెకర్ వినయ్ కుమార్ తండ్రి జగదీశ్వర్ | | |
| | కద్గెకర్ ప్రేమ్ రాజ్ తండ్రి లక్ష్మణ్ | కద్గెకర్ ప్రేమ్ రాజ్ తండ్రి లక్ష్మణ్ | | |
| | జిట్టా రజిత భర్త అమరేందర్ రెడ్డి | జిట్టా రజిత భర్త అమరేందర్ రెడ్డి | | |
| | ఐంద్ల శ్రీనివాస్ రావ్ తండ్రి నాగేశ్వర రావు | ఐంద్ల శ్రీనివాస్ రావ్ తండ్రి నాగేశ్వర రావు | | |
| | జిట్టా అనిరుద్ రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | జిట్టా అనిరుద్ రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | | |
| | జిట్టా మాధవి భర్త నర్సి రెడ్డి | జిట్టా మాధవి భర్త నర్సి రెడ్డి | | |
| | ఎంఎస్.ఆర్.ఎన్.కె. అగ్రో కెమికల్ లిమిటెడ్ రోహిత్ కేడియా శ్రీ రతన్ కేడియా | ఎంఎస్.ఆర్.ఎన్.కె. అగ్రో కెమికల్ లిమిటెడ్ రోహిత్ కేడియా శ్రీ రతన్ కేడియా | | |
| | మాధవన్ పిల్లై అరవిందక్షన నారాయర్ | మాధవన్ పిల్లై అరవిందక్షన నారాయర్ | | |
| 383 ఖుష్కీ/పట్టా 3.26 | కె.దామోదర్ రెడ్డి తండ్రి హన్మిరెడ్డి | కె.దామోదర్ రెడ్డి తండ్రి హన్మిరెడ్డి | 3.26 | |
| | జిట్టా అమరేందర్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి | జిట్టా అమరేందర్ రెడ్డి తండ్రి బాల్ రెడ్డి | | |
| | జిట్టా కృష్ణా రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | జిట్టా కృష్ణా రెడ్డి తండ్రి నర్సిరెడ్డి | | |
| | జిట్టా రాంరెడ్డి తండ్రి నర్సిరెడ్డి | జిట్టా రాంరెడ్డి తండ్రి నర్సిరెడ్డి | | |
| | పెద్దింటి నర్సిరెడ్డి తండ్రి సీతారాంరెడ్డి | పెద్దింటి నర్సిరెడ్డి తండ్రి సీతారాంరెడ్డి | | |
| | బానోతు చందు తండ్రి రాజ్యా | బానోతు చందు తండ్రి రాజ్యా | | |
| | బనోతు లక్ష్మణ్ తండ్రి రాజ్యా | బనోతు లక్ష్మణ్ తండ్రి రాజ్యా | | |
| | బనోతు చంద్రు తండ్రి రాజ్యా | బనోతు చంద్రు తండ్రి రాజ్యా | | |
| | వంగేటి నర్సి రెడ్డి తండ్రి ఐలారెడ్డి | వంగేటి నర్సి రెడ్డి తండ్రి ఐలారెడ్డి | | |
| | Department Offices/other Buildings Department Offices/ other Buildings | Department Offices/other Buildings Department Offices/ other Buildings | | |
| | వంగేటి కమలమ్మ భర్త ఐలరెడ్డి | వంగేటి కమలమ్మ భర్త ఐలరెడ్డి | | |
| | గూగులోతు బిచ్చ తండ్రి వసురాం | గూగులోతు బిచ్చ తండ్రి వసురాం | | |
| | వంగేటి క్రిష్ణ రెడ్డి తండ్రి ఐలరెడ్డి | వంగేటి క్రిష్ణ రెడ్డి తండ్రి ఐలరెడ్డి | | |
| | వంగేటి కమలమ్మ భర్త ఐలరెడ్డి | వంగేటి కమలమ్మ భర్త ఐలరెడ్డి | | |
| | గుగులోతు మీన భర్త వసురాం | గుగులోతు మీన భర్త వసురాం | | |
| | వంగేటి రాంరెడ్డి తండ్రి ఐలరెడ్డి | వంగేటి రాంరెడ్డి తండ్రి ఐలరెడ్డి | | |
| | వంగేటి నర్సి రెడ్డి తండ్రి ఐలారెడ్డి | వంగేటి నర్సి రెడ్డి తండ్రి ఐలారెడ్డి | | |
| | వవల్దాస్ వీరేశం తండ్రి లక్ష్మయ్య | వవల్దాస్ వీరేశం తండ్రి లక్ష్మయ్య | | |
| | పబ్బు రమేశ్ తండ్రి రాంకోటి | పబ్బు రమేశ్ తండ్రి రాంకోటి | | |
| | మొత్తం విస్తీర్ణం | | 29.13 | |

భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21/2017) ద్వారా సవరించబడిన భూసేకరణ పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన నష్ట పరిహారాన్ని పొందే హక్కు 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11 (1) యొక్క నిబంధనలను అనుసరించి సంబంధిత వ్యక్తులు అందరికి తెలియజేయుటకుగాను ఈ ప్రకటన జారీ చేయడమైనది.
భూమి యొక్క ప్లాన్, ఏదైనా పని దినము మరియు పని వేళలలో జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా వారి కార్యాలయములో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), విభాగము-2, యాదాద్రి భువనగిరి జిల్లా గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించిన సెక్షన్ 12 ప్రకారం పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇతర పనులు చేపట్టడానికి అనుమతించనైనది.
సెక్షన్ 11(4) ప్రకారం జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి అనుమతి లేకుండా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి నోటిఫికేషనులో ప్రకటించిన భూములకు సంబంధించి ఎవరూ ఎటువంటి లావాదేవీలు/తాకట్లు మొదలగు చర్యలు చేపట్టరాదు.
సదరు చట్టంలోని సెక్షన్ (15) అనుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏవైనా అభ్యంతరాలుగానీ, ఆక్షేపణలుగానీ ఉన్నట్లయితే సేకరణలో ఉన్న భూమితో ఎలాంటి సంబంధం ఉన్న వ్యక్తులైనా, పరిహారం నిర్ణయం కొరకు జరిపే సంప్రదింపుల వల్ల ప్రభావితులయ్యే వారెవరైనా ఇట్టి ప్రకటన జారీచేసిన తేదీ నుండి 60 (అరవై) దినములలోపు జిల్లా కలెక్టరు/ అధీకృత అధికారి గారికి వారి అభ్యంతరములు వ్రాత పూర్వకంగా తెలియజేయవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్ అండ్ ఆర్, విభాగము-2 ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి-భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్ యాదాద్రి-భువనగిరి

DIPR RO No. 202/LA-PP/Advt/Pub/2025-26

# కనీస జాగ్రత్తలు పాటించకుండా రోగులకు ఆహారం

## ప్రభుత్వాస్పత్రుల్లో పరిశుభ్రత లేని భోజనం
## ఆరోగ్యశాఖ విజిలెన్సు తనిఖీల్లో లోపాల గుర్తింపు
## ఎర్రగడ్డ ఆస్పత్రి ఘటనతో మరోసారి వెలుగులోకి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4:** రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వడ్డించే భోజనం విషయంతో శుభ్రత కరువవుతోంది. ముఖ్యంగా వంట గదుల్లో సరైన జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మురుగు పారుతున్న ప్రాంతంలోనే వంటలు చేస్తుండటం సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. అలానే రోగులకు ఆహారం పంపిణీ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల వైద్య ఆరోగ్యశాఖ తనిఖీల్లో రోగులకు ఆహార పంపిణీలో పలు లోపాలు అధికారులు గుర్తించారు. తాజాగా ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో ఆహారం కలుషితమై ఒక రోగి మృతి చెందగా, మరో 70 మంది ఒక్కసారిగా అస్వస్థతకు గురి కావడంతో మరోసారి చర్చనీయాంశమైంది. అస్వస్థతకు గురైన వారి సంఖ్య 92కి పెరిగింది. ఇప్పటికే 18 మందికి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా మరో 74 మందికి ఎర్రగడ్డ వైద్యశాలలోనే గాంధీ, ఉస్మానియా వైద్య బృందాలు చికిత్స అందిస్తున్నాయి. ఆసుపత్రిని సందర్శించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వివరాలను తెలుసుకున్నారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎప్పుడు ఇచ్చే ఆహారంతో పాటు ప్రత్యేకంగా పాయసం అందించినట్లు పేర్కొన్నారు. మానసిక రోగుల అస్వస్థతకు ఆహారమే కారణం కావొచ్చని ప్రాథమికంగా నిర్ధరించినట్లు తెలిపారు. కాగా, ఇటీవల కోఠి ఈఎన్‌టీ హాస్పిటల్‌లో వంటగది ముందు డ్రైనేజీ ఉండటంతో పంది కొక్కులు, ఎలుకలు సంచరిస్తున్నాయని, నాంపల్లి, గోల్కొండ, మలక్‌పేట ఏరియా ఆసుపత్రుల్లో వంట గదుల్లో ఎలుకలు, బొద్దింకలు తిరుగుతున్నట్లు విజిలెన్సు అధికారులు గుర్తించారు. సరోజినీదేవి కంటి ఆసుపత్రి వంట గది పక్కనే మురుగు నీరు పారుతోంది. ఉస్మానియా ఆసుపత్రిలో కిచెన్ పరిసరాల్లో ఎలుకలు, బొద్దింకలు స్వైర విహారం చేస్తున్నాయి. చేతులు పెట్టి రోగులకు భోజనం వడ్డిస్తున్నారు. దీంతో ఆహారం కలుషితమై మరింత అస్వస్థతకు గురవుతున్నారు. ఆసుపత్రిలో చేరిన వారికి ఆహారం అందించేందుకు ఒక్కో రోగికి ప్రభుత్వం రూ.80వంతున కేటాయిస్తోంది. అయితే పలు ఆసుపత్రుల్లో మెనూ పాటించడం లేదని ఇప్పటికే అధికారులు గుర్తించారు. ప్రభుత్వం వద్ద డైట్ బకాయిలు పేరుకుపోయాయని చెబుతూ కొందరు గుత్తేదారులు తోచిన మెను చేస్తున్నారు. సుల్తాన్‌బజార్ మెటర్నిటీ ఆసుపత్రిలో నిత్యం ఒకే తరహా మెనుతో వడ్డించడం వల్ల రోగులు సక్రమంగా తినడం లేదు. రాత్రి సమయంలో చాలామంది రోగులు ఉండటం లేదు. వారి పేరుతో మాత్రం భోజనం వడ్డిస్తున్నట్లు రాస్తున్నారు. గతంలో ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ తరహా ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించారు. కాగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వంట చేసే సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. వంట చేసే ప్రాంతం పరిశుభ్రంగా ఉండాలి. పాత్రలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. వంట గదిలో బొద్దింకలు, ఎలుకలు లాంటివి లేకుండా ఎప్పటికప్పుడు పెస్ట్ కంట్రోల్ చేయాలి. వంట చేసే ప్రాంతంలో మురుగు కాల్వలు, పైపులైన్ల లీకేజీలు ఉండకూడదు. వేడిగా ఉన్నప్పుడే రోగులకు ఆహారం అందించాలి, రోగుల ప్లేట్లు వేడి నీటితో కడుక్కునేలా ఏర్పాట్లు చేయాలి. వడ్డించే సిబ్బంది చేతికి గ్లౌజులు ఉండాలి. తలకు టోపీ, నోటికి, ముక్కుకు మాస్క్ ఉండాలి. ఇలా వంట చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా సిబ్బంది అమలు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రిలోని మానసిక రోగులకు సరైన అన్నం అందించకపోవడం దారుణమని మాజీమంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వం చేతకానితనం వల్లే రోగులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు

# రూ.1.500 కోట్ల రుణం చేసిన సర్కార్

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ సర్కార్ తాజాగా రూ.1,500 కోట్ల రుణం సేకరించింది. రిజర్వ్ బ్యాంక్ నేతృత్వంలో జరిగిన బహిరంగ మార్కెట్లో ప్రభుత్వ సెక్యూరిటీ బాండ్లను ఈవేలం ద్వారా ఈ రుణం సేకరించింది. ఈ అప్పులో 19 ఏండ్లకాల పరిమితికి 6.92శాతం వార్షిక వడ్డీతో రూ.800 కోట్లు, 20 ఏండ్ల కాల పరిమితికి 6.92శాతం వార్షిక వడ్డీతో రూ.700 కోట్లు సమీకరించింది. ఇక 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.14 వేల కోట్ల రుణం కోసం సర్కారు ప్రతిపాదనలు పంపింది. అందులో భాగంగా ఏప్రిల్‌లో మూడు దఫాల్లో రూ.4,400 కోట్లు, మే నెలలో రెండు దఫాల్లో 4,500 కోట్లు అప్పు తీసుకున్నది. తాజా రుణం రూ.1,500 కోట్లు కలిపి రెండున్నర నెలల్లో రూ.10,400 కోట్లు సమీకరించినట్టయింది.



# బాధ్యతల నిర్వహణపై సిఎం దిశానిర్దేశం

## సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ట్రైనీ ఐఎఎస్‌లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణ కేడర్‌కు చెందిన 2024 బ్యాచ్ ట్రైనీ ఐఏఎస్‌లు బుధవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ముఖ్యమంత్రి అభినందించారు. బాధ్యతల నిర్వహణపై వారికి దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రిని కలిసిన ట్రైనీ ఐఏఎస్‌లు సౌరభ్ శర్మ, సలోని ఛబ్రా, హర్ష చౌదరి, కరోలిన్ చింగ్తియన్మయి, కొయ్యడ ప్రణయ్ కుమార్ ప్రస్తుతం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. ఈ భేటీలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి వైస్-ఛైర్‌పర్సన్ శాంతికుమారి, కోర్సు డైరెక్టర్ ఉషారాణి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సైబర్‌క్రైం పోలీసులకు చిక్కిన కేటుగాడు

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** ఐఎఎస్, ఐపిఎస్, సిఆర్‌పిఎఫ్ అధికారు లుగా చెప్పుకు ంటూ బ్యూరోక్రాట్లను మోసం చేయడం, వారికి అసభ్యకరంగా మెసేజ్‌లు పంపుతున్న ఓ సైబర్ నేరగాడిని సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ క్రైం డిసిపి కవిత దీనికి సంబంధించిన వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. రాజస్తాన్‌లోని బహదూర్‌పూర్ పట్టి మీరన్ ప్రాంతానికి చెందిన అర్బాజ్ ఖాన్ (19) అనే యువకుడు కొంతకాలంగా దేశ వ్యాప్తంగా అనేక మందిని ఈ తరహాలో మోసం చేస్తూ అందినంతా దోచుకుంటున్నాడు. నగర ంలో ఓ బ్యూరోక్రాట్‌ను ఇదేరీతిన ఇతను మోసం చేయగా దీనిపై గత నెల 12వ తేదీన ఫిర్యాదు అందింది. ఈ పిర్యాదుపై కేసు నమోదు చేసి విచారణ చేయగా అర్బాజ్ ఖాన్ గుట్టు రట్టయ్యింది. నిందితుడిని రాజస్తాన్‌లోని అతని ఇంట్లో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించి రిమాండుకు పంపారు. నిందితుడి వద్ద ఒక సెల్‌ఫోన్ లభ్యమయ్యింది. ఇతనిపై రాష్ట్రంలోని పలుచోట్ల ఈ తరహా కేసులున్నాయి.

# ఆర్టీసి ఐటిఐ కాలేజీల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్

## 21లోపుగా దరఖాస్తుకు అవకాశం

**హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) అధ్వర్యంలో కొనసాగుతున్న ఐటిఐ కాలేజీల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడింది. హైదరాబాద్, వరంగల్ లోని ఆర్‌టిసి ఐటీఐ కాలేజీల్లో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాలకు ఆసక్తి గల విద్యార్థుల నుంచి టిజిఎస్ ఆర్‌టిసి దరఖాస్తులను స్వీకరించనుంది. మోటార్ మెకానిక్ వెహికిల్, మెకానిక్ డిజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో ప్రవేశాలు జరుగు తున్నాయి. ఈ ట్రేడ్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకు కోరుకున్న ఆర్‌టిసి డిపోల్లో అప్రెంటీషిప్ సౌకర్యాన్ని సంస్థ కల్పిస్తుంది. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో ఈ నెల 21వ తేదీలోపు ఐటిఐ.తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. స్వయం ఉపాధి రంగంలో స్థిరపడాలనుకునే వారికి ఐటీఐ ఒక మంచి అవకాశమని.. నిరుద్యోగ యువ తకు చక్కటి శిక్షణ, బంగారు భవిష్యత్ అందించడంతో పాటు తక్కువ వ్యవ ధిలో ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ ఐటీఐ కళాశాలలను ఆర్‌టిసి సంస్థ ఏర్పాటు చేసినట్టు సంస్థ ప్రకటనలో పేర్కొంది. ఐటీఐ కోర్సుల్లో చేరాల నుకునే విద్యార్థులు హైదరాబాద్ లోని హాకీంపేట, వరంగల్ ములుగురోడ్‌లోని ఐటీఐ కళాశాలలను నేరుగా సంప్ర దించాలని అధికారులు సూచించారు.

# మంత్రి సీతక్కతో మంద కృష్ణమాదిగ భేటీ



**హైదరాబాద్ జూన్ 4, ప్రభాతవార్త:** ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మంద కృష్ణమాదిగ బుధ వారం ప్రజాభవన్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మర్యా దపూర్వకంగా కలిశారు. రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు స్వీకరిం చినందుకు శాలువాతో మంత్రి సీతక్క మంద కృష్ణమాదిగను సత్క రించి అభినందలను తెలిపారు.

# గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ పనుల పురోగతిపై ఆరా

## జిల్లాల వారీగా నివేదికలు తయారుచేయాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం

**హైదరాబాద్ జూన్ 4, ప్రభాతవార్త:** గ్రామీణాభివృద్ధి శాఖలో పెండింగ్ సమస్య లపై బుధవారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహి ళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో గ్రౌండింగ్ అయిన పనుల్లో ఎంతమేర పనులు పూర్తయ్యాయి? ఉపాధి హామీ నిధుల ద్వారా చేపట్టిన పనులు, గ్రామీణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ, కొత్త రోడ్ల నిర్మాణం మరమ్మతులు ఏ స్టేజిలో ఉన్నాయనే అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాల్లో పర్యటించి జిల్లాల వారీగా పనుల ప్రగతిపై సమీక్ష నిర్వహిస్తానని, అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ జి సృజన, మిషన్ భగీరథ కృపాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజి నీరింగ్ విభాగం నివిది కనక రత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధుల సభ చీఫ్‌గా జర్మనీ అనలీనా బేర్‌బాక్

న్యూయార్క్, జూన్ 4 : ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభకు నూతన అధ్యక్షురాలిగా జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేర్‌బాక్ ఎన్నిక అయ్యారు. రష్యా డిమాండ్ చేసినట్లుగా రహస్య బ్యాలెట్ ద్వారానే సభ్య దేశాలు ఓటింగ్‌లో పాల్గొన్నాయి. అయితే మొత్తం ఇద్దరు అభ్యర్థులు ఈ పదవి కోసం పోటీ చేయగా భారీ మెజార్టీతో అనలీనా బేర్‌బాక్ గెలిచారు. జర్మన్ దౌత్యవేత్త హెల్గా ష్మిడ్ ఘోర పరాజయం పాలయ్యారు. ఈ ఎన్నికకు మెజార్టీ మార్కు 88 ఓట్లు మాత్రమే కాగా అనలీనా 167 ఓట్లు సాధించారు. హెల్గా ష్మిడ్‌కు కేవలం 7 ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. ప్రాంతాల వారీగా ప్రతీ ఏటా నిర్వహించే ఈ ఎన్నికలను రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించాలని రష్యా డిమాండ్ చేసింది. అందుకు సభ్య దేశాలు కూడా అంగీకారం తెలిపాయి. దీంతో రహస్యబ్యాలెట్ పద్ధతిలోనే ఓటింగ్ నిర్వహించారు. ముఖ్యంగా అధ్యక్ష పదవి కోసం జర్మనీ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అనలీనా బేర్‌బాక్, జర్మన్ దౌత్యవేత్త అయిన హెల్గా ష్మిడ్ పోటీలోకి దిగారు. మొత్తంగా 193 దేశాలకు ఇందులో సభ్యత్వం ఉండగా ఎన్నికలకు 14 దేశాలు గైర్హాజరు అయ్యాయి. కానీ మిగతా 179 దేశాలు తమకు నచ్చిన అభ్యర్థికి ఓట్లు వేశాయి. ఈ ఎన్నికకు మెజార్టీ మార్కు 88 ఓట్లు మాత్రమే కాగా అనలీనా బేర్‌బాక్‌కు 167 ఓట్లు భారీ మెజార్టీతో ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. 44 ఏళ్ల వయసులో ఈ పదవిని దక్కించుకున్న ఐదో మహిళగా రికార్డు సాధించారు. కానీ మరో అభ్యర్థిగా పోటీ చేసిన హెల్గా ష్మిడ్‌కు కేవలం 7 ఓట్లు మాత్రమే వచ్చాయి. అయితే ఇప్పుడు ఎన్నికల్లో గెలిచిన అనలీనా బేర్‌బాక్ ఈ ఏడాది సెప్టెంబరులో జరిగే సమితి సర్వప్రతినిధి సభ 80వ సమావేశంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న ఫిలెమాన్ యాంగ్ నుంచి అనలీనా ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. అనలీనా బేర్‌బాక్ పూర్తి పేరు అనలీనా షార్లెట్ అల్మా బేర్‌బాక్. 1980లో పశ్చిమ జర్మనీలోని హానోవర్‌లో జన్మించిన ఈమె హాంబర్గ్ విశ్వవిద్యా లయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో చదువుకున్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చా రు. 2021లో జర్మనీ విదేశాంగ శాఖ మంత్రిగా ఎన్ని కయ్యారు. ఐదేళ్లపాటు తన సేవ లను అందించారు. తాజాగా ఐక్యరాజ్య సమితి సర్వప్రతి నిధి సభకు నూతన అధ్యక్షు రాలిగా భారీ మెజార్టీతో గెలిచి మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధం అవుతున్నారు.

## త్వరలో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకాలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 4: తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్‌న్యూస్ చెప్పింది. త్వరలో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)ల నియామకాలను ప్రభుత్వం చేపట్టనుంది. ఈ మేరకు పోస్టుల భర్తీకి ప్రభుత్వం బుధవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 285 ఏపీపీ పోస్టులు ఉండగా.. వాటిల్లో 120 మంది మాత్రమే సర్వీసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో కొత్త నియామకాలకు ప్రభుత్వం అనుమతి తెలపడంతో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రాసిక్యూ షన్ (డీఓపీ)ల్లో త్వరలోనే పెద్దమొత్తంలో పోస్టులు భర్తీ చేయనుంది.2022లో ప్రభుత్వం చివరిసారిగా 92 ఏపీపీ పోస్టులకు నియామక నోటిఫికేషన్ జారీ చేసింది.శిక్షణ తర్వాత వారంతా విధుల్లో చేరారు. వీరిలో కొందరికి పదోన్నతులు దక్కడంతో దాదాపు 165 ఏపీపీ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈమేరకు ఇందులో 118 పోస్టులను త్వరలోనే భర్తీ చేసేందుకు ప్రకటన జారీ చేయనుంది.

## రాష్ట్ర వాటా యూరియా సరఫరా చేయని కేంద్రం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి

హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త : ఈ వానాకాలంలో రాష్ట్రానికి 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్ర ప్రభుత్వం కేటాయించినా, పూర్తి స్థాయిలో సరఫరా చేయలేదని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలవారీ సరఫరా ప్రణాళికను రాష్ట్రానికి పంపించినా ఆ మేరకు సరఫరా చేయలేదన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా సీజన్ ఆరంభానికి ముందే తాము 5 లక్షల టన్నుల యూరియాను నిల్వ ఉంచామని చెప్పారు,

యూరియా, ఎరువుల సరఫరాలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో ఎప్రిల్‌లో 48 వేల టన్నులు, మేలో 66 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తక్కువగా సరఫరా చేయడంతో రాష్ట్రానికి మొత్తం 1.14 లక్షల టన్నుల కోత ఏర్పడిందని వివరించారు. నెలవారీ కేటాయింపులను పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని తాను, అధికారులు గతంలోనే కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అయినప్పటికి, కేంద్రం జూన్‌లో రాష్ట్రానికి కేటాయించిన 1.70 లక్షల టన్నులలో 37 శాతం దేశీయ కంపెనీల నుండి 67 శాతం ఇంపోర్టెడ్ యూరియా నుండి కేటాయించడం జరిగిందన్నారు. అంతేకాకుండా గత రెండు నెలల కేటాయింపులలో తక్కువగా సరఫరా చేసిన 1.14 లక్షల టన్నుల విషయంలో కేంద్రం నుండి ఎటువంటి స్పందన రాకపోవడంతో ఢిల్లీకి అధికారులను పంపనున్నట్లు వెల్లడించారు.

## తప్పుడు ఇంజెక్షన్ ఇవ్వడంతో ప్రభుత్వాస్పత్రిలో ఆరుగురు రోగులు మృతి

### ఒడిశాలో విషాదం

భువనేశ్వర్, జూన్ 4: వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఆరు నిండు ప్రాణాలను బలితీసుకుంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు నర్సు తప్పుడు ఇంజక్షన్ ఇవ్వడంతో వారు ప్రాణాలు కోల్పోయారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లా కేంద్రంలో గల సాహిద్ లక్ష్మణ్ నాయక్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆసుపత్రిలో ఐసియు, సర్జికల్ వార్డుల్లో చికిత్స పొందుతున్న ఐదుగురు రోగులు నిన్న రాత్రి వేళ గంటల వ్యవధిలో ప్రాణాలు కోల్పోయారు. వీరు మరణించడానికి కొన్ని నిమిషాల ముందు ఆసుపత్రి సిబ్బంది వీరికి రెండో రౌండ్ ఇంజెక్షన్లు వేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. 'అర్ధరాత్రి సమయంలో ఓ నర్సు వచ్చి మా పక్కన ఉన్న ముగ్గురు రోగులకు ఇంజెక్షన్ ఇచ్చారు. మా సోదరికి కూడా అలాంటి సూది మందు వేశారు. ఆ తర్వాత కొన్ని క్షణాలకే ఆమె నొప్పితో విలవిల్లాడిపోయింది. డాక్టర్ వచ్చి చెక్ చేసేలోపే ప్రాణాలు కోల్పోయింది' అని ఓ మృతురాలి కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆందోళన కొనసాగుతుండగానే ఐసియులో చికిత్స పొందుతున్న మరో రోగికి ఇంజెక్షన్ ఇచ్చారు. కాసేపటికే ఆ రోగి కూడా ప్రాణాలు కోల్పోవడంతో మృతుల సంఖ్య 6కు చేరింది.

చనిపోయిన రోగులంతా ఈ ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారని, సర్జరీ తర్వాత వారి ఆరోగ్యం మెరుగ్గానే ఉందని మృతుల కుటుంబసభ్యులు తెలిపారు. ఎప్పుడయితే ఇంజెక్షన్ డోసు ఇచ్చారో ఆ తర్వాతే వారి ఆరోగ్యం ఉన్నట్లుండి క్షీణించిందని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆసుపత్రి సిబ్బందిపై వారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు.

పోస్టుమార్టం తర్వాతే మృతికి గల కారణాలు తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు. ఘటనపై ఆసుపత్రి యాజమాన్యం ఇంకా స్పందించలేదు. మరోవైపు, కాంగ్రెస్‌నేతలు వైద్య కళాశాల వద్ద ధర్నాకు దిగారు. నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై దర్యాప్తు జరిపిస్తామని కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ విలేకరులకు తెలిపారు. అవసరమయితే రాష్ట్ర ప్రభుత్వం సహాయం కోరుతామన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిరంతరం విద్యుత్‌కు చర్యలు తీసుకోవాలి

### జనరేటర్లను సమకూర్చుకోవాలి, ఎలక్ట్రికల్ ఇంజినీర్లను నియమించుకోవాలి

### అధికారులకు దిశానిర్దేశం చేసిన వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4: ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బుధవారం సచివాలయంలో ప్రభుత్వ ఆసుపత్రు లలో నిరంతరం విద్యుత్తు సరఫరాపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం ఉన్న విద్యుత్ ఉత్పత్తి జనరేటర్‌ల పనితీరు వాటి సామర్థం పై చర్చించారు, రాష్ట్రవ్యాప్తంగా జనరేటర్ సౌకర్యం లేని ఆసుపత్రులలో ఆటోమేటెడ్ జనరేటర్‌లను సమకూర్చుకోవడానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

ఆస్పత్రులలో విద్యుత్ నిర్వహణ కోసం తాత్కాలిక పద్ధతిలో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌లను నియమించుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాల అవసరమైన అత్యవసర పరికరాలను, సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఆస్పత్రులలో నిరంతరం విద్యుత్ సౌకర్యం ఉండేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు.

జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రి లలో నిరంతరం విద్యుత్తు సరఫరా జరిగేలా జిల్లా వైద్య శాఖ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. అనంతరం, సమీక్షలో భాగంగా వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలలో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా లతో పాటు కోవిడ్ టెస్ట్ కిట్స్ లను, అవసరమైన మందులను కొనుగోలు చేయాలని టిజిఎంఎస్ఐడిసి అధికారులను మంత్రి ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకొని శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నిర్మూలనకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో మందుల కొరత లేకుండా లేకుండా అవసరమైన మందులను కొనుగోలు చేయాలన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా చొంగ్తు, ఎస్పీడిసిఎల్ ఎండి ముష్రఫ్ అలీ, ఎన్‌పిడిసిఎల్ ఎండి వరుణ్ రెడ్డి, టీజీ ఎమ్మెస్ ఐడిసి ఎండి ఫణిందర్ రెడ్డి, కాళోజి నారాయణరావు యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ నందకుమార్ రెడ్డి, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డా. నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ డా. అజయ్ కుమార్‌లు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా బాధ్యత

### కేబినెట్ సమావేశంలో నివేదిక సమర్పిస్తాం, పరిష్కారం కనుగొంటాం

### ఉద్యోగ సంఘాల జెఎసి సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి



ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 4: ఉద్యోగుల సమస్యల పరిష్కారం మా ప్రభుత్వం బాధ్యత, సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల సబ్ కమిటీని, అధికారుల కమిటీని నియమించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సబ్ కమిటీ సభ్యులు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు తదితరులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలపై మీ అందరితో చర్చించి సాధ్యమైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి సానుకూలంగా నిర్ణయం తీసుకునే విధంగా సీఎం రేవంత్ రెడ్డి మంత్రుల కమిటీకి సూచించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై నియమించిన త్రీమెన్ కమిటీ ఉద్యోగ సంఘాలతో పలుమార్లు సమావేశమై విజ్ఞప్తులను స్వీకరించారు. మీ వద్ద స్వీకరించిన సమాచారాన్ని కమిటీకి పలు దఫాలుగా వివరించారు. గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలు పేరుకుపోవడంతో అన్ని ఒకేసారి చేయలేక పోయాం, ఇక ఎక్కువ కాలం పెండింగ్‌లో పెట్టకుండా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలనదే ప్రభుత్వ ఆలోచన అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాలకు వివరించారు.

గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో అధికారుల నివేదికతో పాటు నేరుగా ఉద్యోగ సంఘాలతో చర్చించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగస్వాములుగా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. ప్రజలకు చేయాల్సిన పనులు, అందించాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ఆదాయం, వ్యయం వీటన్నిటితో పాటు ఉద్యోగ వ్యవస్థకు ఇవ్వాల్సినవి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతగా భావిస్తుందని డిప్యూటీ సీఎం వివరించారు. ఒకవైపు ప్రజలకు మరోవైపు ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా కలిసి కూర్చుని చర్చించుకుని ముందుకు పోవాలన్న ఆలోచనతోనే క్యాబినెట్ సమావేశానికి ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశమైనట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. వనరులు సమకూర్చుకొని ప్రజలపై అదనంగా ఒక్క రూపాయి భారం పడకుండా ముందుకు పోతున్నాం అదే నేపథ్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ఆర్థికపరమైన కసరత్తు చేస్తున్నాం ఈ కసరత్తు విజయవంతం కావాలని మనసున్న ప్రభుత్వం కోరుకుంటుందని వివరించారు.

ఉద్యోగులకు మంచి చేయాలన్న ఆలోచనతోనే పలుమార్లు సమావేశాలు నిర్వహించామని వివరించారు. ప్రభుత్వ ఆదాయానికి, ఖర్చుకు చేయాల్సిన పనులను బేరీజు వేసుకొని ఆర్థిక భారం ఉన్నప్పటికీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి బలంగా ఉన్నారని డిప్యూటీ సీఎం ఉద్యోగ సంఘాలకు భరోసా ఇచ్చారు. గురువారం క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో ఉద్యోగ సంఘాల సమస్యలపై ఏర్పాటు చేసిన అధికారుల త్రీ మెన్ కమిటీ, ఆర్థిక శాఖ, ఇతర అధికారులతో చర్చించి ఒక నివేదిక రూపొందించి క్యాబినెట్‌కు నివేదిస్తాం, పరిష్కారం కనుగొంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఉద్యోగ సంఘాల నేతలకు వివరించారు. సమావేశంలో అధికారులు నవీన్ మిట్టల్, లోకేష్ కుమార్, కృష్ణభాస్కర్, సందీప్ కుమార్ సుల్తానియా, మహేష్ దత్ ఎక్కా తదితరులు పాల్గొన్నారు.

## టైగర్ కన్జర్వేషన్‌గా కొమురంభీం, కాగజ్‌నగర్

### జిఒ నం 49 రిలీజ్ చేసిన ప్రభుత్వం

### అడవుల్లోకి వెళ్లడానికి ప్రజలకు ఇక ఆంక్షలు

### 3 రాష్ట్రాల సరిహద్దులకు టైగర్ రిజర్వ్ విస్తరణ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 4:పెద్దపులుల మనుగడ, సంరక్షణకు అనేక సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కొమరం భీం, ఆసిఫాబాద్ డివిజన్లను టైగర్ కన్జర్వేషన్ జోన్‌గా ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల ఆవాసంగా ఉన్న ప్రధానమైన పెద్ద పులుల కారిడార్‌ను కన్జర్వేషన్ రిజర్వుగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 49 జారీ చేసింది. కొమరం భీం జిల్లాలోని ఈ రెండు అటవీ డివిజన్‌లు ఇప్పటివరకు కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలోనే కొనసాగుతోంది. తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లోని కొమరం భీమ్ జిల్లాలోని ఈ రెండు డివిజన్ల అటవీ విస్తీర్ణం పరిధి 1,49,288.88 హెక్టార్లుగా విస్తరించి ఉంది. కొత్తగా ప్రభుత్వం ఆమోదించిన కన్జర్వేషన్ రిజర్వ్ అటవీ ప్రాంతం 1492.88 చదరపు హెక్టార్లుగా పేర్కొంది. 78 రిజర్వ్ ఫారెస్ట్ బ్లాకులుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పెద్దపులుల ఆవాసానికి అనువైన కాగజ్‌నగర్ డివిజన్ లోని కదంబ, బెజ్జూర్, గార్లపేట్ ముఖ్యమైన కేంద్రాలుగా గుర్తించారు. కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రభుత్వం గుర్తించడంతో ఆసిఫాబాద్ డివిజన్ లోని ఆసిఫాబాద్, తీర్యాని, రెబ్బెన, కెరమెరి అటవీ రేంజ్ పరిధి, కాగజ్ నగర్ డివిజన్‌లోని కాగజ్ నగర్, సిర్పూర్ టి, బెజ్జూర్, పెంచికల్పేట్, కార్జెల్లి రేంజ్ పరిధిలో పులులు వన్యప్రాణుల సంరక్షణకు ఇక పకడ్బందీ చర్యలు చేపట్టనున్నారు. కొమురం భీం జిల్లాలోని రెండు డివిజన్ లు టైగర్ రిజర్వు కన్జర్వేషన్ పరిధిలోకి రావడంతో మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లాలోని తడోబా, అందేరి, ఇంద్రావతి, ఛత్తీస్‌గఢ్ టైగర్ జోన్ కారిడార్ మరింత వైశాల్యంతో విస్తరించనుంది. మూడు రాష్ట్రాల సరిహద్దులను అనుసంధానం చేస్తూ పెద్దపులలో సంరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఇప్పటికే ఆంక్షలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తుండగా, కొమురం భీం టైగర్ కన్జర్వేషన్ ఏర్పాటు వల్ల వందలాది పల్లెల్లో, అటవీ శివారు గూడెల్లో భయభ్రాంతులకు గురవుతున్నారు. అడవుల్లోకి వెళ్లకుండా నిషేధిస్తూ అటవీశాఖ ఆంక్షలు విధించే అవకాశం ఏర్పడింది. పంటచేలకు, వంట సరుకు కోసం అడవికి వెళ్లాలన్నా అధికారుల అనుమతి తప్పనిసరిగా మారింది. పంట చేనుకు కంచె వేసినా, పూరిగుడిసెకు పొరక తెచ్చినా ఇబ్బందులు తప్పవని ప్రజలు భావిస్తున్నారు.



## ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించండి

### వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు మంత్రి రాజనర్సింహ ఆదేశం

హైదరాబాద్, జూన్ 4, ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ మానసిక ఆరోగ్య కేంద్రంలో అస్వస్థతకు గురైన బాధితులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. మంగళవారం ఆసుపత్రిలో జరిగిన సంఘటనపై మంత్రి విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. ఆస్పత్రి డైట్ కాంట్రాక్టర్‌ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నామని మంత్రి తెలిపారు. అస్వస్థతకు గురైన వారందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఎర్రగడ్డ మానసిక ఆసుపత్రిలో మంగళవారం ఫుడ్‌పాయిజన్ జరగడంతో ఆసుపత్రిలోని రోగులు అనారోగ్యానికి గురయ్యారు. ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు ఆసుపత్రిలో ఇన్‌ఛార్జ్ సివిల్ సర్జన్ ఆర్‌ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ పి పద్మజా విధులను తొలగిస్తూ.. ఆయన స్థానంలో ఉస్మానియా ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ బి శంకర్‌ను ఆస్థానంలో ఇన్‌ఛార్జ్‌గా నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఎర్రగడ్డ మానసికి ఆసుపత్రి డైట్ కాంట్రాక్టర్ కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రకటించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం.. తొక్కిసలాట ఘటనపై కిషన్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 4: బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన చాలా దురదృష్టకరమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనకు పూర్తిగా కర్ణాటక ప్రభుత్వం, పోలీసుల వైఫల్యమే కారణమని మండిపడ్డారు. ఆర్సిబి విక్టరీ పరేడ్ సందర్భంగా బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది అభిమానులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై స్పందించిన కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. స్టేడియం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని తెలిసి కూడా తగిన ఏర్పాట్లు చేయకపోవడం దారుణమన్నారు. అభిమానులను నియంత్రించలేక పోయామని ఆ రాష్ట్ర సిఎం, డిప్యూటీ సిఎం ప్రకటించడం వారి చేతకాని తనానికి నిదర్శనమని ఆయన విమర్శలు చేశారు. తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతించాలని కోరుకుంటున్నానని.. ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కిషన్ రెడ్డి అన్నారు.


## నేడు ఎపి ఎడ్‌సెట్ పరీక్ష

### ఏర్పాట్లు పూర్తి : ఆచార్య ఎవివిఎస్ స్వామి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్ 4, ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా 2025-26విద్యా సంవత్సరంలో బిఈడి కోర్సుల్లో ప్రవేశాల కొరకు నిర్వహించే ఏపి ఎడ్‌సెట్-2025ఆన్‌లైన్ కంప్యూటర్ బెస్డ్ టెస్టుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పర్యావరణ విభాగం ప్రొఫెసర్,ఏపి ఎడ్‌సెట్ - 2025 కన్వీనర్ ఆచార్య ఏవివిఎస్ స్వామి తెలిపారు.ఎడ్‌సెట్ ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టుకు మొత్తం 17,795మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నట్లు వెల ్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 87పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గురువారం మధ్యాహ్నం 2నుంచి 4గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్ మధ్యాహ్నం 12.30నుంచి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించడం జరుగుతుందని, ఒక నిమిషం నిబంధన అమల్లో ఉంటుందని వివరించారు.హాల్ టిక్కెట్‌తోపాటు,ఆధార్‌కార్డు,పాన్‌కార్డు,పాస్‌పోర్టు,ఓటర్ ఐడెంటికార్డు, డ్రైవింగ్ లైసెన్స్,ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు,బ్లూ లేదా బ్లాక్ పెన్ తమవెంట కలిగి ఉండాలన్నారు.ఏపి ఎడ్‌సెట్ ను అత్యంత సమర్థవంతంగా నిర్వహించడానికి పలు విశ్వవిద్యాలయాలకు చెందిన సీనియర్ అధ్యాపకులను కో-ఆర్డినేటర్లుగా నియమించినట్లు తెలిపారు.

## ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీష్ సిసోడియా, సత్యేందర్‌జైన్‌లకు ఎసిబి సమన్లు!

### తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఆరోపణలు..



న్యూఢిల్లీ, జూన్ 4: ఢిల్లీలోని పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడ్డారంటూ ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు మనీశ్‌సి సోడియా, సత్యేందర్ జైన్‌లపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో అవినీతి నిరోధక శాఖ వీరికి సమన్లు జారీ చేసింది. ఈ నెల 6న సత్యేందర్, 9న సిసోడియా ఢిల్లీలోని బ్యూరో కార్యాలయానికి రావాలని అందులో పేర్కొంది. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం ఆప్ ప్రభుత్వ హయాంలో సిసోడియా విద్యాశాఖమంత్రిగా, సత్యేందర్ జైన్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ మంత్రిగా ఉన్నారు. వారి నేతృత్వంలో ఢిల్లీలో 12,748 పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణం తలపెట్టారు. ఈ నిర్మాణంలో రూ.వేల కోట్ల అక్రమాలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. 34 మందికి దీని కాంట్రాక్టులు దక్కగా వారిలో చాలామందికి ఆప్‌తో దగ్గర సంబంధాలు ఉన్నట్లు తేలింది. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తికాకపోగా, భారీగా ఖర్చు చేశారు. తరగతి గదులను 30 సంవత్సరాలు ఉండేలా కడితే వాటికి అయిన ఖర్చు మాత్రం చాలా ఎక్కువగా ఉంది. గడువు ప్రక్రియను పాటించకుండా కన్సల్టెంట్లు, ఆర్కిటెక్ట్‌లను నియమించుకోవడంతో వ్యయం దాదాపు అయిదు రెట్లు పెరిగిపోయింది. ఇటీవల సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదికలో తరగతి గదుల నిర్మాణ ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని పేర్కొంది. కొత్త టెండర్లు తీసుకోకపోవడంతో, ఈ ప్రాజెక్టు వ్యయం రూ.326 కోట్లు పెరిగిందని రిపోర్టులో తెలిపింది. సిసోడియా, జైన్‌లను విచారించేందుకు మార్చిలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడంతో ఏప్రిల్‌లో వీరిపై కేసు నమోదైంది.


# మున్సిపల్ పోరుకు రంగం సిద్ధం

### వార్డుల విభజనకు షెడ్యూల్ విడుదల

### 21 వరకు పూర్తి చేసేలా కసరత్తు

హైదరాబాద్ జూన్ 4, ప్రభాతవార్త: తెలంగాణ ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు సిద్ధమవుతోంది. వార్డుల విభజన ప్రక్రియను జూన్ 21 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్, కరీంనగర్ వంటి ప్రాంతాల్లో వార్డుల సంఖ్య పెంచనున్నారు. ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను సవరించనుంది. త్వరలో రిజర్వేషన్లు ఖరారై, వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. దీనికి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. జూలై నెలలో ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా.. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో కీలకమైన అంశం వార్డుల విభజన. దీనికి సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 21వ తేదీ లోపు ప్రక్రియను పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ కార్యదర్శి శ్రీదేవి సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 43 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉండగా.. వాటిలో ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) బయట ఉన్న 30 పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే వార్డుల విభజన చేపట్టాలని నిర్ణయించారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న 13పట్టణ స్థానిక సంస్థలను జిహెచ్‌ఎంసిలో విలీనం చేయాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించడం. ఈ విలీనం పూర్తయిన తర్వాత, ఆ ప్రాంతాల్లో వార్డుల విభజన చేపడతారు. వార్డుల విభజన చేపడుతున్న వాటిలో 18 కొత్త మున్సిపాలిటీలు, మరో 12 కార్పొరేషన్లు, పాత మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో కరీంనగర్, రామగుండం, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, మంచిర్యాల మున్సి పల్ కార్పొరేషన్లు ఉన్నాయి. అలాగే నర్సంపేట, పరిగి, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, జగిత్యాల, హాలియా వంటి మున్సిపాలిటీలు కూడా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటైన కోహీర్, కేసముద్రం, అశ్వరావు పేట, స్టేషన్ ఘన్‌పూర్, ఏదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్చుకుంద, కొల్లాపూర్, అలియాబాద్, మూడు చింతలపల్లి, ఎల్లంపేట వంటి కొత్త మున్సిపాలిటీల్లో కూడా వార్డుల విభజన జరగనుంది. కొత్తగా ఎలాంటి గ్రామాలు కలవడం కానీ, విడిపోవడం కానీ జరగని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వార్డుల విభజన అవసరం లేదని తేల్చారు. అలాగే.. పాలకవర్గాల పదవీకాలం ఇంకా ముగియని ఏడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ( కొత్తూరు, నకిరేకల్, జడ్చర్ల, వరంగల్, ఖమ్మం, సిద్దిపేట, అచ్చంపేట) ప్రస్తుతం విభజన చేపట్టడం లేదు. వాటి పదవీకాలం పూర్తయిన తర్వాతనే ఈ ప్రక్రియ మొదలవుతుంది. సమీప గ్రామాలను విలీనం చేయడం వల్ల వార్డుల సంఖ్యను పెంచాలని నిర్ణయించా రు. ఉదాహరణకు, మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న 49 వార్డుల సంఖ్య 60కి పెరగనుంది. మంచిర్యాలలో 36 నుంచి 60కి, కరీంనగర్‌లో 60 నుంచి 66కు, రామగుండంలో 50 నుంచి 60కి, కొత్తగూడెంలో 34 నుంచి 60కి వార్డుల సంఖ్యను పెంచనున్నారు. నర్సంపేటలో 24 నుంచి 30కి, పరిగిలో 15 నుంచి 18కి, జగిత్యాలలో 48 నుంచి 50కి పెరగనుండగా, కొల్లాపూర్‌లో మాత్రం వార్డుల సంఖ్య 20 నుంచి 19కి తగ్గనుంది. ఈ విభజన ప్రక్రియలో 2021 జనవరి 30న జారీ చేసిన మార్గదర్శకాలనే అనుసరిస్తున్నారు. వార్డుల విభజన పూర్తవగానే, ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను సవరించే పనిని చేపడుతుంది. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన.. ఓటరు జాబితా తయారీని పూర్తి చేసింది. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితా సిద్ధమైంది.. త్వరలోనే ఎన్నికలకు అవసరమైన రిజర్వే షన్లు ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పట్టణాల్లోనూ వార్డుల విభజన చేపట్టడంతో ఆ తర్వాత ఓటరు జాబితా తయారీ పూర్తికానుంది. అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. పంచాయతీ, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తి కాగానే పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించ నున్నారు. ఇందుకోసం యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో రానున్న రోజుల్లో రాజకీయ కోలాహలం నెలకొననుంది. ప్రభుత్వ స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఈ చర్యలు స్పష్టం చేస్తున్నాయి.

# 'షష్టిపూర్తి' టీమ్‌కు మ్యూజిక్ మాస్ట్రో అభినందనలు



షష్టిపూర్తి చిత్రానికి ఇంత క్రేజు, గుర్తింపు లభించడానికి ప్రధాన కారణం ఇళయరాజా. ఆయన ప్రోత్సాహాన్ని జీవితాంతం గుర్తు పెట్టుకుంటాను. ఇదే ఊపుతో మా ఆయి క్రియేషన్స్ బ్యానర్‌లో మరిన్ని మంచి సినిమాలు తీస్తాను. హీరోగా, నిర్మాతగా చాలా వృద్ధిలోకి వస్తావని ఆయన నన్ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. ఇంతకన్నా నాకేం కావాలి అని సంబరపడి పోయారు రూపేష్. నటకిరీటి డా.రాజేంద్ర ప్రసాద్, అర్చన, రూపేశ్, ఆకాంక్ష ప్రధాన పాత్రల్లో మా ఆయి క్రియేషన్స్ బ్యానర్ పై రూపేశ్ నిర్మించిన చిత్రం షష్టిపూర్తి. పవన్ ప్రభ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం మే 30న విడుదలై, ప్రజాదరణ పొందుతోంది. ఇళయరాజా పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఉదయం చెన్నై వెళ్లి మరీ ఇళయరాజాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసింది షష్టిపూర్తి బృందం. డా.రాజేంద్ర ప్రసాద్, ఇళయరాజాకు పుష్పాభిషేకం చేశారు. ఈ సందర్భంలో డా.రాజేంద్ర ప్రసాద్ ఏప్రిల్ 1 విడుదల, ప్రేమించు పెళ్ళాడు చిత్రాల్లోని పాటల్ని పాడితే, బాగా పాడుతున్నావ్ ప్రసాద్ అని మెచ్చుకున్నారు. ఇళయరాజా గంటసేపు రాజేంద్ర ప్రసాద్, రూపేష్, పవన్ ప్రభ, పాటల రచయిత చైతన్య ప్రసాద్, కెమెరామెన్ రామ్‌తో ముచ్చటించి, షష్టిపూర్తి లాంటి మంచి ప్రయత్నం చేసినందుకు అభినందించారు.

# 6న 'ప్రీ-లుక్' ఫస్ట్ లుక్

బన్నీ వాస్ వర్క్స్‌తో కలిసి నవతరం నిర్మాణ సంస్థలు సప్త అశ్వ క్రియేటివ్స్ మరియు వైరా ఎంటర్‌టైన్మెంట్స్ ఒక ఆసక్తికర చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. తాజాగా ఈ చిత్రం నుంచి కట్టిపడేసే ప్రీలుక్ పోస్టర్ విడుదలైంది. ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారి, ట్రేడ్‌తో పాటు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ తొలిసారిగా సినిమాను సమర్పిస్తుండటం.. ఈ ప్రాజెక్ట్‌పై నమ్మకాన్ని మరింత బలపరుస్తోంది. ఈ చిత్ర నిర్మాతలలో ఒకరైన భాను ప్రతాప గతంలో బన్నీ వాస్‌తో కలిసి తండేల్‌కి పని చేసి, బ్లాక్ బస్టర్‌ను అందించారు. ఈ ద్వయం ఆయ్, సింగిల్ వంటి సినిమాలతో తమ విజయ పరంపరను కొనసాగిస్తూ, ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలను పెంచుతున్నారు. హాయ్ నాన్న వంటి బ్లాక్ బస్టర్ చిత్రాన్ని అందించిన వైరా ఎంటర్‌టైన్మెంట్స్ సంస్థ చేతులు కలపడం ఈ ప్రాజెక్ట్‌కి అదనపు బలాన్ని చేకూరుస్తుంది. తాజాగా ఆవిష్కరించబడిన ఆసక్తికరమైన ప్రీలుక్ పోస్టర్.. ఉత్సుకతను రేకెత్తించడంతో పాటు, నవ్వులను చిందించేలా ఉంది. ఎరుపు రంగు టోపీలు, నీలిరంగు ముసుగులు ధరించి వరుసగా నిల్చొని ఉన్న కొందరు వ్యక్తులతో కూడిన ఈ పోస్టర్.. ఫన్, మిస్టరీ, మ్యాడ్ నెస్‌తో రోలర్‌కోస్టర్‌ను సూచిస్తుంది. జూన్ 6న ఫస్ట్ లుక్‌ని విడుదల చేయనున్నట్లు పోస్టర్ లో ప్రకటించిన నిర్మాతలు.. సరికొత్త వినోదాత్మక చిత్రాన్ని అందించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ చిత్రంతో విజయేంద్ర ఎస్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా.విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ సినిమాకి సోమరాజు పెన్మెత్స సహ నిర్మాత. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా సిద్ధార్థ్ ఎస్.జె, ఎడిటర్‌గా పీకే, ఆర్ట్ డైరెక్టర్‌గా గాంధీ నడికుడికర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రాజీవ్ కుమార్ రామా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా శిల్పా టంగుటూరు వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం ఒక ప్రత్యేకమైన కథన శైలితో వినోదం యొక్క సరికొత్త రుచిని అందించడానికి సిద్ధమవుతోంది. ఆసక్తికరంగా రూపొందించిన ప్రీ లుక్ పోస్టర్ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఫస్ట్ లుక్ విడుదలైన తర్వాత ఈ చిత్రంపై అంచనాలు మరో స్థాయికి వెళ్ళడం ఖాయమని చెప్పవచ్చు. జూన్ 6న ఫస్ట్ లుక్ విడుదల కానుంది. ప్రేక్షకుల ఎదురు చూపులకు తగిన ఫలితం అన్నట్టుగా నటీనటులను ఆవిష్కరిస్తూ ఉండే ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ అసలుసిసలైన మ్యాడ్ నెస్‌ను అందించనుంది.



# 'డకాయిట్' ఫైర్ థీమ్ రిలీజ్



అడివి శేష్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్‌ఇండియన్ థ్రిల్లర్ డకాయిట్. ఇటీవలే విడుదలైన ఫైర్ గ్లింప్స్ ఇంటెన్స్ యాక్షన్, స్టైలిష్ విజువల్స్‌తో అదిరిపోయింది. నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేసింది. విజువల్‌గా ఫైర్ గ్లింప్స్ కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజాగా ఫైర్ థీమ్ రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో ఫైర్ థీమ్‌ని పవర్ ఫుల్‌గా కంపోజ్ చేశారు. ఇది ఆడియన్స్‌కి ఒక మ్యూజికల్ ఫీస్ట్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తోంది. అన్ని మ్యూజిక్ చార్ట్స్‌లో టాప్ ట్రెండింగ్‌లో వుంది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. షానియల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మాతగా, అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం ఈ క్రిస్మస్, డిసెంబర్ 25న గ్రాండ్ థియేట్రికల్ విడుదల కానుంది. ఈ హాలిడే బాక్సాఫీస్‌ను షేక్ చేస్తోందని చెప్పడం ఎలాంటి సందేహం లేదు. శేష్‌కు ఇది తొలి హాలిడే రిలీజ్ కావడం విశేషం.



# 'కుబేర' నుంచి సెకండ్ సింగిల్

ధనుష్, నాగార్జున హైలీ యాంటిసిపేటెడ్ యాక్షన్ ప్యాక్డ్ డ్రామా కుబేర టీం దూకుడుగా ప్రమోషన్స్ చేస్తోంది. తాజాగా రిలీజ్ చేసిన సెకండ్ సింగిల్ అనగనగ కథ సినిమా పవర్ ఫుల్ మోరల్ కోర్‌కి పర్ఫెక్ట్ మ్యూజిక్ ప్రజెంటేషన్‌ని అందిస్తోంది. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై అంచనాలని పెంచుతూ కొత్త సాంగ్ సినిమా సారాంశాన్ని తెలియజేస్తోంది. ఇది దురాశ, అవినీతి మధ్యలో చిక్కుకున్న దుర్బలమైన మానవత్వం ఇతివృత్తాలతో డీప్‌గా కనెక్ట్ అయ్యే సాంగ్. చార్ట్‌బస్టర్ మాస్ నంబర్లకు పేరు గాంచిన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ ఈ అనగనగ కథని మనసుని కదిలించే ట్రాక్‌గా కంపోజ్ చేశారు. గేయ రచయిత చంద్రబోస్ ఆర్థిక అసమతుల్యత, డబ్బు అవినీతి ప్రభావం వంటి సమస్యలను పరిష్కరించడానికి లోతైన పదాలతో అందించిన సాహిత్యం అద్భుతంగా వుంది. ఈ పాట నైతిక దిక్సూచిగా, ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతోంది. హైదే కార్తీ, కరీముల్లా వోకల్స్ ట్రాక్‌కు మరింత ఎనర్జీ నింపాయి. ధనుష్, నాగార్జున డిఫరెంట్ అవతార్స్‌లో కనిపించడం ఆకట్టుకుంది. వారి ఎక్స్‌ప్రెషన్స్ డిఫరెంట్ ఐడియాలజీని ప్రజెంట్ చేస్తున్నాయి. సంపద, హోదాపై వ్యామోహంతో ఉన్న సమాజం ఒత్తిళ్ల ద్వారా రూపొందించబడిన కాంప్లెక్స్ క్యారెక్టర్స్‌ని సూచించే స్నిప్పెట్‌లలో వారి పెర్ఫార్మెన్స్ ఎమోషనల్‌గా వుంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తుండగా, జిమ్ సర్బ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం జూన్ 20న థియేటర్లలోకి వస్తోంది.



అవనీత్ కౌర్ నయా లుక్

# 'ప్రొడక్షన్ నంబర్ 3' షూటింగ్ పూర్తి

టిఎస్ఆర్ మూవీ మేకర్స్ సమర్పణలో ప్రొడక్షన్ నంబర్ 3గా రూపొందిన కొత్త చిత్రం షూటింగ్ విజయవంతంగా ముగిసింది. తిరుపతి శ్రీనివాసరావు నిర్మాణ సారథ్యంలో, ఆదినారాయణ పినిశెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకోనుంది. నటుడు హరికృష్ణ హీరోగా, భవ్యశ్రీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా ప్రేమ, త్యాగం, కుటుంబ విలువలను ఆవిష్కరిస్తూ భావోద్వేగాలతో నిండిన కథాంశంతో రూపొందింది. సినిమాటోగ్రఫీ బాధ్యతలను ప్రభాకర్ రెడ్డి నిర్వహించగా, గౌతమ్ రవిరామ్ సంగీతం సినిమాకు ప్రాణం పోసింది. విజయ్ కందుకూరి రచించిన సంభాషణలు కథను మరింత బలపరిచాయి. ప్రేమ, త్యాగం, కుటుంబ బంధాలను ఆలంబనగా చేసుకున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఒక భావోద్వేగ అనుభవాన్ని అందించనుంది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా నిర్మాత తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మా బృందం అంకితభావంతో పని చేసింది. ఈ సినిమా అందరి హృదయాలను తాకుతుందని ఆశిస్తున్నాం అన్నారు. దర్శకుడు ఆదినారాయణ మాట్లాడుతూ, ప్రేక్షకులకు ఒక అర్థవంతమైన కథను అందించడమే మా లక్ష్యం అని తెలిపారు. త్వరలో విడుదల తేదీని, ఆసక్తికరమైన టైటిల్‌తో ప్రకటించనున్న చిత్ర బృందం, ప్రేక్షకుల నుంచి గొప్ప ఆదరణ ఆశిస్తోంది. బ్యానర్: టిఎస్ఆర్ మూవీ మేకర్స్, ప్రొడ్యూసర్: తిరుపతి. శ్రీనివాస రావు.



# ఒటిటికి 'దేవిక అండ్ డానీ'

జియోహాట్‌స్టార్, డిస్నీ+ హాట్‌స్టార్ నుంచి జియో హాట్ స్టార్‌గా పున: నిర్మితమై ఎప్పటికప్పుడు ప్రేక్షకులకు తిరుగులేని, బెస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా హాట్‌స్టార్ స్పెషల్స్‌లో భాగంగా, ఈ ఓటీటీ ప్లాట్‌ఫామ్ దేవిక అండ్ డానీ అనే వెబ్ సిరీస్‌ను జూన్6 నుంచి అందిస్తుంది. ఈ వెబ్‌సిరీస్‌లో రీతూ వర్మ, సూర్య వశిష్ట, శివ కందుకూరి, సుబ్బరాజు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, కోవై సరళ, సోనియా సింగ్, గోకరాజు రమణ, శివన్నారాయణ, వివా హర్ష, షణ్ముఖ్, అభినయ శ్రీ, మోనికా రెడ్డి, ఈశ్వర్య వుల్లింగల తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. బి.కిషోర్ దర్శకత్వంలో సుధాకర్ చాగంటి దీన్ని నిర్మించారు. జూన్6 నుంచి ఈ సిరీస్ జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది.



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హీరోయిన్ రీతూవర్మ మాట్లాడుతూ, వెబ్ సిరీస్ చేయాలని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాను. ఔట్ ఆఫ్ ది బాక్స్ కాన్సెప్ట్ వస్తే చేద్దామనుకున్నాను. ఆ సమయంలో దేవిక అండ్ డానీ వంటి నిజాయతీతో కూడిన కథ నా దగ్గరకు వచ్చింది. ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇలాంటి ఓ కథను నమ్మి ప్రొడ్యూస్ చేసిన మా సుధాకర్‌గారికి థాంక్స్. ఆయన మంచి సినిమాలను, సిరీస్‌లను అందించాలనే ఉద్దేశంతో జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌ను స్టార్ట్ చేశారు. ఇంకా ఇలాంటిసిరీస్‌లు, సినిమాలను ఎన్నింటినో చేయాలని కోరుకుంటున్నాను. డైరెక్టర్ కిషోర్‌గారు చాలా సరదాగా ఉండే వ్యక్తి. ఫోకస్‌గా ఉంటారు. వెంకట్ దిలీప్‌గారు మిస్టర్ పర్‌ఫెక్ట్. ఇప్పుడు స్క్రీన్‌పై చూస్తుంటే ఆయన ఎంత గొప్పగా ఆలోచించారో అర్థమవుతుంది. మా డానీ సూర్య ఎంతో హార్డ్ వర్కింగ్ పర్సన్. చాలా ఇన్‌వాల్వ్ అయ్యి నటించాడు. సుబ్బు పాత్రలో నటించిన శివ కందుకూరి తన పాత్రలో ఒదిగిపోయారు. సుబ్బరాజు, కోవైసరళ సహా ఎంటైర్‌టీమ్‌కు థాంక్స్. నందిని ఎంతో హార్డ్ వర్క్ చేసింది. తనకు స్పెషల్ థాంక్స్. చాలా మంది అమ్మాయిలకు చుట్టు పక్కల ఉండేవాళ్లు నువ్వు ఇది చేయలేవు అని చెప్పి డిస్కరేజ్ చేస్తుంటారు. కానీ అలాంటి వారికి ఈ సిరీస్ ఓ నమ్మకాన్ని కలిగిస్తుంది. మా సిరీస్ దేవిక అండ్ డానీ జూన్6 నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతుంది అన్నారు. సూర్యవశిష్ట్ మాట్లాడుతూ, సాధారణంగా ఊర్లలో ఉండే అమ్మాయిలకు చాలా ఇబ్బందులుంటాయి. ఈ పని చేయాలని, ఆ పని చేయకూడదని అంటుంటారు. అలాంటివాళ్లు బయటకు వెళితే ఎలా మారుతారనే ఓ విషయాన్ని చక్కగా దేవిక అండ్ డానీలో చూపించారు. దేవిక అనే అమ్మాయి జీవితాన్ని డానీ, సుబ్బు లాంటి పాత్రలు ఎలా మార్చాయనేది కూడా ఇందులో చూడొచ్చు. తప్పకుండా ఈ సిరీస్ అందరికీ నచ్చుతుంది. నిర్మాత సుధాకర్ అరుదైన వ్యక్తి. మా డైరెక్టర్ కిషోర్‌గారు మా ఫ్యామిలీ మెంబర్‌లా మాతో కలిసిపోయారు. సినిమాటోగ్రాఫర్ దిలీప్ ఫ్రేమింగ్, లైటింగ్ సూపర్బ్. నందినిగారు బిహైండ్ ది సీన్స్ ఎంతో కష్టపడ్డారు. ఫ్రెష్ కంటెంట్‌ను అందిస్తోన్న జియో హాట్‌స్టార్‌కి థాంక్స్. రీతూవర్మ చాలా మంచి కోస్టార్. శివ కందుకూరి అయితే నా బ్రదర్‌లా మారిపోయారు. తను అద్భుతంగా నటించాడు. డానీ పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. ఆడియెన్స్‌కు అన్నీ పాత్రలు చక్కగా కనెక్ట్ అవుతాయి అన్నారు. శివ కందుకూరి మాట్లాడుతూ, వెబ్ సిరీస్ అంటే సాధారణంగా ఎంత వల్గర్ ఉందనే దాని గురించి మనం మాట్లాడుతున్నాం. ఇలాంటి పరిస్థితుల్లో దేవిక అండ్ డానీ వంటి క్లీన్ స్క్రిప్ట్‌ను యాక్సెప్ట్ చేయటం గొప్ప విషయం. మంచి వేల్యూస్ ఉన్న స్క్రిప్ట్‌ను ఒప్పుకున్నందుకు జియో హాట్‌స్టార్ వారికి ధన్యవాదాలు. మంచి కంటెంట్‌ను అందించటానికి వారు ముందుకొచ్చారు. మా నిర్మాత సుధాకర్‌గారికి థాంక్స్. సినిమాకు ఏమాత్రం తగ్గకుండా గొప్ప టెక్నికల్ వేల్యూస్‌తో సిరీస్‌ను రూపొందించారు. ఇందులో నేను సుబ్బు అనే పాత్రను పోషించాను. దేవిక అనే అమ్మాయి జీవితంలో వచ్చే ప్రతీ పాత్ర ఎలా ట్రావెల్ చేసిందో ఇందులో మనం చూడొచ్చు. సుబ్బుఅనే ఫన్నీ పాత్రను చేయటాన్ని ఎంజాయ్ చేశాను. నాపై నమ్మకంతో నాకు ఇంత మంచి పాత్ర ఇచ్చిన మా డైరెక్టర్ కిషోర్‌గారికి థాంక్స్. మా అందరినీ ఇంత బాగా చూపించిన మా సినిమాటోగ్రాఫర్ వెంకట్ దిలీప్‌గారికి థాంక్స్. దేవికపాత్రను రీతూవర్మ గొప్పగాచేసింది. ఆమె ఇంతకుముందు చాలా మంచి పాత్రల్లో మనకు కనిపించింది.

# యష్ రాజ్ ఫిల్మ్స్ 'సయ్యారా'

యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మాణంలో మోహిత్ సూరి తెరకెక్కించిన చిత్రం సయ్యారా. వైఆర్ఎఫ్ బ్యానర్ నుంచి వచ్చే ప్రేమ కథా చిత్రాలకు ఉండే ఫాలోయింగ్, క్రేజ్ అందరికీ తెలిసిందే. ప్రేక్షకుల అంచనాలకు తగ్గట్టుగానే ఈ సయ్యారా చిత్రాన్ని రూపొందించారు. అహాన్ పాండేను హిందీ చిత్ర పరిశ్రమకు ఈ చిత్రంతోనే హీరోగా పరిచయం చేయనున్నారు. రీసెంట్‌గా టీజర్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. టీజర్ విడుదలైనప్పటి నుంచి 2025లో అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే రొమాంటిక్ మూవీగా మారింది సైయారా. ఓ వైపు మోహిత్ సూరి, మరోవైపు యష్‌రాజ్ ఫిల్మ్స్ ఇద్దరూ అద్భుతమైన ప్రేమకథలను రూపొందించటంలో సుప్రసిద్ధులు. వీరిద్దరి కలయికలో ఇప్పుడు వస్తున్న ప్రేమకథా చిత్రం సైయారాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. హీరోహీరోయిన్ మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. ఈరోజున యష్‌రాజ్‌ఫిల్మ్స్ సయ్యారా మూవీ నుంచి టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. ఐదేళ్ల నుంచి ఎంతో జాగ్రత్తగా సేకరించి, శ్రద్ధగా రూపొందించిన పాటలు, ఆలోచనలు, స్వరాలన్నీ ఈ సినిమాలో ఉన్నాయని డైరెక్టర్ మోహిత్ సూరి పేర్కొన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, నాకు ఎంతో దగ్గరైన స్నేహితులకు మాత్రమే తెలిసిన విషయమేమంటే నేను కొత్త మ్యూజిక్ డైరెక్టర్స్, సింగర్స్‌ని కలవటానికి ఇష్టపడుతుంటాను. పుస్తకాలను ఎంతో ఇష్టంగా చదివేవాళ్లు పుస్తకాలను ఎలాగైతే సేకరిస్తారో నేను అలాగే పాటలను, స్వరాలను సేకరిస్తుంటాను. సయ్యారా సినిమా విషయానికి వస్తే నేను ఐదేళ్లుగా సేకరించిన పాటలు, ఆలోచనలు, స్వరాలన్నీ ఈ ఆల్బమ్‌లో ఉన్నాయి. మనసుని తాకేలా, సరికొత్త, ఆహ్లాదకరమైన ఆల్బమ్‌ను సయ్యారా సినిమాతో అందించాలనుకుంటు న్నాను. కొత్తవారితో చేస్తున్న ఈ సినిమాలో పాటలన్నీ.. సరికొత్త రొమాంటిక్ ఆల్బమ్‌ను సిద్ధం చేయాలనుకుని చేసినవే. ఈ పాటలు నా హృదయానికెంతో దగ్గరైనవి. ప్రతీ పాట నాకెంతో ప్రత్యేకమైనది. ప్రమోషన్స్‌లో భాగంగా ముందుగా సయ్యారా టైటిల్ ట్రాక్‌ను విడుదల చేశాం. ఈ పాటలో ప్రేమ, ఆర్ద్రత, ఓ ఆత్మ ఉంటుంది. ఈ పాటతో నేను వెంటనే ప్రేమలో పడ్డాను. సయ్యారా టైటిల్ ట్రాక్‌తో పాటు ఫహీమ్ అబ్దుల్లా, అర్సలాన్ నిజామి అనే ఇద్దరు అత్యంత ప్రతిభావంతమైన భారతీయ సంగీత దర్శకులు, గాయకులను (కాశ్మీర్ నుండి) బాలీవుడ్‌కు పరిచయం చేయబోతున్నాం. ఈ ట్రాక్‌ను ప్రతిభాశాలి తనిష్క్ బాగ్చీ స్వరపరిచారు. ఫహీమ్, అర్సలాన్‌ను పరిచయం చేసినందుకు ఆయనకు నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇర్షాద్ కామిల్ ఈ పాటకు అందమైన సాహిత్యాన్ని అందించారు. సయ్యారా మొదటి పాటపై పని చేసిన వాళ్లంతా అద్భుతమైన ప్రతిభ కలిగిన కళాకారులు.





# ఖద్దరులో 'టింబక్టు వీవ్స్' మహిళలు !

మల్లెపూవు తెల్లదనం వేడికి ఉపశమనం మనసు మెచ్చే మెత్తదనం..చలివేళ వెచ్చని కవచం పొందూరు ఖద్దరు అనగానే ఈ ఉపమానాలన్నీ గుర్తురావాల్సిందే! రాజసానికీ ప్రతీకే.. అందుకే ఎంతోమంది రాజకీయ నాయకులు, తారల నేస్తంగానూ వెలుగొందింది. శ్రీకాకుళానికే మకుటమైన ఈ నేత ఇప్పుడు అనంతపురంలోనూ సిద్ధమవుతోంది. ఆదరణ కరవైన మహిళలకు ఉపాధినిస్తోంది. కొన్ని దశాబ్దాల క్రితం దేశంలో అందరూ నూలు వడించి దుస్తులను తయారుచేసుకునేవారు. బ్రిటిష్‌వారు అడుగుపెట్టాక వివిధ రకాల వస్త్రాలకు ఆదరణ పెరిగింది. నేటి తరంలో కూడా ఎన్ని రకాల దుస్తులున్నా ఆరోగ్యం, పర్యావరణంపై ప్రేమ లాంటి కారణాలతో సహజ ఖాదీ వస్త్రాల కోసం వెతుకుతోంది. దీన్నే గమనించింది టింబక్టు కలెక్టివ్' సంస్థ. అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి వారి గ్రామాల్లో కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని, సమాజంలో హేళనకు గురవుతున్నారు. పూట గడవని స్థితిలో ఉన్న మహిళలను ఎంపిక చేసింది. వారికి 2007 నుంచి నేతలో శిక్షణనిచ్చింది. పూర్తయ్యాక ఆ మహిళలంతా 2011లో టింబక్టు భవానీ చేనేత సంఘంగా ఏర్పడ్డారు. ముడి నూలు, సహజ రంగులు, పర్యావరణహిత సాంకేతికతను అనుసరిస్తూ మగ్గాలపై పత్తి ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. చీరలు, దుప్పట్లు, చొక్కాలు, పంచెలు ఇలా పలు రకాలుగా తయారు చేసి, 'టింబక్టు వీవ్స్' పేరుతో విక్రయిస్తున్నారు. సహజ సిద్ధమైన 'టింబక్టు వీవ్స్' పేరిట విక్రయిస్తున్నారు. సహజ సిద్ధమైన వస్త్రాలతో ఆర్థిక ప్రగతివైపు అడుగులు వేస్తున్నారు. తయారు చేయాల్సిన డిజైన్లపై ఎప్పటికప్పుడు వారికి అవగాహన కల్పిస్తున్నారు సంస్థ ప్రతినిధులు. ఆసక్తి ఉన్న మహిళలకు చేర్చుకొని శిక్షణనీ కొనసాగిస్తున్నారు. కావాల్సిన ముడినూలును పొందూరు నుంచి తెప్పిస్తున్నారు. దాన్ని పలు విధాలుగా శుభ్రపరిచి... చెట్లు, ఆకులు, బెరళ్లు, కాయలు, పండ్ల వంటి వాటితో తయారు చేసి రంగులు అద్దుతారు. తరవాత మగ్గంపై వస్త్రాలను నేస్తారు. దుస్తులుగానూ రూపొంది స్తున్నారు. చంటి పిల్లలకోసమూ ప్రత్యేక దుస్తులు, టవళ్లు, దుప్పట్లను తయారుచేస్తున్నారు. వీటిని వివిధ పట్టణాలు, నగరాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి సంఘ మహిళల విక్రయిస్తున్నారు. ముడినూలు దిగుమతి నుంచి వస్త్రాలు విక్రయించడం వరకు అన్నీ వీళ్లే చూసుకుంటారు. గతంలో వ్యవసాయ పనులకు వెళ్లేదాన్ని. కుటుంబమంతా కష్టపడినా పూట గడిచేది కాదు. తెలిసినవాళ్ల ద్వారా 2017లో చేనేత సంఘంలో చేరాను. పని నేర్పడమే కాదు, ఆత్మస్థైర్యాన్నీ అందించారు టింబక్టు ప్రతినిధులు. ఇప్పుడు పిల్లలను చక్కగా చదివించుకుంటున్నా. మహిళలం అంతా సంఘటితంగా సాగడం గొప్పగా అనిపిస్తుంది అని చెబుతారు రాజేశ్వరి. మరో సభ్యురాలు చంద్రకళ... 'కూలీ పనులకు వెళ్లేదాన్ని. పనులు లభించని రోజుల్లో కుటుంబ పోషణ కష్టమయ్యేది. ఇప్పుడు నేత పనితో నెలకు రూ.13500 వేతనం అందుకుంటున్నా. వస్త్రాల తయారీ మాత్రమే కాదు, మధ్యవర్తులు లేకుండా మేమే మార్కెటింగ్ చేసుకుంటున్నాం. ఇక్కడ అందరం సమానమే. భేదాభిప్రాయాలకు చోటివ్వం అంటారు.

# ప్రధాని మెచ్చిన రిషిక



**గ్రామీణ నేపథ్యం... మధ్యతరగతి కుటుంబం... గోగాడ రిషిక కలలకు ఇవేమీ అడ్డంకులు కాలేదు. కళల్లో రాణించాలంటే పట్టుదల, అమ్మ చెప్పిన మాటలే ఆమెకిప్పుడు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టాయి. ప్రధాని మోదీ ప్రసంగాలు అందుకునేలా చేశాయి. తాజాగా ముంబయిలో జరిగిన అంతరంగ ఉత్సవాల్లో వేలమందితో పోటీపడి బంగారు పతకాన్ని గెలుచుకున్న రిషిక అంతరంగమిది.**

మాది విజయనగరం దగ్గర ఎస్.కోట. ప్రస్తుతం విశాఖలోని కేంద్రీయ విద్యాలయంలో 12వ తరగతి చదువుతోంది. నాన్న అప్పారావు ప్రైవేటు కళాశాలలో గుమాస్తాగా పనిచేస్తున్నారు. అమ్మ బి. రామలక్ష్మి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్. ఇంట్లో ఎవరికీ సంగీతం, నాట్య రంగంతో సంబంధం లేదు. కానీ నాకు డాన్స్ అంటే ఇష్టం. దాన్ని గుర్తించి అమ్మే నాకు శిక్షణ ఇప్పించింది. తన ప్రోత్సాహంతోనే ఎనిమిదేళ్ల వయసు నుంచి కూచిపూడి నేర్చుకుంటున్నా. మొదట్లో రోజూ శిక్షణ తీసుకునేదాన్ని. కానీ ఇప్పుడు చదువునీ, నృత్యాన్నీ సమన్వయంతో వారానికి నాలుగు సాయంత్రాలు దీనికి కేటాయిస్తున్నా. ఇది నాకు వ్యాపకం మాత్రమే కాదు.. ఒత్తిడికి మంత్రం కూడా. అవకాశం అలా.. విశాఖ క్లాస్టర్ స్థాయిలో జరిగిన పోటీల్లో విజయం సాధించింది. తర్వాత హైదరాబాద్‌లో రీజియన్ లెవెల్లో



పాల్గొన్నా... జాతీయ స్థాయికి ఎంపికయ్యా. ఢిల్లీ కళా ఉత్సవాల్లో పాల్గొని బంగారు. పతకం సాధించాను. దీనితో దేశ రాజధానిలో గుర్తింపు లభించింది. దీని ద్వారానే విద్యార్థులతో ప్రధాని మోదీ ముఖాముఖి నిర్వహించే 'పరీక్షా పై చర్చా' కార్యక్రమంలో పాల్గొనే అవకాశం దక్కింది. అందులో నా ప్రత్యేక నృత్య ప్రదర్శనను ఏర్పాటు చేశారు. అక్కడ ప్రధాని మోదీ బాగా చేశావు అని ప్రశంసించడం మరచిపోలేను. చదువు కుంటూ, నృత్యరీతులపై అధ్యయనం చేయడమే నా లక్ష్యం. బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జరిగిన కూచిపూడి జాతీయ పోటీల్లో నృత్య ప్రయాగ్ అవార్డు సాధించా. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ ఆధ్వర్యంలో 2023లో రూట్స్ టు రూట్స్ సాంస్కృతిక నృత్య విభాగంలో రెండో స్థానంలో నిలిచా. 2019లో ఆల్ ఇండియా ఇంటర్ స్కూల్ పోటీల్లో ప్రతిభా అవార్డును గెలుచుకున్నా.

ఫ్యాషన్ ఫ్యాషన్

# కెంపుల అందం కొత్తగా..










అమ్మమ్మల కాలంలో ఓ వెలుగు వెలిగిన కెంపులు, తెల్ల రాళ్ల నగలు గుర్తున్నాయా? నిన్న మొన్నటి వరకూ వీటిని ఓల్డ్ ఫ్యాషన్ అని చిన్న చూపు చూశాం. కానీ, కాలంతోపాటు అభిరుచులూ మారిపోతాయి కదా! అలా కాలచక్రం గిర్రున తిరిగొచ్చింది. ఇప్పుడు మళ్లీ వీటి హవా మొదలైంది. ముఖ్యంగా ఇవి జత కట్టి మరీ చూపరులను కట్టిపడేస్తున్నాయి. అందుకే, ఇటు సంప్రదాయ వేడుకలైనా, అటు ఫ్యూజన్ పార్టీలైనా రూబీవైట్ స్టోన్స్ చేసిన కాంబినేషన్‌కే మా ఓటు అంటోంది యువతరం. సింపుల్ చోకర్‌లు, గాజులు మొదలగునవి... కళాత్మకంగా తీర్చిదిద్దిన పూలు, లతలతో డిజైన్ చేసిన నెక్లెస్‌లు, ఉంగరాలు, హారాలు ఒకటేమిటి అన్నింటా వీటిపై చేయి. మరి ఇంకెందుకాలస్యం... వీటిని ఎంచుకుని ధరించి మురిసిపోవడమే తరువాయి.
బాగా ఉన్నాయి కదూ!













# బద్ధకాన్ని తగ్గించే ఆసనం

అశ్వం అంటే గుర్రం.. సంచలం అంటే కదలడం. ఈ ఆసనం వేయడం వల్ల తొడల నుంచి ఛాతీ భాగం వరకు శరీరం దృఢత్వాన్ని సంతరించుకుంటుంది. మెదడూ చురుగ్గా మారుతుంది. ఇందుకోసం..నిటారుగా నిలబడి శరీరాన్ని ముందుకు వంచాలి. రెండు చేతులను పాదాలకు ఇరువైపులా ఆనిస్తూ.. కుడికాలిని వీలైనంత వెనకకు చాపి, నేలపై ఆనించాలి. ఎడమమోకాలిని మాత్రం ఫొటోలో చూపిన విధంగా చేతులకు సమాంతరంగా ఉంచాలి. శరీర బరువు రెండు చేతులూ, కుడికాలిపై సమానంగా పడేలా చూసుకోవాలి. చివరిగా తలను కొంతపైకి ఎత్తి వెనకకు వాల్చి నెమ్మదిగా శ్వాస తీసుకుంటూ, కంటి చూపును రెండు కనుబొమల మధ్య నిలిపి ఉంచాలి. ఈ భంగిమలో ఇరవై సెకన్లపాటు ఉండాలి. మకరాసనంలో కాసేపు విశ్రాంతి తీసుకుని, మరోవైపు ప్రయత్నించాలి. చివరిగా శవాసనంలో విశ్రాంతి తీసుకోవాలి. బద్ధకం, అలసట, నీరసం వంటివి దూరం అవుతాయి. సయాటికా, నెలసరి సమస్యలు, ఉన్నవారికి ఈ ఆసనం బాగా పనిచేస్తుంది. వాతపు నొప్పులను దూరం చేస్తుంది. మెకాళ్ల సర్జరీలూ, మెడకు గాయాలైనవారు, ప్రెగ్నెన్సీ సమయంలోనూ ఈ ఆసనానికి దూరంగా ఉండాలి. దీంతోపాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఆకుకూరలు, కాయగూరలను ఎక్కువ తీసుకోవాలి. చిలగడదుంప, డ్రైఫ్రూట్స్, నట్స్.. వంట వాటిలో ఇవి ఎక్కువ ఉంటాయి. చల్లటి ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలి.




## చెలి చిట్కా

✦ వేపపూత బెల్లం కొంచెం ఉప్పు కారం వేసి కొద్దిగా నీరు కలిపినూరండి పచ్చడిలా ఆహారములో తింటే కడుపులో క్రిములో పోవడమేకాక జీర్ణశక్తిని కలిగించి ఆకలిని పుట్టిస్తుంది.

✦ అన్నం మెత్తబడినపుడు కొద్దిగా క్యారెట్‌కోరు వేయండి. పొడిపొడిగా ఉంటుంది.

# వ్యథ: దృక్పథం మార్చుకోండి



**ఎన్.బి.సుధాకర్‌రెడ్డి**
**సైకాలజిస్టు**

ప్రశ్న : నా వయస్సు 45 సంవత్సరాలు. నిత్యం నాలో ప్రతికూల భావాలు చెలరేగుతుంటాయి. మా బంధువులు అందరికంటే మాకు ఆస్తి పాస్తులు ఆధాయం తక్కువ. మా వారు ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నప్పటికి వచ్చే జీతం ఖర్చులకే చాలడం లేదు. మాకు ఇద్దరు అమ్మాయిలు పెద్దమ్మాయి బి.టెక్, చిన్నమ్మాయి ఇంటర్ చదువుతున్నది. ఇప్పటి వరకు వారికోసం పదిగ్రాముల బంగారం కూడ కొనలేదు. భవిష్యత్తులో వారికి మంచి సంబంధాలు చూసిపెళ్ళి చేయడం కూడ కష్టమే. నేను డిగ్రీ వరకు చదివినా ఉద్యోగం చేయకుండా గృహిణిగా మిగిలిపోయాను. మా కాలనీలో కొందరు మహిళలు ఒంటి నిండా నగలు ధరించి పెళ్ళిళ్ళు పేరంటాళ్లకు వస్తుంటారు. అలాంటి సమయంలో కొంత బాధకలుగుతుంది. నేను దురదృష్టవంతురాలినని బాధ కలుగుతుంది. సంపాదన చేతకాని నా భర్త మీద కోపం వస్తుంది. ఇలా ఆలోచించడం తప్పని అనిపించినా ఆపుకోలేక పోతున్నాను. యోగ, ధ్యానం సాధన చేసే ఇలాంటి ఆలోచనలు తగ్గిపోతాయని నా స్నేహితురాలు ఒకామె చెప్పారు. దీనితో గత పదిహేను రోజులుగా ఒక యోగ కేంద్రంలో ఆసనాలు సాధన చేస్తున్నాను. దీనివల్ల రాత్రుల్లో ముందుకంటే బాగా నిద్రపడుతున్నది. మానసిక ఆందోళన, ఒత్తిడికూడా తగ్గింది. అయితే ఆలోచనలు మాత్రం అలాగే ఉన్నాయి. దీనితో తగిన ఆందోళన, ఒత్తిడి మళ్లీ పెరుగుతున్నది. ధ్యానం చేసే సమయంలో ఆలోచనలు నియంత్రించుకోమని గురువు చెప్పారు. అయినా కళ్ళు మూసుకున్నప్పటికి ప్రతికూల భావాలు మనసులో మెదలుతున్నాయి. విసుగు, చిరాకు కోపం అలాగే ఉంది. మరొక స్నేహితురాలి సలహాతో డాక్టరును కలసి పరీక్షలు చేయించాను. రక్తపోటు మధుమేహం బార్డర్‌లో ఉందని చెప్పారు. అనవసర ఆలోచనలు తగ్గించుకుని, యోగ, ధ్యానం సాధన చేయమని సలహా ఇచ్చారు. ఇంకొద్ది రోజులు చూసి మార్పు రాకపోతే సైకియాట్రిస్టును కలసి మందులు వాడమని చెప్పారు. ఈ దశలో నాలో కలిగే ప్రతికూల భావాలు తగ్గించుకునే మార్గం చెప్పండి. **- ఒక సోదరి, విశాఖపట్నం.**



**జవాబు :** అమ్మా మీ సమస్య అర్థం అయ్యింది. ప్రతికూల ఆలోచనలు భయం, ఆందోళన, ఒత్తిడికి కారణంగా పరిణమిస్తాయి. ప్రతికూల భావాలకు దృక్పథంలో లోపం కారణం అనవచ్చు. ఆశలు, ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆలోచనలు, ప్రవర్తన లాంటి పలు అంశాలకు దృక్పథమే మూలం. పెంపకం, పెరిగిన వాతావరణం, జ్ఞానం, అనుభవం, హార్మోన్లు తదితర అంశాలు దృక్పథాన్ని ప్రభావితం చేస్తుంటాయి. మనం ఎంత వద్దనుకున్నా, కాదనుకున్నా పరిసరాలు, హార్మోన్లు మన మనసుపై స్వారీ చేస్తాయి. మనకు ప్రతికూల పరిస్థితులు ఎదురుకాగానే ఒత్తిడి కలిగించే హార్మోన్లు విడుదల అవుతాయి. దీనితో శారీరక మానసిక స్థితిలో మార్పులు వస్తాయి. అయితే నడక, వ్యాయామాలు, యోగ, ధ్యానం వల్ల ఉపశమనం కలుగుతుంది. అయితే పరిస్థితులను బట్టి మళ్లీ సమస్య మొదలవుతుంది.

పొంగుతున్న పాలపై కొన్ని నీళ్లు చిలకరిస్తే పొంగు తగ్గుతుంది. కద్ది సేపటికి క్రింద ఉన్న మంటవల్ల మళ్లీ పాలు పొంగుతాయి. మంట తగ్గించినా, మంట ఆర్పేసిన పాలు పొంగవు. యోగ, ధ్యానం, వ్యాయామాలు పొంగే పాలపై నీళ్ళు చల్లినట్టుగా భావించాలి. అయితే దృక్పథం మార్చుకుని, వివేకం పెంచుకోవడం ద్వారా మంట ఆర్పేసినట్టు అవుతుంది. కాబట్టి ముందు మీరు వాస్తవికంగా మీ సమస్యలను విశ్లేషించండి. సామాజిక దృష్టి కోణంతో పరిశీలించండి. ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించండి. సానుకూల పరిస్థితులను సృష్టించుకోండి మొత్తంగా దృక్పథం మార్చుకుంటే ప్రతికూల ఆలోచనలు అగ్గిపోతాయి.

# వ్యాధినిరోధక శక్తినిచ్చే బెల్లం !

శీతలంలో బెల్లానికి మించిన దివ్యౌషధం మరొకటి ఉండదేమో! వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండే ఈ కాలంలో బెల్లం వ్యాధులు రాకుండా అడ్డుకుంటుంది. శ్వాసకోశ ఇబ్బందులు రాకుండా ఉండేందుకూ ఉపకరిస్తుంది.



★ బెల్లం శరీరంలోని వ్యర్థాలను బయటకు నెట్టేస్తుంది. కాలేయంపై భారం పడకుండా చేస్తుంది. అందుకే భోజనం తర్వాత ఒక చిన్నబెల్లం ముక్క తింటే మంచిదనేది. ★ జలుబు దగ్గువంటివి చికాకు పెట్టే రోజులివి. ఆ సమస్య నుంచి ఉపశమన పొందాలంటే టీలో పంచదారకు బదులు బెల్లాన్ని వాడి చూడండి.

★ బెల్లానికి రక్తాన్ని శుద్ధి చేసే గుణం ఉంది. రోజూ ఓ చిన్నముక్క తింటే రక్తంలోని దోషాలు తొలగిపోతాయి. బిపిని అదుపులో ఉంచుతుంది.

★ దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు రక్తహీనతను తగ్గించి, ఇన్‌ఫెక్షన్లను దరిచేరకుండా చూస్తాయి. కీళ్లనొప్పులు రాకుండా ఉంటాయి. ★ ఫ్యాక్టరీలు, కాలుష్యం ఎక్కువగా ఉండే చోట్ల పనిచేసేవాళ్లు బెల్లాన్ని తింటే ఊపిరితిత్తుల్లో ఉన్న వ్యర్థాలు బయటకు పోయి శరీరానికి మేలు జరుగుతుంది.

★ నెలసరి రోజుల్లో తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవారు రోజూ బెల్లం తింటే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

ఆధ్యాత్మికం

# సాయిని దర్శించగా..



గణపతి **దోంద్ కదం కుటుంబంలో** సహా నాసిక్‌నుండి మన్మాడ్ పోతున్నాడు షిరిడీలో సాయిని దర్శించాలని. ఆ రైలు పెట్టెలో వీరు తప్ప మరెవ్వరూ లేరు. అడవి గుండా పోతోంది రైలు. భిల్లులు ఒకరి తరువాత ఒకరు పరుగెత్తిరైలు ఎక్కారు ప్రయాణికులను దోచుకోవటానికి వారు దొంగలని ఆ కుటుంబానికి తెలియదు. గణపతి భక్త మార్గ ప్రదీప్‌ను పెద్దగా చదువుతున్నాడు, భజనలు కూడా చేయసాగాడు, వచ్చిన వారు కూడా భజనలో పాలుపంచుకుంటారని. అయిదు నిమిషాలు గడిచాయి. ఆ భిల్లులు అందరూ ఒకరి తర్వాత ఒకరు ఎవరో తరుముతున్నట్లు రైలు దిగి పారిపోయారు. ఏమి జరిగిందో గణపతికి అర్థంకాక వెనుతిరిగి చూడగా ఒక ఫకీరు గంభీరంగా కూర్చుని ఉన్నాడు. ఎక్కేముందులేని ఫకీరు ఇప్పుడు ఎలా వచ్చినట్లు? అని ఆశ్చర్యపోయాడు. మరలా చూడగా ఫకీరు అక్కడలేదు. ఇదంతా కల కాదు కదా? అని ఆశ్చర్యపోయాడు గణపతి. షిరిడీ చేరి సాయిని దర్శించగా సాయి క్షేమంగా ప్రయాణించారా? అని అడిగాడు. అప్పుడు అవగతమైంది గణపతికి సాయియే ఆ ఫకీరుని. ఇది సాయి మహా సమాధికి పూర్వం జరిగిన లీలఅహమ్మదాబాద్ నివాసి రతి చిమన్‌లాల్‌కు మే 22, 1948న జరిగిన సంఘటన. ఆయన ఇంకా మరి కొంతమంది స్నేహితులతో అహమ్మదాబాద్ పోవటానికి రైలు ఎక్కారు పేకాడుతూ మాట్లాడుకుంటున్నారు. రైలు నిజాం ప్రాంతం దాటింది. గుల్బర్గా చేరింది. రతిలాల్ మెదడులో ఆందోళన మొదలైంది. భారత దేశమంతా విభజన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆ ప్రదేశమంతా తీవ్రవాద కార్యకలాపాలకు కేంద్రం. తోటి వారితో ఏదో ప్రమాదం జరగబోతోందని చెప్పాడు. అందరూ నవ్వారు.కాని రతిలాల్ సాయి నామ సమస్మరణ ప్రారంభించాడు. అరగంట గడచింది. రైలు గాణుగాపూర్ చేరింది. సాయుధులైన గుంపు ప్రయాణికులను దోచుకోవటం ప్రారంభించింది. రతీలాల్ మాత్రం సాయి నామ స్మరణ ఆపకుండా చేయసాగాడు. ఎక్కడి నుండో ఒక పఠాన్ వచ్చి రతిలాల్ పెట్టే ముందు నిలబడ్డాడు. దోపిడీ దారులెవరు అతనితో తలపడ లేదు. రైలు కదలి షోలాపూర్ చేరింది. రతీలాల్ ఉన్న కంపార్టుమెంటు తప్ప మిగిలిన కంపార్టుమెంట్లలోని వారు ఫిర్యాదు చేశారు దోపిడీ గురించి. ఇక ఆ పఠాన్ ఎవరు? ఇంకెవరు సాయియే! అనే మాట కేవలం రతిలాల్‌దే కాదు, వారందరిది కూడా! సాయి ప్రయాణములలో కూడా మనను కాపాడు గాక !

- యం.పి.సాయినాథ్

### మహిళల హాకీ టోర్నీలో..

# భారత్ విక్టరీ

### ఉరుగ్వేపై 1-3తో గెలుపు



**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల నాలుగు దేశాల హాకీ టోర్నమెంట్‌లో భారత్ జట్టు ఘన విజయం సాధించింది. తమ ఐదవ మ్యాచ్‌లో 2-2తో డ్రాగా ముగిసిన తర్వాత, నిర్ణీత సమయంలో ఉరుగ్వేపై షూటౌట్‌లో భారత్ 3-1 తేడాతో విజయం సాధించింది. అర్జెంటీనాలోని రోసారియోలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ హినా (10వ నిముషం) మరియు లాల్రిన్‌పుయి (24వ నిముషం) మ్యాచ్ ప్రారంభంలోనే భారత్‌ను నియంత్రణలోకి తెచ్చారు, గీతా, కనికా, లాల్తాంట్లుగి షూటౌట్‌లో తమ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విజయాన్ని ఖాయం చేశారు. 10వ నిమిషంలో హినా గోల్ చేయడంతో భారత్ బలమైన ఆరంభాన్ని అందించింది. ఆ తర్వాత 24వ నిమిషంలో లాల్రిన్‌పుయి ఆధిక్యాన్ని రెట్టింపు చేసి హాఫ్ టైం ముగిసే సమయానికి భారతదేశానికి 2-0 ఆధిక్యాన్ని అందించింది. అయితే, చివరి క్వార్టర్‌లో ఉరుగ్వే తిరిగి పుంజుకుంది. 54వ నిమిషంలో ఇనెస్ డి పొసాడాస్ ఒక గోల్ కొట్టింది. మూడు నిమిషాల తర్వాత మిలాగ్రోస్ సీగల్ గోల్ చేసి స్కోరును 22తో సమం చేసింది. షూటౌట్‌లో, గీత, కనికా మరియు లాల్తాంట్లుగి వరుసగా మూడు గోల్స్ చేయడంతో భారత్ విజయపథకంలో నడిచింది. ఉరుగ్వే కేవలం ఒక గోల్ గోల్స్‌కు పరిమితం అయింది. ఇక ఆదివారం జరిగే మ్యాచ్‌లో భారత్ మహిళా జట్టు ఆతిథ్య అర్జెంటీనాతో తలపడనుంది.

# సెమీఫైనల్స్‌కు స్వియాటెక్

### ఎలినాపై 6-1, 7-5 తేడాతో గెలుపు




**న్యూఢిల్లీ:** ప్రపంచ ఐదవ నంబర్ ర్యాంకర్, పోలెండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ వరుసగా నాలుగోసారి రోలాండ్ గారోస్ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. 2020 తర్వాత తొలిసారి క్లే టైటిల్ లేకుండా రోలాండ్ గారోస్‌లోకి అడుగుపెట్టినప్పటికీ స్వియాటెక్ ఇప్పుడు ఐదవ ఫ్రెంచ్ ఓపెన్ కిరీటానికి రెండు విజయాల దూరంలో ఉంది. దీంతో పారిస్‌లో తన విజయ పరంపరను 26వ మ్యాచ్‌కు విస్తరించింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఉక్రెయిన్‌కు చెందిన ఎలినా స్వీటోలినాను 6-1, 7-5 తేడాతో క్వార్టర్ ఫైనల్ పోరులో అద్భుతమైన ఆటతో ఓడించింది. ఈ విజయంతో ఫ్రెంచ్ ఓపెన్‌లో వరుసగా 25 కంటే ఎక్కువ సింగిల్స్ విజయాలు సాధించిన ఐదవ క్రీడాకారిణిగా స్వియాటెక్ నిలిచింది. మొదటి సెట్‌లో స్విటోలినాకు 3 బ్రేక్ పాయింట్లు ఉన్నప్పటికీ స్వియాటెక్ వెనక్కి తగ్గింది. రెండో సెట్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన పోరాటం చేసింది. ఈ సీజన్‌లో 16 విజయాలతో రూయెన్, మాడ్రిడ్, రోమ్‌లలో క్లే కోర్ట్ మ్యాచ్ విన్ లీడర్‌గా మ్యాచ్‌లోకి ప్రవేశించిన ఉక్రెనియన్ స్వీటోలినా స్వియాటెక్‌ను చివరి వరకూ తీసుకెళ్లింది. ఆమె 3-1తో ఆధిక్యంలో కొనసాగింది. రెండవ సెట్‌ను 5-4తో కైవసం చేసుకుని రెండు పాయింట్లు సాధించింది. కానీ గేర్ మార్చిన స్వియాటెక్ రెండవ సర్వ్‌ను క్రాస్‌కోర్ట్ ఫోర్ హ్యాండ్ రిటర్న్‌తో 6-5తో బ్రేక్ చేసింది. కొన్ని క్షణాల తర్వాత మ్యాచ్ తన రాకెట్‌పై ఉండగా, ఆమె వరుసగా రెండు ఏస్‌లను సంధించి మ్యాచ్‌లో రెండవ, మూడవ టర్న్‌లో 1 గంట 41 నిముషాల్లో పోటీని ముగించింది. ఆమె బలీయమైన ప్రత్యర్థిని ఎదుర్కోనుంది. ప్రస్తుత ప్రపంచ నెంబర్ 1 అరినా సబలెంకాతో స్వియాటెక్ తలపడనుంది.

### ఇండోనేసియా ఓపెన్‌లో

# సతీష్-ఆద్య జోడీపై భారత్ ఆశలు

### రోహన్-రుత్విక, ఆశిత్-అమృత, కపిల-తనీషా ఓటమి

**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సతీష్ కుమార్ కరుణాకరన్-ఆద్య వరియత్ జోడీ మినహా మిగిలిన భారత్ జట్లన్నీ నిష్క్రమించాయి. దీంతో మిక్స్‌డ్ డబుల్స్‌లో కరుణాకరన్-వరియత్ జోడీ భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. బుధవారం జరిగిన ఈ ఈవెంట్‌లో ఇతర భారతీయ జంటలు తదుపరి రౌండ్‌కు చేరుకోలేకపోయారు. ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత్ జంట సతీష్ కుమార్ కరుణాకరన్-ఆద్య వరియత్ మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది, అయితే ప్రారంభ ఓటములతో డ్రాలో ఉన్న ఇతర భారత జంటలన్నీ నిష్క్రమించాయి. 45 నిమిషాల పాటు జరిగిన కఠినమైన తొలి రౌండ్ పోటీలో సతీష్ మరియు వరియత్ 15-21, 21-16, 21-17 తేడాతో చైనీస్ తైపీకి చెందిన యే హాంగ్‌వీ మరియు నికోల్ గొంజాలెస్ చాన్‌ను ఓడించారు. కానీ ఈ ఈవెంట్‌లో ఇతర భారత జంటలు తదుపరి రౌండ్‌కు చేరుకోకపోయాయి. అదేవిధంగా మరో భారత్ ద్వయం రోహన్ కపూర్-గద్దె రుత్విక శివాని 14-21, 9-21 తేడాతో జపాన్ జోడీ యుచి షిమోగామి-సయాకా హోబారా చేతిలో ఓడిపోయారు. ఇక డెన్మార్క్‌కు చెందిన మ్యాడ్స్ వెస్టర్‌గార్డ్-క్రిస్టీన్ బుష్‌ల చేతిలో 15-21, 9-21తో భారత్ జంట ఆశిత్ సూర్య, అమృత ప్రముతేష్‌లు ఓడిపోయారు. అలాగే ఇంకో భారత్ ద్వయం ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో కూడా అదే విధిని ఎదుర్కోవలసి వచ్చింది, వారు మలేషియాకు చెందిన రెండవ సీడ్ టాంగ్ జీ చెన్-ఈ వీ తోహ్ చేతిలో 11-21, 21-16, 14-21 తేడాతో ఓడిపోయారు.



# ఐపిఎల్ హీరోస్

### ఆరెంజ్ క్యాప్ విజేతగా సుదర్శన్

### పర్పుల్ క్యాప్ దక్కించుకున్న ప్రసిద్ధ్

### చెన్నై సూపర్ కింగ్స్‌కు ఫెయిర్ ప్లే అవార్డు



**న్యూఢిల్లీ:** ఐపీఎల్-2025 సీజన్ అద్భుతంగా ముగిసింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తమ తొలి ఐపీఎల్ టైటిల్‌ను గెలుచుకుని చరిత్ర సృష్టించింది. ఈ సీజన్‌లో వ్యక్తిగత ప్రదర్శనలతో మెరిసిన పలువురు ఆటగాళ్లకు, అలాగే కొన్ని జట్లకు అవార్డులు లభించాయి. అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్, అలాగే అత్యంత విలువైన ఆటగాడు, ఎమర్జింగ్ ప్లేయర్ వంటి వివిధ అవార్డులను పలువురు ఆటగాళ్లు, టీమ్‌లు దక్కించుకున్నాయి. గుజరాత్ టైటాన్స్ తరపున ఆడిన సాయి సుదర్శన్, ఈ సీజన్‌లో తొలిసారి ఆరెంజ్ క్యాప్ విజేతగా నిలిచాడు. అతను 15 ఇన్నింగ్స్‌లలో 759 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ తొలిసారిగా పర్పుల్ క్యాప్ విజేత అయ్యాడు. ఈ సీజన్ లో అత్యధికంగా 25 వికెట్లు పడగొట్టాడు. గుజరాత్ టైటాన్స్‌కు చెందిన సాయి సుదర్శన్ ఎమర్జింగ్ ప్లేయర్‌గా ఎంపికయ్యాడు. ఈ సీజన్‌లో అతను అత్యధిక పరుగులు సాధించాడు. అత్యధిక ఫోర్లు కొట్టాడు. చెన్నై సూపర్ కింగ్స్ ఫెయిర్ ప్లే అవార్డును గెలుచుకుంది. ఈ సీజన్‌లో ఈ జట్టు పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచినప్పటికీ, ఫెయిర్‌గా ఆడటంలో ముందంజలో ఉంది. ముంబై ఇండియన్స్‌కు చెందిన సూర్యకుమార్ యాదవ్ అత్యంత విలువైన ఆటగాడిగా నిలిచాడు.

అతను 16 మ్యాచ్‌ల్లో 717 పరుగులు చేశాడు. అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ జాబితాలో రెండవ స్థానంలో ఉన్నాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడిన వైభవ్ సూర్యవంశీ సూపర్ స్ట్రైకర్‌గా ఎంపికై అవార్డును గెలుచుకున్నాడు ఈ బ్యాట్స్‌మన్ 206.55 స్ట్రైక్ రేట్‌తో 252 పరుగులు చేశాడు. కేవలం 14 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి అడుగుపెట్టిన వైభవ్, గుజరాత్ టైటాన్స్‌పై కేవలం 35 బంతుల్లో సెంచరీ చేసి చరిత్ర సృష్టించాడు. అతని స్ట్రైక్ రేటు 207గా నమోదైంది. ఈ అవార్డుతో పాటు అతనికి ఒక కారు కూడా బహుమతిగా లభించింది. గుజరాత్ టైటాన్స్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ అత్యధిక డాట్ బాల్స్ వేసిన ఘనతను పొందాడు. ఈ సీజన్‌లో అతను 15 మ్యాచ్‌ల్లో 151 డాట్ బాల్స్ వేశాడు. లక్నో సూపర్ జెయింట్స్ తరపున ఆడిన నికోలస్ పూరన్, అత్యధిక సిక్సర్లు కొట్టినందుకు అవార్డును అందుకున్నాడు. ఈ సీజన్‌లో అతను 40 సిక్సర్లు కొట్టాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన కమిందు మెండిస్ అత్యుత్తమ క్యాచ్‌గా అవార్డును అందుకున్నాడు. అతనుచెన్నై సూపర్ కింగ్స్‌కు చెందిన డెవాల్డ్ బ్రెవిస్ క్యాచ్‌ను ఒంటి చేత్తో పట్టుకున్నాడు. ఈ ఐపీఎల్-2025లో అత్యధిక ఫోర్లు బాదిన ఆటగాడిగా సాయి సుదర్శన్ అవార్డును అందుకున్నాడు. ఈ సీజన్‌లో అతను 88ఫోర్లు బాదాడు. ఈసీజన్‌లో అత్యధిక ఫాంటసీ పాయింట్లు సేకరించినందుకు అవార్డును కూడా అందుకున్నాడు.

# నార్వే చెస్‌లో గుకేష్ ఓటమి

### మహిళల్లో ఆధిక్యంలో హంపి



**న్యూఢిల్లీ:** నార్వే చెస్-2025 టోర్నమెంట్‌లో అమెరికన్ గ్రాండ్‌మాస్టర్ హికారు నకమురా ప్రపంచ ఛాంపియన్, భారత్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ క్లాసికల్ విజయాల పరంపరను బద్దలు కొట్టాడు. మహిళల విభాగంలో కోనేరు హంపి ఏకైక ఆధిక్యంలో ఉంది. నార్వేలో బుధవారం జరిగిన టోర్నీలో గుకేష్‌ను ఓడించి 3 పాయింట్లు సాధించాడు. మాజీ నార్వే చెస్ ఛాంపియన్ నకమురా తన ప్రత్యర్థిపై విజయాన్ని సాధించాడు. దీంతో భారత ఆటగాడి చేతిలో రౌండ్ 3లో ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు. టోర్నమెంట్‌లో నిరాశాజనకమైన ప్రారంభం తర్వాత తిరిగి తన ఉత్సాహాన్ని పొందిన గుకేష్, వరుసగా 6 మరియు 7 రౌండ్లలో ప్రపంచ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సెన్ మరియు ఎరిగైసిలను ఓడించాడు. అయితే ఈ సారి మాత్రం ఇంకా రెండు రౌండ్లు మిగిలి ఉండగా, గుకేష్ 11.5 పాయింట్లతో నకమురాతో మూడో స్థానంలో నిలిచాడు. అమెరికన్ గ్రాండ్ మాస్టర్ కరువానా, ఎరిగైసి చేతిలో ఓడిపోయినప్పటికీ, 12.5 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నాడు. ఆర్మగెడాన్ టైబ్రేక్‌లో చైనాకు చెందిన వీయి చేతిలో ఓడిపోయిన కార్ల్‌సెన్ 12 పాయింట్లతో రెండవ స్థానంలో ఉండగా, ఎరిగైసి 10.5 పాయింట్లతో ఐదవ స్థానంలో ఉన్నాడు. మరోపక్క కోనేరు హంపి రెండు రౌండ్లు మిగిలి ఉండగానే ఆధిక్యాన్ని పొందింది. స్పానిష్ ఇంటర్నేషనల్ మాస్టర్ సారా ఖాడెమ్‌ను ఓడించింది. దీంతో హంపి 13.5 పాయింట్లతో, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ చైనాకు చెందిన జు వెంజున్ కంటే ఒక పాయింట్ ముందంజలో ఉంది. ఇక జు యొక్క ఆరు మ్యాచ్‌ల విజయాల పరంపరను ఆర్మగెడాన్ టైబ్రేక్‌లో 9.5 పాయింట్లతో ఐదవ స్థానంలో ఉన్న ఆర్. వైశాలి బద్దలు కొట్టింది.

# లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**వాణిజ్యం**



**ముంబై, జూన్ 4:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాల మధ్య ఉద యం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు రోజంతా లాభాల్లోనే ట్రేడయ్యాయి. దీంతో వరుసగా మూడురోజులు నష్టాల్లో ముగి సిన సూచీలకు బుధవారం బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 80,777.65 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచి ఇంట్రాడేలో 80,705.18 81,087.29 మధ్య కదలాడింది. ప్రధాన షేర్లలో కొనుగోళ్లతో రాణించిన సూచి చివరకు 260 పాయింట్ల లాభంతో 80,998 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,644.25 వద్ద గరిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 77 పాయింట్ల లాభంతో 24,620.20 వద్ద ముగిసింది. ఎటర్నల్, ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ షేర్లు లాభపడ్డాయి. బజాజ్‌ఫిన్ సర్వ్, యాక్సిస్ బ్యాంక్, టీసీఎస్, టైటాన్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎస్‌బీఐ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.93 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా, బంగారం ఔన్సు 3,387 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ప్రధాన బోర్డు నుంచి వచ్చిన స్కోడా ట్యూబ్స్ ఐపీఓకు షేర్లు నేడు స్టాక్ మార్కెట్లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర 140 కాగా ఆ ధర వద్దే షేర్లు లిస్ట్ అయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం షేర్లు రాణించాయి. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో కంపెనీషేర్లు 5శాతం లాభంతో రూ.147 వద్ద ముగిశాయి. ఎస్ఎంఈ విభాగం నుంచి వచ్చిన నెప్ట్యూన్ పెట్రో కెమికల్ షేర్లు దలాల్‌స్ట్రీట్‌లో లిస్ట్‌అయ్యాయి. ఎస్ఎస్ఈలో 9 శాతం ప్రీమియంతో స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఎంట్రీ ఇచ్చా యి. ఇష్యూ ధర రూ.122 కాగా ఎస్ఎస్ఈలో రూ.132.75 వద్దట్రేడింగ్ మొదలు పెట్టాయి. ఇంట్రాడేలో రాణించిన షేర్లు మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈ లో 14శాతం లాభం తో రూ.139 వద్ద ముగి శాయి.

## సరిహద్దు దేశాలకు ఎఫ్‌డిఐలో ఎలాంటి మార్పుల్లేవ్!

**న్యూఢిల్లీ, జూన్ 4:** భారత్‌తో సరిహద్దులు పంచుకుంటున్న దేశాలకు సంబంధించి విదేశీ ప్రత్యేక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) కేంద్ర ప్రభుత్వం మరోసారి స్పష్టతనిచ్చింది. ఈ పెట్టుబడులకు సంబంధించి ప్రస్తుతం అనుసరిస్తున్న విధానంలో ఎలాంటి మార్పులు చేయడం లేదని సంబంధిత అధికారిక వర్గాలు వెల్లడించాయి. చైనా నుంచి ఎఫ్‌డీఐ దరఖాస్తులను ఎలాంటి పరిశీలన లేకుండానే అనుమతిస్తున్నారంటూ వార్తలు వస్తోన్న వేళ కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఈ మేరకు స్పందించాయి. భారత్‌తో భూ సరిహద్దు పంచుకుంటున్న దేశాల నుంచి పెట్టుబడులకు సంబంధించి 2020లో కేంద్రం ఓ నోట్‌ను విడుదల చేసింది. దీని ప్రకారం.. ఆయా దేశాల పెట్టుబడిదారులు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే పెట్టుబడులు పెట్టేలా షరతు విధించింది. భారత్‌తో భూ సరిహద్దు పంచుకుంటున్న చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్‌లకు సమానంగా వర్తిస్తుందని నోట్‌లో పేర్కొంది. ఈ దేశాల నుంచి వచ్చే అన్ని ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిశీలన, అనుమతుల మంజూరు అంతా ఒకే




ప్రక్రియలో జరుగుతుందని తెలిపింది. ఈ నోట్ విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటివరకు ఎఫ్‌డీఐలో ఎలాంటి సవరణలు చేయలేదు. ప్రస్తుతం పెట్టుబడుల విషయంలో ఎలాంటి మార్పుల్లేవని సమాచారం. విదేశీ పెట్టుబడిదారుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు హోం కార్యదర్శి నేతృత్వంలోని మంత్రిత్వ కమిటీ బాధ్యత వహిస్తోంది.

## వికసిత్ భారత్‌కు 9శాతం వృద్ధి తప్పదు: రఘురామ్ రాజన్

**ముంబై, జూన్ 4:** 2047 నాటికి భారత్ వికసిత్ దేశంగా మారాలనుకుంటే 8, 8.5నుంచి 9శాతం వృద్ధి అవసరమని ఆర్‌బిఐ మాజీ గవర్నర్ ఆర్థిక వేత్త రఘురామ్ రాజన్ తెలిపారు. అందుకు కారణంగా మనది ఇప్పటికీ పేద దేశమేనని అన్నారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన, అనేక అంశాల కారణంగా ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశినచతిని ఎదుర్కొంటోంది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత్ బలమైన జిడిపి గణాంకాలను నమోదు చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం నాలుగవ త్రైమాసికంలో భారత జిడిపి 7.4శాతంగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.5శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలు అనేక దేశాల ఆర్థికవ్యవస్థల కంటే చాలా ఎక్కువ. ప్రస్తుత ఈ వృద్ధి చాలా ముఖ్యమైనదే, కానీ ఎన్నికల వల్ల ప్రభుత్వ వ్యయానికి అవాంతరాలు ఎదురవడం, ఇతర గణాంకాల్లో ఒడుదుడుకులు ఉండడం వల్ల ఇది సరిపోదు. ఇంకా చాలా సాధించాల్సి ఉంది. పెట్టుబడులు వచ్చేందుకు మరిన్ని చర్యలు, వినియోగం పెంచే నిర్ణయాలు, దేశీయ-విదేశీ వ్యాపారాలు భారత్‌వైపు చూసే ధోరణిని కొనసాగించే ప్రయత్నాలు, అధిక వృద్ధిని కొనసాగించే వ్యూహం అవసరమని ఆయన వెల్లడించారు. భారత జిడిపి జపాన్‌ను దాటి నాలుగవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడంపై స్పందించిన రఘురామ్ రాజన్, ఈ మైలురాయిని అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. కానీ మరింత స్థిరమైన లక్ష్యాలు ఏర్పరచుకోవాలని అన్నారు. ఇతర దేశాలను దాటి అతిపెద్ద జిడిపి దేశంగా మారుతుండడం గర్వంగా ఉంది. రాబోయే సంవత్సరాలలో జర్మనీని కూడా దాటగలం. బహుశా మరో 1-2 యేళ్లలో ఇది సాధ్యమవుతుందని ఆయన తెలిపారు. ఇదే సమయంలో జిడిపి ర్యాంకింగ్‌లను నిజమైన ఆర్థిక పురోగతిగా భావించవద్దని ఆయన హెచ్చరించారు. మారకపు రేటు ఈ హెచ్చుతగ్గులను ప్రభావితం చేస్తాయి. జపనీస్ యెన్ బలంగా ఉంది. ఈ అంశాన్ని తేలిగ్గా తీసుకోవడానికి లేదు. మనం ఈదేశాల కంటే చాలా పేదవాళ్లం. సగటు పౌరుడికి మనం ఎంత ధనవంతులు అనేది ముఖ్యం. జిడిపి గణాంకాల హెచ్చు తగ్గులు కాదు. ఎందు కంటే మనం ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశం. కాబట్టి సామాన్య పౌరుడు పేదవాడిగా ఉన్నా సరే, మొత్తం జిడిపి ఎక్కువగా ఉంటుంది.



## మైక్రోసాఫ్ట్‌ను దాటేసిన ఎన్విడియా..

**వాషింగ్టన్, జూన్ 4:** ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా ఎన్విడియా అవత రించింది. మెరుగైన త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో షేర్లు రాణిస్తున్నాయి. మంగళవారం ట్రేడింగ్‌లో కంపెనీ షేర్లు 3.4 శాతం లాభపడ్డాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 3.45 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.296.22 లక్షల కోట్లు) చేరింది. ఇప్పటివరకు ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీల్లో మొదటి స్థానం లో ఉన్న మైక్రో సాఫ్ట్ ప్రస్తుతం రెండో స్థానంలో నిలిచింది. కృత్రిమ మేధ రంగంలో బలమైన స్థానాన్ని కొనసాగిస్తూ మార్కెట్ విలువను గణనీయంగా పెంచుకోవడంతో ఎన్విడియా ఈ ఘనత సొంతం చేసుకుంది.ఎన్విడియా ఏప్రిల్‌తో ముగిసిన తొలి త్రైమాసిక ఫలితాల్నిప్రకటించింది. కంపెనీ ఆదాయం 44.1 బిలియన్ డాలర్లుగా (సుమారు రూ.3.78 లక్షల కోట్లుగా) నమోదైంది. అంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే 12 శాతం, గతేడాది ఇదే సమయంలో నమోదైన ఆదాయంతో పోలిస్తే 69 శాతం వృద్ధి చెందింది. వాణిజ్య ఆంక్షలు, కఠిన నిబంధ నలు ఉన్నప్పటికీ ఎన్విడియా మెరుగైన వృద్ధిని నమోదు చేసింది. కేవలం చిప్‌ల తయారీకే పరిమితం కాకుండా ఏఐకి సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా నిర్మిస్తోంది. రానున్న నాలు గేళ్లలో సుమారు అర ట్రిలియన్ డాలర్ల విలువైన ఏఐ సూపర్ కంప్యూటర్లు, డేటా సెంటర్లను నిర్మిం చాలని లక్ష్యంగా పెట్టుకుంది.






Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.